అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 07-11-2024

సంపుటి : 10 సంచిక : 258 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50

భారత్‌కు దెబ్బే

వాహన, వస్త్ర, ఫార్మాపై అధిక సుంకాలు

దేశీయ సరుకులకు తీవ్ర పోటీ

హెచ్1 జీ వీసా నిబంధనలు కఠినతరమే

నిపుణుల అంచనా



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడిగా డోనాల్ట్ ట్రంప్ ఎన్నిక కానున్న నేపథ్యంలో భారత పారిశ్రామిక రంగంలో ఆందోళన నెలకొంది. అమెరికా కొత్త ప్రభుత్వ తొలి ఎజెండాలో ఆటో మొబైల్స్, వస్త్ర, ఔషధ పరిశ్రమ వస్తువులపై దిగుమతి సుంకాలు భారీగా పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే జరిగితే భారతీయ ఎగుమతిదారులు అధిక కస్టమ్స్ సుంకాలను ఎదుర్కోవలసి ఉంటుందని వాణిజ్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. హెచ్-1బి వీసా జారీ నిబంధనలను కూడా ట్రంప్ కఠినతరం చేయవచ్చు. అదే జరిగితే భారతీయ ఐటీ సంస్థల ఖర్చులు, వృద్ధిపై ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు. భారత ఐటీ ఎగుమతి ఆదాయాల్లో 80 శాతానికి పైగా యుఎస్ నుంచే వస్తున్నాయి. వీసా విధానాలను కఠినతరం చేస్తే ఈ రంగం ఒత్తిడిని ఎదుర్కోనుంది. భారత అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అమెరికా ఉంది. ఐటి సేవల్లో 190 బిలియన్ డాలర్ల వార్షిక వాణిజ్యం నమోదవుతోంది. చైనా సహా భారత్‌పైనా ట్రంప్ అధిక సుంకాలను వేసే అవకాశాలున్నాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవా పేర్కొన్నారు. భారత్ అతిపెద్ద సుంకాల దుర్వినియోగ దేశమని 2020లో ట్రంప్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండో దఫా గెలుపొందిన ట్రంప్ మరోమారు వాణిజ్య భారాలను మోపే అవకాశం లేకపోలేదన్నారు. "ట్రంప్ ప్రభుత్వ ...2లో



ట్రంప్ విజయం

ఉత్కంఠగా సాగిన అమెరికా అధ్యక్ష ఎన్నికలు

ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై స్పష్టమైన ఆధిక్యత



యుద్ధాలు ఆపుతా

అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

ఫ్లోరిడా: యుద్ధాలపై తనకు ఆసక్తి లేదని, కొత్తగా యుద్ధాలు ప్రారంభించనని, వాటిని ఆపుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత మద్దతుదారులను ఉద్దేశిస్తూ ఆయన ప్రసంగించారు. తన రెండవ పరిపాలన అమెరికాకు స్వర్ణ యుగాన్ని తీసుకొస్తుందన్నారు. ఈ దేశానికి బలమైన, శక్తివంతమైన మిలిటరీ కావాలని, కానీ ఆ సైన్యాన్ని యుద్ధాలకు వాడకూడదని అన్నారు. తన మొదటి దశలో 2017 నుంచి 2021 వరకు యుద్ధాలు లేవని, అమెరికా ఎటువంటి కొత్త సమస్యల్లో తలదూర్చలేదని ...2లో

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించారు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి, దేశ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై ఆయన స్పష్టమైన ఆధిక్యతను కనబరిచారు. దీంతో ట్రంప్ 47వ దేశాధ్యక్షుడిగా, రెండోసారి శ్వేతసౌధంలో అడుగు పెట్టబోతున్నారు. విజయానికి అవసరమైన 270 ఓట్లను ఆయన సునాయాసంగా సాధించారు. స్వింగ్ రాష్ట్రాలలో ట్రంప్‌దే పైచేయి అయింది. కడపటి వార్తలు అందేసరికి ట్రంప్‌కు 279, హారిస్‌కు 223 ఎలక్టోరల్ ఓట్లు వచ్చాయి. కాగా సెనెట్‌లో కూడా రిపబ్లికన్లు ఆధిక్యత సంపాదించారు. ట్రంప్ విజయంతో అమెరికా డాలర్ విలువ పెరిగింది. బిట్‌కాయిన్ రికార్డు స్థాయికి చేరింది. అనేక ఈక్విటీ మార్కెట్లు ముందంజ వేశాయి. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌ను పలువురు ప్రపంచ నేతలు అభినందించారు. ప్రధాని నరేంద్ర మోడీ, జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్, జోర్డాన్ రాజు అబ్దుల్లా-2, జింబాబ్వే అధ్యక్షుడు ఎమ్మెర్సన్ మ్నాంగాగ్వా, ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ...2లో

సామాన్యుల సంగతేంటి?

ధరల నియంత్రణలో బీజేపీ విఫలం



బహుళజాతి కంపెనీలకు దోచిపెడుతున్న కేంద్రం

హామీలను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం.. గతంలో అనుసరించిన ఆర్థిక విధానాలనే అమలు చేస్తూ సామాన్య ప్రజలను పట్టించుకోవడం లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగారెడ్డి జిల్లాలో ఉన్నత విద్యా సంస్థ అయిన ఐఐటీ, పారిశ్రామిక ప్రగతికి చెందిన కంపెనీలు, వ్యవసాయానికి జీవనాధారమైన సింగూర్ ప్రాజెక్టు చిహ్నాలతో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల 'లోగో'ను తయారు చేసినట్టు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సరళీకృత ఆర్థిక విధానాలు అమలు చేస్తూ బహుళ జాతి సంస్థల దోపిడీకి కాపలా కాస్తున్న పరిస్థితి ఉందన్నారు. నైపుణ్యం పేరిట అప్రెంటిషిప్ విధానం అంటూ కార్పొరేట్లకు దోచి పెట్టాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ధరల పెరుగుదల భరించలేని స్థితికి ...11లో

నాణ్యమైన విద్యనందిస్తాం

అందుకే డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచాం : ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను కలిసి డైట్ చార్జీలు పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనీ, అందుకే డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచామని తెలిపారు. ఇటీవలే 21వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినట్టు గుర్తు చేశారు. అలాగే కొత్తగా మెగా డీఎస్సీ నిర్వహించి 11,062 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని పేర్కొన్నారు. "ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ప్రతీ నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నాం. వచ్చే విద్యాసంవత్సరంలోపు వాటిని అందుబాటులోకి తీసుకొస్తాం.. చదువుతో పాటు నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయి. అందుకే విద్యార్థి, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణనందించేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. టాటా ఇనిస్టిట్యూట్ సహకారంతో ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నాం. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. తెలంగాణ ప్రభుత్వం విద్యకు

నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలు

పెద్దపీట వేస్తోంది. విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన అవకాశాలను అందిపుచ్చుకుని విద్యలో రాణించాలి" అని వారికి సూచించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నవంబర్ 14న వేలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా 100కు డయల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. వ్యసనాలకు బానిసైతే జీవితాలు నాశనం అవుతాయనీ, వాటికి దూరంగా ఉంటూ ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతను అలవరచుకోవాలని వారికి మార్గనిర్దేశం చేశారు సామాజిక న్యాయం అందించేందుకు వీలుగా ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు, నేటి విద్యార్థులే రేపటి పౌరులుగా తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌లో సచివాలయంలో అడుగు పెట్టి, పరిపాలనలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, రామసాయం రఘురాం రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జనగణనలో కులసర్వేను పరిగణనలోకి తీసుకోవాలి

కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని గవర్నర్‌ను కోరిన సీఎం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా 2025లో చేపట్టబోయే జనగణనలో తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వేను పరిగణనలోకి తీసుకునే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ ...11లో

మొదటి రోజు ఇండ్లకు స్టిక్కర్లు



సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం

గ్రామాల్లో, పట్టణాల్లో సందడి వాతావరణం

కొన్ని చోట్ల సమాచారమూ సేకరణ

ప్రారంభించిన మంత్రులు, కలెక్టర్లు

అనుమానాలు అక్కర్లేదు

ఆదిలాబాద్‌లో అధికారులకు షోకాజ్ నోటీసులు

అందరికీ సామాజిక న్యాయం

అందుకే కులగణన

బీఆర్ఎస్ సర్వే ఎవరి కోసమో?

ఎందుకోసం చేసిందో? :

డిప్యూటీ సీఎం భట్టి 11లో..

నవతెలంగాణ- విలేకరులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైంది. మొదటి రోజు బుధవారం ఇండ్లకు స్టిక్కర్లు అంటించారు. 9వ తేదీ నుంచి సమగ్ర సమాచారం సేకరించనున్నారు. 75 ప్రశ్నలతో 80వేల మంది సిబ్బంది రంగంలోకి దిగారు. దాంతో గ్రామాలు, పట్టణాల్లో సందడి వాతావరణం నెలకొంది. సర్వేలో భాగంగా ప్రభుత్వ సిబ్బంది ప్రజల నుంచి సామాజిక, ఆర్థిక వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. నెలరోజుల్లో సర్వే పూర్తవుతుంది. కాగా, కొన్నిచోట్ల స్టిక్కర్లు అంటించిన వెంటనే సమాచారం ...11లో



మత విద్వేషాలు రెచ్చగొట్టారు

జార్ఖండ్‌లో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు

మోడీ, షాలపై చర్యలు తీసుకోండి : సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ డిమాండ్ 3లో..

ప్రజలపై మోడీ సర్కార్‌కు ఆసక్తి లేదు



కార్పొరేట్లకు తలొగ్గిన కేంద్రం

వ్యవసాయ చట్టాల వెనుక అభివృద్ధి చెందిన దేశాలు

దేశ వ్యవసాయ మార్కెట్ స్వాధీనానికి బహుళజాతి సంస్థల ప్రయత్నం : పి. సుందరయ్య స్మారకోపన్యాసంలో ప్రముఖ ఆర్థిక వేత్త ఉత్స పట్నాయక్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

దేశ ప్రజలపై మోడీ సర్కార్‌కు ఆసక్తి లేదని, ఎంతసేపూ కార్పొరేట్లు, బహుళజాతి సంస్థల సేవలోనే ఉన్నారని ప్రముఖ ఆర్థిక వేత్త, ప్రొఫెసర్ ఉత్స పట్నాయక్ అన్నారు. బుధవారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పి.సుందరయ్య రెండో స్మారకోపన్యాసం ప్రొఫెసర్ ఉత్స పట్నాయక్ చేశారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాల వెనుక అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల ప్రయోజనాలే ఉన్నాయన్నారు. తమ పౌరులకు ఆహార భద్రత కల్పించే హక్కును భారతదేశం వంటి దేశాలకు అభివృద్ధి చెందిన దేశాలు నిరాకరించడానికి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యవసాయాన్ని వైవిధ్యపరిచే అవకాశం లేకపోవడంతో, భారతదేశంలో, ఇతర ప్రాంతాల్లో వారికి అవసరమైన పంటలను ఉత్పత్తి చేసి లాభాలు పొందాలని ...11లో

ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్

నిబంధన తెలుసా?

కాంగ్రెస్, బీజేపీలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూటి ప్రశ్న



మంత్రికి చెందిన కంపెనీకి టెండర్లు ఎలా ఇస్తారు ?

గౌతమ్ అదానీతో పొంగులేటి చర్చలు జరిపారు

అందుకే కేసుల్లేవంటూ ఎద్దేవా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్' అనే నిబంధన గురించి తెలుసా అంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్... కాంగ్రెస్, బీజేపీలను సూటిగా ప్రశ్నించారు. ఎలాంటి ఆశ్రిత పక్షపాతం లేకుండా పరిపాలన చేస్తామంటూ రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ...2లో

వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచుతామని ప్రభుత్వం చెప్పినా.. రాష్ట్రంలో పలు కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు ఉంచలేదు. కొన్ని కేంద్రాల్లో ఉంచినా అవి సరిపోవడం లేదు. కోతల సమయంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు, వర్షాల భారీ నుంచి కాపాడుకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. దాంతో టార్పాలిన్లకు డిమాండ్ పెరిగింది. తప్పని పరిస్థితుల్లో రైతులు డబ్బులు చెల్లించి వాటిని అద్దెకు తెచ్చుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఎక్కువ అద్దె చెల్లించాల్సి రావడంతో ప్రభుత్వం సబ్సిడీ రూపంలో టార్పాలిన్లు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సబ్సిడీ టార్పాలిన్లు అందేనా?

వర్షం పడిన సమయంలో ఇక్కట్లు

కొన్నిచోట్ల ప్రభుత్వం ఏర్పాటు..

మరికొన్ని చోట్ల పట్టని అధికారులు

టార్పాలిన్ల డిమాండ్‌తో అద్దెకు తీసుకుంటున్న రైతులు



నవతెలంగాణ-మల్హర్‌రావు

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలం మల్హర్‌రావు మండల వ్యాప్తంగా సుమారు 9500 మంది రైతులు ఉన్నారు. ఈ ఖరీఫ్‌లో 10700 ఎకరాల్లో వరి సాగు చేయగా 4850 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే ధాన్యం కోతలు ప్రారంభయ్యాయి. పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మొత్తం 22 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. కొండంపేట గ్రామంలో గురువారం మంత్రితో కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నారు. సుమారు 5 వేల టార్పాలిన్లు అవసరమవుతాయని రైతులు అంటున్నారు. ఇప్పటి వరకు టార్పాలిన్లు మండలానికి వచ్చిన దాఖలాలు లేవని తెలిసింది. ఈ క్రమంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు టార్పాలిన్లు అందుబాటులో లేక రైతులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై ఐదారేండ్ల క్రితం ఎనిమిది ఫీట్ల పొడవు, ఆరు ఫీట్ల వెడల్పుతో మందం ఉన్న టార్పాలిన్‌లను వ్యవసాయశాఖ తరపున రైతులకు సబ్సిడీపై అందజేసింది. వాటి విలువ మార్కెట్‌లో సుమారు రూ.2500 వరకు ఉండొచ్చని తెలుస్తోంది. కాగా, ఈ టార్పాలిన్లు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ఎంతో సౌలభ్యంగా ఉండేవి. ఇప్పుడు వాటి సరఫరా నిలిచిపోవడంతో తాము ఆర్థికంగా ...11లో



పీఎం విద్యాలక్ష్మికి ఆమోదం

ఎఫ్‌సీఐ మూలధన పెట్టుబడికి రూ.10,700 కోట్లు ఈక్విటీ

కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఉన్నత విద్యా సంస్థల్లో చేరే ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు 'పీఎం విద్యాలక్ష్మి' పథకానికి కేంద్ర మంత్రివర్గం ...11లో

ప్రత్యేక హోదా పునరుద్ధరించండి

జమ్ముకాశ్మీర్ శాసనసభ ఆమోదం

బీజేపీ నిరసన వివరాలు 11లో



"బర్డ్స్ ఆఫ్ తెలంగాణ" పాకెట్‌గైడ్‌తో అవగాహన

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని పక్షుల గురించి భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ (హెచ్‌బీపీ) సభ్యులు రూపొందించిన "బర్డ్స్ ఆఫ్ తెలంగాణ" పాకెట్ గైడ్ ఉపయోగపడుతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం ప్రజా భవన్‌లో ఆయన పాకెట్ గైడ్‌ను ఆవిష్కరించారు. ఈ పుస్తకం అవసరాన్ని హెచ్‌బీపీ కోర్ కమిటీ సభ్యులు భట్టికి వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పాకెట్ గైడ్‌ను రూపొందించినందుకు హెచ్‌బీపీ సభ్యులను అభినందించారు. హెచ్‌బీపీ అధ్యక్షులు అడెపు హరికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో పక్షుల ఆహారం, వలసలు, పరిరక్షణ స్థితి గురించి తెలుసు కోవటానికి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రత్యేక జీవ వైవిధ్యంతో కూడుకున్న తెలంగాణ ప్రకృతితో మమేకం కావటానికి ప్రోత్సహిస్తుందని తెలిపారు. మొత్తం 252 ముఖ్యమైన పక్షి జాతులను కలిగి ఉన్న ఈ పాకెట్ గైడ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉచితంగా అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీజీపీ తేజ్‌దీప్‌కౌర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ విజయం

(మొదటిపేజీ తరువాయి)

తదితర నేతలు ట్రంప్‌కు శుభాకాంక్షల సందేశాలు పంపారు.

ఏ రాష్ట్రం ఎవరికి ?

అమెరికాలోని ఏడు స్వింగ్ రాష్ట్రాలలో ఉత్తర కరోలినా, జార్జియా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్‌లలో ట్రంప్ విజయం సాధించారు. మరో మూడు రాష్ట్రాలలోనూ ఆయనే ఆధిక్యతలో ఉన్నారు. ఫ్లోరిడాలో ట్రంప్ విజయం సాధించడంతో ఆయనకు 30 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు లభించాయి. 2020 ఎన్నికలలో కూడా ఫ్లోరిడాలో ట్రంప్‌కే విజయం చేకూరింది. టెక్సాస్‌లో సైతం ట్రంప్ ఆధిక్యత కనబరిచారు. ఆయన వరుసగా మూడోసారి ఈ రాష్ట్రంలో సత్తా చాటారు. టెక్సాస్‌లోని మొత్తం 40 ఎలక్టోరల్ ఓట్లూ ట్రంప్‌కే దక్కాయి.

రిపబ్లికన్లకు గట్టి పట్టున్న దక్షిణ కరోలినా, ఇండియానాలో ట్రంప్ వైపే ఓటర్లు మొగ్గు చూపారు. డెమొక్రాట్ల ప్రభావం అధికంగా ఉన్న న్యూయార్క్, మాసాచూసెట్స్, ఇల్లినాయిస్‌లో కమలా హారిస్‌దే పైచేయి అయింది. వాషింగ్టన్, ఒరేగాన్, కాలిఫోర్నియా, కొలరాడో, న్యూ మెక్సికో, మిన్నెసోటా, ఇల్లినాయిస్, న్యూయార్క్, వర్జీనియా, న్యూ హాంప్‌షైర్, కన్నెక్టికట్, వెర్మంట్ రాష్ట్రాలలో హారిస్‌కు ఆధిక్యత లభించింది. ఇడాహో, ఉటా, మాంటానా, వ్యోమింగ్, నార్త్ డకోటా, సౌత్ డకోటా, నెబ్రాస్కా, కాన్సాస్, ఒక్లహోమా, లోవా, మిస్సోరీ, అర్కాన్సస్, లౌసియానా, విస్కాన్సిన్, ఇండియానా, ఒహియో, టెన్నెస్సీ, వెస్ట్ వర్జీనియా, నార్త్ కరోలినా, మిసిసిపీ, అలబామా, జార్జియా, సౌత్ కరోలినా, ఫ్లోరిడా వంటి రాష్ట్రాలు ట్రంప్‌కే ఓటేశాయి.

యుద్ధాలకు ముగింపు పలుకుతా

ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగిస్తూ తనను ఎన్నుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. అమెరికాకు 45వ, 47వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని అన్నారు. తుదిశ్వాస విడిచే వరకూ ప్రజల కోసమే పోరాడతానని ప్రకటించారు. పటిష్టమైన, సురక్షితమైన, సౌభాగ్యవంతమైన అమెరికాను సాధించే వరకూ విశ్రమించబోనని చెప్పారు.

ప్రపంచంలోని కొన్ని దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడంపై ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధాలకు ముగింపు పలికి, శాంతియుత వాతావరణం ఏర్పడేలా కృషి చేస్తానని చెప్పారు. అయితే ఆయన తన ప్రసంగంలో ఎక్కడా ఉక్రెయిన్, ఇజ్రాయిల్ పేర్లను ప్రస్తావించలేదు. తన హయాంలో యుద్ధాలే జరగలేదని, ఐఎస్ఐఎస్‌ను నామరూపాలు లేకుండా చేశానని చెప్పుకొచ్చారు.

అప్పుడేం జరిగింది ?

గత ఎన్నికలలో పరాజయం పాలైనా ట్రంప్ దానిని అంగీకరించలేదు. యూఎస్ కాపిటాల్‌లో పెద్ద ఎత్తున హింస చెలరేగింది. ద్రోహానికి పాల్పడ్డారన్న ఆరోపణపై ట్రంప్‌కు శిక్ష కూడా విధించారు. ఆయనపై రెండు సార్లు హత్యాయత్నాలు జరిగాయి. అయినప్పటికీ ట్రంప్ అసాధారణ రీతిలో విజయాన్ని చేజిక్కించుకున్నారు. విస్కాన్సిస్ రాష్ట్రంలో గెలుపుతో ఆయనకు విజయానికి అవసరమైన 270 ఎలక్టోరల్ ఓట్లు లభించాయి.

భారత్‌కు దెబ్బే

(మొదటిపేజీ తరువాయి)

ఫస్ట్ ఎజెండా భారతీయ వస్తువులపై మరింత సుంకాలను మోపవచ్చు. ముఖ్యంగా వాహన రంగం, మద్యం, వస్త్ర, ఔషధ రంగాల భారత ఎగుమతులుకు అడ్డంకులు వేయవచ్చు. టారీఫ్‌లను పెంచడం ద్వారా అమెరికా మార్కెట్‌లో మన ఉత్పత్తులు పోటీ పడలేవు. దీంతో ఆయా కంపెనీల ఆదాయాలు పడిపోనున్నాయి." అని శ్రీవాస్తవ విశ్లేషించారు. చైనాపై అమెరికా కఠిన వైఖరి భారతీయ ఎగుమతిదారులకు కొంత ఉపశమనం కలిగించవచ్చన్నారు. అమెరికా-భారత్ దేశాల మధ్య 2022-23లో ద్వైపాక్షిక వాణిజ్యం 129.4 బిలియన్ డాలర్లుగా, 2023-24లో 120 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

ఇప్పటికే అధిక పన్నులు

అమెరికా ఇప్పటికే దిగుమతి ఉత్పత్తులపై అధిక పన్ను రేట్లను అమలు చేస్తోంది. జీటీఆర్ఐ రిపోర్ట్ ప్రకారం.. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) టారీఫ్ 2023 ప్రకారం.. అమెరికా దిగుమతులు చేసుకుంటున్న పాల ఉత్పత్తులపై 188 శాతం, పళ్లు, కూరగాయాలపై 132 శాతం, తృణధాన్యాలపై 193 శాతం, నూనె గింజలు, కొవ్వులు, నూనెలపై 164 శాతం, పానీయాలు, పొగాకు ఉత్పత్తులపై 150 శాతం చొప్పున సుంకాలు అమల్లో ఉన్నాయి.

"మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాదం ఇచ్చిన ట్రంప్ టారీఫ్‌లను పెంచనున్నారు. ట్రంప్ అధికారంలోకి రావడం వల్ల మేము రక్షణలో పడనున్నాము. ఎలక్ట్రానిక్స్ రంగంపైనా ఒత్తిడి నెలకొనడంతో దెబ్బ తిననుంది." అని అంతర్జాతీయ ట్రేడ్ నిపుణులు బిస్వజిత్ ధర్ పేర్కొన్నారు. ట్రాన్స్-పసిఫిక్ పార్టనర్‌షిప్ (టిపిపి) నుండి ఇంతక్రితం ట్రంప్ వైదొలిగినందున, ఇండో-పసిఫిక్ ఎకనామిక్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ప్రాస్పెరిటీ (ఐపిఇఎఫ్)పై చీకటి మేఘాలు కమ్ముకోవచ్చన్నారు. ఈపీఈఎఫ్ అంశంలో ట్రంప్ విధానం ఎలా ఉంటుందో వేచి చూడాలని ధార్ పేర్కొన్నారు. ఈ అంశంపై డబ్ల్యూటీఓ చొరవను ఏమీ ఆశించలేమన్నారు. ట్రంప్ మరింత సమతుల్య వాణిజ్యం కోసం ముందుకు వస్తారని తాము ఆశిస్తున్నామని.. అయితే సుంకాల చుట్టూ వాణిజ్య వివాదాలు తలెత్తవచ్చని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఇఓ) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ పేర్కొన్నారు. ఇమ్మిగ్రేషన్ నిబంధనలను కఠినతరం చేసే అవకాశం ఉందన్నారు. ఆర్థిక సంవత్సరం 2019-20 నుంచి 2023-24 మధ్య అమెరికాకు భారత సరుకుల ఎగుమతులు 46 శాతం పెరిగి 53.1 బిలియన్ డాలర్ల నుంచి 77.5 బిలియన్ డాలర్లకు చేరాయి. కాగా అమెరికా నుంచి భారత్‌కు 2019-20లో 35.8 బిలియన్ డాలర్ల దిగుమతులు చోటు చేసుకోగా.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 42.2 బిలియన్ దిగుమతులు నమోదయ్యాయి.

ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవాలి

అమెరికా అధిక పన్నుల విధానం చేపడితే భారత తయారీ, సరఫరాలపై ప్రతికూల ప్రభావం పడనుందని ఇవై ఇండియా ప్రతినిధి అగ్నేశ్వర్ సేన్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, కెమికల్స్, ఫార్మా, ఆటో, ఇంజనీరింగ్ ఉత్పత్తుల వంటి ఎగుమతులపై భారత్ అధిక సుంకాలను ఎదుర్కోవాల్సి రావొచ్చన్నారు. భారత్ ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవాలని సూచించారు. అదే విధంగా అమెరికా ఎగుమతులపైనా భారత్ సుంకాలు పెంచడం ద్వారా ప్రయోజనాలను కాపాడుకోవాలన్నారు. భారత ఐటీ అవుట్‌సోర్సింగ్ ఎగుమతులను ప్రభావితం చేసే ట్రంప్ చర్యలను ఎదుర్కోవడానికి భారత్ సిద్ధంగా ఉండాలన్నారు. వీసా నిబంధనల కఠినతరం చేయడం వల్ల భారతీయ ఐటి నిపుణులపై ప్రతికూల ప్రభావం పడనుందన్నారు. అదే విధంగా ట్రంప్ భారత విదేశాంగ విధానాన్ని పరిమితం చేసే అవకాశాలూ లేకపోలేదన్నారు.

ప్రభుత్వ వెంచర్‌లోనే నయవంచన

- అంగారిక టౌన్‌షిప్ పేరుతో నిండా ముంచిన గత ప్రభుత్వం
- మార్కెట్ ధరను పెంచి మరీ ప్లాట్ల అమ్మకం
- రూ.3వేల గజం రెసిడెన్షియల్ స్థలం రూ.6వేలు
- కమర్షియల్ స్థలం గజానికి రూ.8వేలుగా నిర్ణయించి వేలం
- సర్కారు వెంచరని పోటీపడీ గరిష్టంగా రూ.20వేలు చెల్లించిన జనం
- రూ.180కోట్లు వసూలు చేసి తీరా.. మౌలిక వసతులు మరిచిన ప్రభుత్వం
- రెండేండ్లు తిరిగి వేసారిన బాధితులు
- ప్రభుత్వ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు

'అందివచ్చిన సువర్ణావకాశం.. అందుబాటు ధరలో విలువైన భూములు.. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరం.. ఆనుకునే ఉన్న రాజీవ్ రహదారి..' అంటూ కరీంనగర్ జిల్లా రామకృష్ణకాలనీ గ్రామంలో గత ప్రభుత్వం భూములను ప్లాట్లుగా మార్చి వేలంలో విక్రయించింది. రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యం సహా థీమ్‌పార్కులు, గేటెడ్ కమ్యూనిటీ, ఆర్చీలు సకల వసతులు కల్పిస్తామని అరచేతిలో స్వర్గం చూపెంది. ఫ్లెక్సీలు, భారీ హోర్డింగ్‌ల ప్రచారంతో ఊదరగొట్టింది. రూ.4వేలు కూడా ధరలేని గజం స్థలాన్ని రెసిడెన్సియల్ పేరుతో రూ.6వేలు, కమర్షియల్ ప్లాటు అంటూ రూ.8వేలుగా ధర నిర్ణయించి వేలంలో మూడింతలకు తెగనమ్మేసింది. ప్రభుత్వ వెంచర్ కదా అని.. వేలంలో పోటీపడి గజానికి గరిష్టంగా రూ.20వేలకు దక్కించుకున్న 774మంది నయవంచనకు గురయ్యారు. రూ.180కోట్ల వరకు ఆదాయం సమకూర్చుకున్న గత సర్కారు చెప్పినట్టుగా ఏ ఒక్క మౌలిక వసతీ కల్పించకుండా చేతులేత్తేసింది.



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

సామాన్యుడికి సరసమైన ధరలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని రాజీవ్ గృహకల్ప పేరుతో కరీంనగర్ జిల్లా రామకృష్ణకాలనీ గ్రామంలో ఉమ్మడి ఏపీలో వైఎస్ సర్కారు 86.95 ఎకరాల స్థలాన్ని సేకరించింది. వివిధ కారణాలతో ఆ నిర్మాణ ప్రక్రియ ఆగిపోయి ఆ స్థలం ఖాళీగా ఉంది. ఆ స్థలంలో పలు ప్రాజెక్టుల నిర్మాణం అంశాలు తెరమీదకొచ్చినా.. గత బీఆర్ఎస్ సర్కారు ఆదాయం పెంచుకునే ఆలోచనలో భాగంగా ప్లాట్లుగా మార్చి వేలం వేసింది. అంగారికటౌన్‌షిప్ పేరుతో 86.95 ఎకరాల్లో లేఅవుట్‌కు ఆమోదించింది. భవిష్యత్ అభివృద్ధి పనుల కోసం ఐదు ఎకరాలు వదిలేసి.. 81.95 ఎకరాల స్థలాన్ని 893 ప్లాట్లుగా మార్చింది. ఆ ప్లాట్ల అమ్మకానికి ముందు ప్రీ బిడ్ సమావేశాలు నిర్వహించి ఆ వెంచర్‌లో డెవలప్‌మెంట్ కోసం రూ.47కోట్ల పనుల ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు ప్రచారం చేసింది. రూ.3వేలు కూడా ధరలేని అక్కడి స్థలానికి వేలంలో పోటీ ఉంటుందని గమనించి రెసిడెన్షియల్ ప్లాట్లు గజానికి రూ. 6వేలు, కమర్షియల్ ప్లాట్లు గజానికి రూ.8వేలుగా రేటు నిర్ణయించింది. తొలి, మలి విడతల్లో 774 ప్లాట్లు విక్రయించింది. అయితే, రెసిడెన్షియల్‌కైతే గజానికి గరిష్టంగా రూ.18వేలు, కమర్షియల్‌కైతే రూ.26 వేల వరకూ వేలంలో అమ్ముడుపోగా రూ.180కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం ఆర్జించింది. ఇంతవరకూ బాగానే ఉన్నా.. తొలి విడత ప్లాట్ల విక్రయం తరువాత ఆర్నెళ్లకు మలివిడత వేలం నిర్వహించారు. ఈ మధ్యలో ప్లాట్లు దక్కించుకున్న వాళ్లు సౌకర్యాలపై నిలదీశారు. కలెక్టర్ సహా అప్పటి ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరిగి వేసారిపోయారు.

ఆ ప్లాట్లలో రోడ్డుగానీ, డ్రెయినేజీగానీ నిర్మించలేదు. సరికదా.. కొనుగోలుదారుల ఒత్తిడితో కేవలం 70శాతం మేర విద్యుత్ స్తంభాలు, తీగలను అమర్చారు. కొన్నాళ్లకు విద్యుత్ తీగలు చోరికి గురై కొన్ని స్తంభాలు మొండిగా మిగిలాయి. పైగా ఆ ప్లాట్ల వేలానికి ముందు స్థలం చదును, ఇతర పనులకు రూ.6కోట్లు ఖర్చు చేసినట్టు లెక్కలు చూపారు. కేవలం మట్టి లెవలింగ్‌కే ఇంత మొత్తంలో ఖర్చు చేయడంపై అప్పట్లోనే పలు అనుమానాలు రేకెత్తాయి. ఇతర సౌకర్యాల కల్పనకు రూ.20కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినా.. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆ పనులు, నిధులు అటకెక్కాయి.

ఇల్లు కట్టలేక.. ఉన్న స్థలాన్ని అమ్ముకోలేక..

ప్లాట్లు కొన్నవారిలో దాదాపు 30శాతం మంది పలు ప్రభుత్వశాఖల ఉద్యోగులు, బ్యాంక్, ఇతర రంగాల్లో పనిచేసేవారు, రిటైర్డ్ ఎంప్లాయీసే. మిగతా 70శాతం మేర ఎగువ, మధ్యతరగతి వాళ్లే సింహభాగంగా ఉన్నారు. వీరంతా ఇంటిస్థలం కోసం కొద్దిపాటి సేవింగ్స్‌కి మరింత అప్పులు తెచ్చి స్థలాలు కొన్నారు. మూడేండ్లుగా కరెంటు, రోడ్డు సౌకర్యం లేక ఇల్లు కట్టుకునేందుకు సాహసించడం లేదు. వేరే చోట స్థలాన్ని కొనేందుకు ఉన్న ప్లాటును అమ్ముదామనుకున్నా.. కొనే దిక్కులేకుండా పోయింది. ఓ నలుగురు ఇండ్ల నిర్మాణం మొదలుపెట్టినా.. అందులో ఒకరు ఇంటి నిర్మాణం పూర్తయ్యేవరకూ జనరేటర్‌తో పనులు చేసుకున్నామని 'నవతెలంగాణ'తో వాపోయారు. మరో ఇంటి నిర్మాణం చేపట్టిన విశ్రాంత ఉద్యోగి మాట్లాడుతూ.. 'నేను మార్చిలో రిటైర్డ్ అయితే బెనిఫిట్స్ రాకపోగా.. పెన్షన్ కూడా రావడం లేదు. శేష జీవితమన్నా సొంతింట్లో గడుపుదామంటే కనీస సౌకర్యాలు లేవు. ఈ ఇంటి నిర్మాణానికి తెచ్చిన అప్పులు కట్టే దారి కనిపించడం లేదు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

మా బాధలు తీర్చండి : సత్యనారాయణ, రిటైర్డ్ ఉద్యోగి



గతంలో రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్ నిర్మాణాల కోసం తవ్విన స్థలమిది. ఆ స్థలాన్ని పూడ్చి ప్లాట్లుగా చేసి అమ్మారు. ఇప్పుడు నేను ఇల్లు కట్టేందుకు సుమారు ఒక అంతస్తు లోతు తవ్వి పునాదులు వేసుకోవాల్సి వచ్చింది. పైగా రోడ్లు లేదు. డ్రెయినేజీ లేదు. తాగునీటి వసతీ లేదు. ప్లాట్లు కొనే ముందు మాకిచ్చిన మాట ప్రకారం అన్ని వసతులూ కల్పించాలి.

సౌకర్యాలు కల్పిస్తే ఇల్లు కట్టుకుంటా : రామచంద్రం, టౌన్‌షిప్ ప్లాటు యజమాని



కనీసం రోడ్డు అయినా వేయండి. కరెంటు తీగలు అంతటా లేవు. నీటి వసతి లేదు. సొంతింటి కల నెరవేర్చుకుందామని అంగారిక టౌన్‌షిప్‌లో వేలంలో స్థలం కొన్నా. కానీ అక్కడ కనీసం రోడ్డు కూడా లేదు. లక్షలు పెట్టి ప్లాటు కొనుక్కున్నా ఇల్లు కట్టుకునే పరిస్థితి లేదు. మౌలిక సౌకర్యాలు వెంటనే కల్పిస్తే నాలాంటి వాళ్లు ఎందరో ఇల్లు కట్టుకునేందుకు ముందుకొస్తారు.

'ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్' నిబంధన తెలుసా?

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి, మంత్రులు అడ్డగోలు అవినీతికి, దోపిడీలకు పాల్పడుతున్నారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి వివిధ టెండర్లను ఎలా అప్పజెపుతారంటూ ఆయన నిలదీశారు. దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్టు పొంగులేటి, మేఘా కృష్ణారెడ్డి సంస్థలకు ముఖ్యమంత్రి రేవంత్ రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులను అప్పనంగా కట్టబెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవి చాలవన్నట్టు అదానీకి రామన్నపేటలో అంబుజా సిమెంట్స్‌కు అనుమతులిచ్చారని దుయ్యబట్టారు. మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీ దాడులు జరిగి, నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ చర్యలేవన్నారు. దీనిబట్టే కాంగ్రెస్, బీజేపీ బంధం ఎంత బలంగా ఉందో అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. ఆ రెండు పార్టీల అపవిత్ర బంధాన్ని బయటపెడతామని హెచ్చరించారు.

బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, ముఠాగోపాల్ తదితరులతో కలిసి కేటీఆర్ మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మేఘా ఇంజినీరింగ్ సంస్థను 'ఈస్ట్ ఇండియా కంపెనీ' అంటూ విమర్శించిన సీఎం రేవంత్, ఇప్పుడు అదే సంస్థకు పనులు ఎలా అప్పజెపుతున్నారంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సైతం మేఘా కృష్ణారెడ్డి... ఒక పొలిటికల్ మాఫియా అంటూ ఆరోపణలు గుప్పించారని తెలిపారు. సీఎంకు, ఇతర కాంగ్రెస్ నాయకులకు అప్పుడు పనికిరాని సంస్థ ఇప్పుడు ముద్దొస్తోందా? అని ఎద్దేవా చేశారు. దానిపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని అడిగారు. హైదరాబాద్‌కు తాగు నీటి కోసం తమ ప్రభుత్వం చేపట్టిన సుంకిశాల ప్రాజెక్టును, రేవంత్ సర్కారు పట్టించుకోవటం లేదని కేటీఆర్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. మేఘా కంపెనీ క్రిమినల్ నిర్లక్ష్యం వల్ల అక్కడ రిటైనింగ్ వాల్ కూలిపోయిందన్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు జాగ్రత్త పడ్డారని విమర్శించారు.

మేడిగడ్డ ఘటనతో లక్ష కోట్లు నీటి పాలయ్యాయంటూ ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతలు...సుంకిశాలపై ఇప్పటి వరకూ నోరెందుకు మెదపటం లేదని ప్రశ్నించారు. మేఘా కంపెనీని ఎందుకు బ్లాక్ లిస్టులో పెట్టలేదంటూ నిలదీశారు. మరోవైపు అదే సంస్థకు రూ.4,350 కోట్ల విలువైన కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని అప్పగించటం శోచనీయమన్నారు. ఎల్ అండ్ టీని, ఎన్సీపీని కాదని కేవలం మేఘా, రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీలకే పనులు అప్పజెప్పటంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఆయా సంస్థలతో ముఖ్యమంత్రి కుమ్మక్కై, డబ్బులు దండుకుంటున్నారంటూ ఆరోపించారు. కాళేశ్వరం నీటిని గండిపేటలో కలిపి మూసీలోకి పంపిస్తామనే పేరుతో ప్రభుత్వ పెద్దలు మరో రూ.5,500 కోట్ల కుంభకోణానికి తెరలేపారని విమర్శించారు. ఈ ప్రాజెక్టును కూడా మేఘాకే ఇవ్వనున్నారని తెలిపారు. ఇలాంటి సంస్థల నుంచి దండుకున్న డబ్బును ఢిల్లీకి పంపనున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర ఎన్నికల కోసం ఇప్పటికే సంచులు పంపారంటూ విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గతంలో ఆయనే 'ఈస్ట్ ఇండియా కంపెనీ' అంటూ చెప్పిన మేఘా సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వ నగ్న స్వరూపాన్ని ప్రజల ముందు బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. ప్రాజెక్టులు, టెండర్లు, పనులకు సంబంధించి ఇప్పుడున్న అధికారులు... రేవంత్ మాట విని ఆయన చెప్పినట్టు సంతకాలు పెడితే, రాబోయే రోజుల్లో ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న దందాలపై తెలంగాణకు నుంచి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ ఎందుకు నోరు మెదపటం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రధాని మోడీ కూడా ఇతర రాష్ట్రాల పర్యటన సందర్భంగా... ఇక్కడి కాంగ్రెస్ నేతల గురించి మాట్లాడతారు, కానీ తెలంగాణకు వచ్చినప్పుడు మాత్రం వారిపై ప్రశంసలు కురిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్... తన బావమరిదికి అప్పజెప్పిన అమృత్ టెండర్ల గురించి మోడీకి తెలియదా? అని ప్రశ్నించారు. అవినీతిలో కూరుకుపోయిన మంత్రి పొంగులేటి కోహినూర్ హోటల్లో అదాని కాళ్లు మొక్కటం ద్వారా తనపై ఎలాంటి కేసులు లేకుండా చూసుకున్నారని ఎద్దేవా చేశారు. ఇందుకు సంబంధించి సీఎం రేవంత్ ఇంట్లోనే గౌతమ్ అదానీతో ఆయన నాలుగు గంటలపాటు చర్చలు జరిపారని అన్నారు. ఇవన్నీ మరిచి రాజకీయ బాంబులు, అరెస్టులంటూ పొంగులేటి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆ రకంగా జోష్యం చెప్పటానికి ఆయనేమైనా హోం మంత్రా? డీజీపీయా? అంటూ చురకలంటించారు.

యుద్ధాలు ఆపుతా

(మొదటిపేజీ తరువాయి)

ట్రంప్ తెలిపారు. నాలుగేండ్లు యుద్ధాలు లేవని, కేవలం ఐసీఎస్‌ను ఓడించామని, రికార్డు టైంలో ఐసీఎస్‌పై విక్టరీ సాధించినట్లు చెప్పారు. యుద్ధాలు ప్రారంభిస్తారని తనపై ఆరోపణలు చేశారని, తానేమీ కొత్త యుద్ధాలను ప్రారంభించడం లేదని, వాటిని ఆపబోతున్నానని వెల్లడించారు. అయితే తాను అధ్యక్షుడిగా ఎన్నికైతే 24 గంటల్లోనే రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపనున్నట్టు ట్రంప్ పేర్కొన్న విషయం విదితమే. ఈ ప్రసంగంలో ట్రంప్ స్వదేశీ విధానాలపై అధిక ప్రాధాన్యతనిచ్చారు.

కంసన్ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

- ఖాళీ బూడిదైన పరిశ్రమ
- ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది
- సుమారు రూ.30 కోట్ల ఆస్తి నష్టం



నవతెలంగాణ-కొత్తూరు

కంసన్ హైజెన్ కేర్ పరిశ్రమలోని డైపర్ తయారీ ప్లాంట్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఖాళీ బూడిదైంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ సమీపంలో ఉన్న కంసన్ హైజెన్ కేర్ పరిశ్రమలోని డైపర్ తయారీ ప్లాంట్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగి షెడ్డు మొత్తం మంటలు వ్యాపించాయి. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో పరిశ్రమలో సుమారు 50 మంది కార్మికులు పని చేస్తున్నారు. కార్మికులకు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని కంపెనీ నిర్వాహకులు తెలిపారు. మంటలను అదుపు చేసేందుకు షాద్‌నగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్ల నుంచి ఫైర్ ఇంజన్లను రప్పించారు. ఫైర్ సిబ్బంది, స్థానిక పోలీసులు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. అప్పటికే పరిశ్రమ మొత్తం కాలి షెడ్డు కూలిపోయింది. షెడ్డులోని సుమారు రూ.30 కోట్ల విలువ చేసే మిషనరీ, మెటీరియల్ పూర్తిగా కాలిపోయాయి. పరిశ్రమ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నందిగామ పోలీసులు తెలిపారు.

థ్యాంక్స్...

- డిప్యూటీ సీఎంకు టీఐఎస్ఎమ్ఏ కృతజ్ఞతలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ ఛార్జీలు పెంచకపోవడం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయమని ఐరన్ అండ్ స్టీల్ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం అసోసియేషన్ ప్రతినిధిబృందం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కను ప్రజాభవన్‌లో కలిసి కరెంటు చార్జీలు పెంచనందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచితే స్టీల్, ఐరన్ పరిశ్రమలు మూసివేసుకొనే పరిస్థితి ఏర్పడేదని ఆందోళన వ్యక్తంచేశారు. 24 గంటల నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా వల్ల తమ పరిశ్రమ ఇప్పుడిప్పుడే స్థిర పడుతున్నదని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని పారిశ్రామిక రంగం వృద్ధి చెందాలని ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం కోరారు. పరిశ్రమలకు తక్కువ ధరలో వనరులు అందచేస్తామనీ, దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని వివరించారు. స్టీలు, ఐరన్ పరిశ్రమల్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపచేయాలని సూచించారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో అసోసియేషన్ జాయింట్ ప్రెసిడెంట్ ప్రమోద్ అగర్వాల్, వైస్ ప్రెసిడెంట్ నీరజ్ గొయెంక, జాయింట్ సెక్రెటరీ సుధాంశు శేఖర్, కోశాధికారి వినోద్ అగర్వాల్ తదితరులు ఉన్నారు.

గీతం విద్యార్థినికి రూ.60 లక్షల గరిష్ట వార్షిక వేతనం

- కొనసాగుతున్న ప్రాంగణ నియామకాలు
- రూ.51 లక్షల వార్షిక వేతనంతో మైక్రోసాఫ్ట్‌కు ఎంపికైన ఇద్దరు విద్యార్థులు



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మరోసారి ప్రాంగణ నియామకాల్లో మేటిగా నిరూపించుకుంది. ప్రతిష్టాత్మక బహుళజాతి సంస్థల భాగస్వామ్యంతో 2024-25 విద్యా సంవత్సరానికి అత్యధిక గరిష్ఠ వార్షిక వేతనం రూ.60 లక్షలతో ఒక విద్యార్థిని ఎంపిక కాగా, మరో ఇద్దరు రూ.51 లక్షల గరిష్ఠ వార్షిక వేతనానికి ఎంపికయ్యారు. బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థిని యర్రం అనూష అట్లాసియన్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా గౌరవనీయమైన స్థానాన్ని సంపాదించుకుని, రూ.60 లక్షల వార్షిక వేతనాన్ని పొందనున్నారు. అంతేగాక తన తోటి విద్యార్థిని కొర్రపాటి సమీనాతో కలిసి మైక్రోసాఫ్ట్‌లో రూ.51 లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఎంపికైంది. ఈ ప్లేస్‌మెంట్ సీజన్‌లో గీతం విద్యార్థుల విజయం, వారి కృషిని మాత్రమే కాకుండా, బలమైన పరిశ్రమ-విద్యా సంబంధ అనుబంధాలను, అధిక నాణ్యత గల విద్యను అందించడంలో విశ్వవిద్యాలయం నిబద్ధతను తెలుపుతోంది. ఇతర బహుళ జాతి సంస్థల ప్రాంగణ నియామకాల్లోనూ విద్యార్థులు తమ సత్తా చాటుతున్నారు.

నియామకాలు ఆనందాన్నిచ్చాయి : డాక్టర్ మమతా రెడ్డి, కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్

ఈ ఏడాది తమ ప్రాంగణ నియామకాలను అట్లాసియన్, మైక్రోసాఫ్ట్, సిలికాన్ ల్యాబ్స్, పెగా సిస్టమ్స్ వంటి ప్రముఖ బహుళ జాతి కంపెనీలతో ప్రారంభించడం ఆనందంగా ఉందని కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మమతా రెడ్డి ప్రస్తుత ప్లేస్‌మెంట్ సీజన్‌పై స్పందించారు. విద్యార్థులు తమ అసాధారణ నైపుణ్యాలను, పరిశ్రమల అవసరాలను తీర్చగలిగే సంసిద్ధతను నిరంతరం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఈ అద్భుతమైన ప్రాంగణ నియామకాల అకడమిక్ ఎక్సలెన్స్ పట్ల యూనివర్సిటీ అంకితభావాన్ని, అభివృద్ధి చెందుతున్న జాబ్ మార్కెట్‌లో విజయవంతమైన కెరీర్ కోసం ఎప్పటికప్పుడు విద్యార్థులను సిద్ధం చేయడంలో దాని నిబద్ధతను చాటి చెబుతున్నాయన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ప్రాంగణ నియామకాల్లో సిలికాన్ ల్యాబ్‌కు రూ.22 లక్షల వార్షిక వేతనంతో ఒక విద్యార్థి ఎంపికయ్యారు. పెగా సిస్టమ్స్‌లో ఏడుగురు విద్యార్థులకు రూ.15.48 లక్షలు, డెలివరూ.. ముగ్గురుకి రూ.12.07 లక్షలు, ఒరాకిల్ ఐదుగురికి రూ.10 లక్షలు, రిలయన్స్ జియో బీపీ ఒక విద్యార్థికి రూ.9 లక్షలు, డెలాయిట్ పీపీవో ఐదుగురికి రూ.8.64 లక్షలు, ఏషియన్ పెయింట్స్ ముగ్గురుకి రూ.8.5 లక్షలు, ఐసీఐసీఐ బ్యాంక్ 14 మందికి రూ.8.29 లక్షలు, నౌకరీ.కామ్ ఒకరికి రూ.7 లక్షలు, పీజీఎస్ ముగ్గురికి రూ.8 లక్షలు, కీలూప్ ఆరుగురికి రూ.7.2 లక్షలు, వయాప్లస్ ఐదుగురికి రూ.7 లక్షలు, హెచ్ అండ్ ఆర్ బ్లాక్ నలుగురికి రూ.5.27 లక్షలు, మ్యూసిగ్మా 17 మందికి రూ.5 లక్షలు, ఈవై జీడీఎస్ 49 మందికి రూ.4.83 లక్షలు, యాక్సెంచర్ 92 మందికి రూ.4.5 లక్షలు, టెక్ మహీంద్రా 85 మందికి రూ.4 లక్షల చొప్పున వార్షిక వేతనాన్ని అందించే ఒప్పందంతో ఎంపికలు జరిగాయి.

సాగర్‌లో విద్యుత్ ఉత్పత్తిపై కేఆర్ఎంబీ ఆంక్షలు

- అవసరమైతే ఉత్పత్తి చేస్తామంటున్న జెన్కో



నవతెలంగాణ- నాగార్జునసాగర్

నాగార్జునసాగర్‌లో జల విద్యుత్ ఉత్పత్తిపై కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఆంక్షలు విధించింది. ఈ విషయంలో ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీలకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని రెండు రాష్ట్రాలకు సంబంధించి రెండో పంటకు కూడా సాగునీరు ఇచ్చేలా, సరిపోయేంత తాగునీరు ఉండేలా చూసుకోవాలని తెలియజేసింది. దీని కోసం నాగార్జునసాగర్‌లో ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిపై ఆంక్షలు పెట్టింది. అయితే, ఈ విషయంలో నాగార్జునసాగర్ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ మంగేష్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాల మేరకు ఉత్పత్తి చేపడతామన్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో 580 అడుగుల నీటిమట్టం ఉన్నంతవరకు జెన్‌కో విద్యుత్ ఉత్పత్తిని చేపట్టే వెసులుబాటు ఉందని తెలిపారు. ఏదైమైనా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము పని చేస్తామని చెప్పారు.



మత విద్వేషాలు రెచ్చగొట్టారు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఇతర బీజేపీ నేతలు జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో మతపరమైన ప్రసంగాలు చేశారని, ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమే అవుతుందని, రాజకీయ పార్టీలకు ఈసీ జారీ చేసిన మార్గదర్శకాలను కూడా వారు బేఖాతరు చేశారని సీపీఐ (ఎం) ఆరోపించింది. మతపరమైన ప్రసంగాలు చేసిన మోడీ, షా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్ సహా బీజేపీ నేతలకు నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టాలని ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేసింది. సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ ఈ నెల 3-5 తేదీల మధ్య న్యూఢిల్లీలో సమావేశమైంది. ఆ తర్వాత ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ వివరాలు...

ఈసీ చర్యలు తీసుకోవాలి

జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ నేతృత్వంలో పలువురు బీజేపీ నేతలు మతపరమైన ప్రసంగాలు చేస్తున్నారు. ఇది ప్రవర్తనా నియమావళిని, రాజకీయ పార్టీలకు ఈసీ జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించడమే అవుతుంది. ప్రధాని తన ప్రసంగాలలో నేరుగా ముస్లింలను లక్ష్యంగా చేసుకొని అవమానిస్తున్నారు. వారిని 'చొరబాటుదా రులు'గా చిత్రీకరిస్తున్నారు. 'వారు గిరిజనుల ఆహారాన్ని, కుమార్తెలను అపహరిస్తున్నారు' అంటూ విద్వేషపూరిత, మతపరమైన ప్రసంగాలు చేశారు. వివిధ సమూహాల మధ్య విభేదాలు సృష్టించి ఓట్లను దండుకోవడానికే ఆయన ఇలా రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని స్పష్టమవుతోంది. అలాంటి ప్రసంగాలను ఎన్నికల కమిషన్ సుమోటోగా పరిగణనలోకి తీసుకోకపోవడం గర్హనీయం. ప్రధాని, హోం మంత్రి, ఇతర బీజేపీ నేతలకు ఈసీ నోటీసులు జారీ చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాము. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్ తదితర నాయకులు కూడా ఇలాంటి ప్రసంగాలే చేస్తున్నారు.

మహారాష్ట్ర, జార్ఖండ్ శాసనసభ ఎన్నికలపై

మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)తో సీట్ల సర్దుబాటులో భాగంగా సీపీఐ (ఎం) రెండు స్థానాలకు పోటీ చేస్తోంది. ఈ రెండూ గిరిజన స్థానాలే. థానే-పాల్ఘూర్ జిల్లాలోని దహనూ (ఎస్టీ) స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యే వినోద్ నికోలే పోటీలో ఉన్నారు. నాసిక్ జిల్లాలోని కల్వన్ (ఎస్టీ) స్థానం నుండి జేపీ గవిట్ రంగంలో నిలిచారు. ఈయన ఇదే స్థానం నుండి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గత ఎన్నికలలో రెండో స్థానంలో నిలిచారు. వీటితో పాటు సోలాపూర్ సిటీ సెంట్రల్ స్థానంలో పార్టీ స్నేహపూర్వక పోటీకి దిగింది. అక్కడ సీనియర్ నేత, మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన నరసయ్య ఆదాం పోటీలో ఉన్నారు.

జార్ఖండ్‌లో ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్న జేఎంఎం పార్టీ సీపీఐ (ఎం)తో చర్చలకు ఎలాంటి చొరవ చూపలేదు. ఈ నేపథ్యంలో పార్టీ తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను నిలిపింది. వీటిలో ఐదు ఎస్టీ, ఒక ఎస్సీ స్థానం ఉన్నాయి. మిగిలిన స్థానాలలో బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించే సత్తా ఉన్న అభ్యర్థులకు పార్టీ మద్దతు ఇస్తుంది.

ఎరువుల కొరత

రబీ సీజన్‌లో రైతాంగ అవసరాల కోసం తగినంత డీఏపీ ఎరువును అందుబాటులో ఉంచాల్సి ఉండగా ఆ విషయంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. పెద్ద ఎత్తున డీఏపీ ఎరువుకు కొరత ఏర్పడడంతో రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. గత సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో 34.5 లక్షల టన్నుల డీఏపీని దిగుమతి చేసుకోగా ఈ ఏడాది అదే కాలంలో కేవలం 19.7 లక్షల టన్నులు మాత్రమే దిగుమతి అయ్యాయి. ఇటు దేశీయ ఉత్పత్తి కూడా పడిపోయింది. అక్టోబర్ 1వ తేదీ నాటికి 15-16 లక్షల టన్నుల డీఏపీ మాత్రమే నిల్వ ఉంది. అప్పటికి 27-30 లక్షల టన్నులు అవసరమవుతాయని సిఫార్సులు ఉన్నాయి. అక్టోబర్ మధ్య నుండి డిసెంబర్ మధ్య నాటికి 60 లక్షల టన్నుల డీఏపీ ఎరువుకు డిమాండ్ ఉంటుందని అంచనా.

డీఏపీతో పాటు యూరియా, ఎంఓయూకు కూడా కొరత ఏర్పడింది. 50 కిలోల డీఏపీ బస్తాకు ప్రభుత్వం రూ.1,350 ధర నిర్ణయించగా రైతులు దానికి అదనంగా రూ.300-500 చెల్లించాల్సి వస్తోంది. వైఫల్యాన్ని అంగీకరించి, తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం నానో-యూరియా, నానో-డీఏపీ ఎరువులపై ప్రచారం చేస్తోంది. అయితే ఈ ఎరువుల సమర్థత ప్రశ్నార్థకంగానే ఉంది.

దేశీయంగా యూరియా, డీఏపీ ఎరువులను ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నియంత్రణ ఎత్తివేయడం, పెట్టుబడి వ్యయం పెరగడంతో ఎరువుల ధరలు పెరుగుతుండడం ప్రధాన సమస్యగా ఉంది.

ఉపాధి కార్మికుల హక్కులపై దాడులు

నరేగా కార్మికులుగా పనిచేస్తున్న పేదల హక్కులపై డిజిటలీకరణ పేరుతో దాడి జరుగుతోంది. గత రెండు సంవత్సరాలలో ఎనిమిది కోట్ల మంది రిజిస్టర్డ్ కార్మికులను తొలగించి, వారికి పని ప్రయోజనాలను నిరాకరించారు. ఇది చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి జీడీపీలో శాతంగా కేటాయింపులు తగ్గించారు. సాంకేతికత పేరిట సమస్యలు సృష్టించడంతో పాటు బడ్జెటరీ కేటాయింపులు కుదించడం గ్రామీణ పేద కుటుంబాల చట్టబద్ధమైన హక్కులపై దాడి చేయడం తప్ప మరొకటి కాదు. ప్రస్తుతం సంవత్సరానికి 100 రోజుల పని కల్పిస్తుండగా దానిని కనీసం 150 రోజులకు పెంచాలని ఈ ఏడాది ప్రారంభంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది. బడ్జెట్ కేటాయింపులు కూడా పెంచాలని సూచించింది. ఈ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాల్సి ఉంది.

జాతీయ మహాసభలకు సన్నాహాలు

గత 2022 ఏప్రిల్‌లో జరిగిన పార్టీ జాతీయ మహాసభలలో రూపొందించిన రాజకీయ-వ్యూహాత్మక ఎత్తుగడల అమలుపై కేంద్ర కమిటీ చర్చించి రాజకీయ సమీక్షా నివేదికను రూపొందించింది. వచ్చే సంవత్సరం ఏప్రిల్ 2 నుండి 6వ తేదీ వరకూ మదురైలో జరగనున్న పార్టీ 24వ మహాసభల కోసం రూపొందించే ముసాయిదా రాజకీయ తీర్మానానికి ఇదే ప్రాతిపదిక. పార్టీ మహాసభలకు రాష్ట్రాల వారీగా హాజరు కావాల్సిన ప్రతినిధుల కోటాను కూడా కేంద్ర కమిటీ ఖరారు చేసింది. రాబోయే రాష్ట్ర మహాసభలలో వీరిని ఎన్నుకుంటారు.



అమెరికా ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్

వాషింగ్టన్ : అమెరికా ఉపాధ్యక్షుడిగా తెలుగింటి అల్లుడు జేడీవాన్స్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన భార్య ఉషావాన్స్ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాకు చెందిన వారు కావడం విశేషం. ఉషా చిలుకూరి తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి దంపతులు 1980లో అమెరికాకు వలసవెళ్లారు. వీరి ముగ్గురు సంతానంలో ఉషా ఒకరు. జేడీవాన్స్ ఒహాయో రాష్ట్ర సెనేటర్‌గా, అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్ ఎంపిక చేసుకుని ఎన్నికల్లో పోటీ చేశారు. చదువుకునే రోజుల్లోనే స్కూల్‌లో ఉషాకు వాన్స్ పరిచయమయ్యారు. ఒకరి నొకరు ప్రేమించుకుని 2014లో హిందూ సంప్రదాయం ప్రకారం కెంటకీలో వివాహం చేసుకున్నారు. ఉషా యేల్ యూనివర్సిటీ నుంచి చరిత్రలో బ్యాచిలర్ డిగ్రీ, కేంబ్రిడ్జి వర్సిటీ నుంచి తత్వశాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేశారు.

అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ సరికొత్త చరిత్ర

132 ఏండ్ల తర్వాత ఆ ఘనత సాధించిన వ్యక్తిగా రికార్డు..!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించి సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ ఎన్నికల్లో 538 ఎలక్టోరల్ ఓట్లలో మెజారిటీ మార్కు 270ను దాటారు. ట్రంప్ మెజారిటీ సీట్లను సాధించినట్టు అమెరికా మీడియా పేర్కొంటోంది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలుపొంది రెండోసారి విజయం సాధించిన సందర్భాలు అనేకం. అయితే అధ్యక్ష పదవి చేపట్టి మళ్లీ రెండోసారి ఎన్నికల బరిలో దిగి పరాజయం పాలై మూడోసారి పోటీ చేసి గెలుపొందిన సందర్భాలు చాలా తక్కువ. గత 130 ఏండ్ల అమెరికా చరిత్రలో అలాంటి పరిణామం ఇప్పటి వరకూ చోటు చేసుకోలేదు. తాజా ఎన్నికల్లో ఆ రికార్డును ట్రంప్ సాధించారు. దాదాపు 132 ఏండ్ల తర్వాత సరికొత్త చరిత్రను లిఖించారు. అంతకుముందు గ్రోవెర్ క్లీవ్‌ల్యాండ్ 1884 ఎన్నికల్లో గెలుపొంది అధ్యక్ష పదవి చేపట్టారు. ఆ తర్వాత నాలుగేండ్లకు 1888లో మళ్లీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడ్డారు. కానీ ఆ ఎన్నికల్లో ఓటమి చెందారు. 1992లో మళ్లీ అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. అయితే గెలుపొంది రెండోసారి అధ్యక్షుడిగా శ్వేతసౌధంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత ఇప్పటి వరకూ అలాంటి పరిణామం చోటు చేసుకోలేదు. తాజా ఎన్నికల్లో ఘనత సాధించిన రెండో వ్యక్తిగా ట్రంప్ నిలవనున్నారు.

నా మిత్రుడికి అభినందనలు

ట్రంప్‌నకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా గెలుపొందిన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు.

"చారిత్రాత్మక విజయం సాధించిన నా మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ కు హృదయపూర్వక అభినందనలు. మీ మునుపటి పదవీకాల విజయాలకు అనుగుణంగా.. భారత్, అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి మన సంబంధాలకు పునరుజ్జీవం కల్పించడానికి నేను ఎదురుచూస్తున్నాను. ప్రజల అభివృద్ధి, శ్రేయస్సు, ప్రపంచ శాంతి, సుస్థిరత్వం కోసం కలిసి పనిచేద్దాం' అంటూ రాసుకొచ్చారు. ఈ ట్వీట్‌కు గతంలో పలు వేదికల్లో ఇద్దరూ కలిసి దిగిన ఫొటోలను మోడీ పంచుకున్నారు

ఎల్ఎంవీ లైసెన్స్‌దారులు లైట్ ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్ నడపొచ్చు

మరోసారి తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

లైట్ మోటర్ వెహికిల్స్ (ఎల్ఎంవీ) డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు లైట్ ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్ (7,500 కిలోల కంటే తక్కువున్న) వాహనాలు నడపొచ్చని సుప్రీంకోర్టు మరోసారి తేల్చి చెప్పింది. వారి వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగినట్టు ఎలాంటి డేటా లేదని పేర్కొంది. అందువల్ల గతంలో ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు సుప్రీం స్పష్టం చేసింది. 2017లో ముకుంద్ దేవాంగన్ వర్సెస్ ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కేసులో ఎల్ఎంవీ లైసెన్స్ హోల్డర్లు లైట్ టాన్స్‌పోర్ట్ వెహికిల్ నడిపేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. ఈ తీర్పును పున: సమీక్షించాలని పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై బుధవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఇందుకు సంబంధించిన ధర్మాసనం తరపున జస్టిస్ హృషికేశ్ రాయ్ 126 పేజీల తీర్పును వెలువరించారు. ప్రధానంగా మోటర్ వెహికిల్ (ఎంవీ) యాక్ట్‌లోని పలు అంశాలను ప్రస్తావిస్తు నాలుగు ప్రధాన అంశాలను పొందుపరిచారు. 'రహదారి భద్రత అనేది మోటర్ వెహికల్ యాక్ట్ ప్రధాన లక్ష్యం. అయితే... ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం ఊహలతో ఎల్ఎంవీ హోల్డర్లపై నెపం వేయలేం. వాస్తవానికి రోడ్డు ప్రమాదాలకు భిన్న కారణాలుంటాయి. అజాగ్రత్త డ్రైవింగ్, అతివేగం, రోడ్లు సరిగా లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వంటివి యాక్సిడెంట్లకు కారణం. దీనికి తోడు మొబైల్ ఫోన్ డ్రైవింగ్, అలసట, సీట్ బెల్ట్ - హెల్మెట్ నిబంధనలను పాటించకపోవడం వంటివి. మోటర్ వాహనాన్ని నడపడం అనేది స్కిల్, థియరేటికల్ నాల్డెజ్‌కు సంబంధించింది. వేగం, మలుపులు, వివిధ రహదారుల పరిస్థితులతో డ్రైవింగ్ చేసే స్కిల్ ఉంటే చాలు.' అని పేర్కొంది. అంతేకానీ ఎల్ఎంవీ లైసెన్స్ హోల్డర్లు లైట్ ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్స్ నడపడం వల్ల యాక్సిడెంట్లు అవుతున్నాయనే అంచనాలు తప్పని తీర్పులో స్పష్టం చేసింది. ఇందుకు సరైన డేటాను కూడా పిటిషన్లు అందించలేకపోయారని గుర్తు చేసింది.

'ఆమె'కు అందని అమెరికా పీఠం

శతాబ్దాలైనా దూరమే

- ఓటు హక్కు పొందేందుకే ఏండ్లుగా ఎదురుచూపులు
- 1960లో అందరికీ న్యాయం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో 'ఆమె'కు అమెరికా పీఠం దూరంగానే ఉంటోంది. 248 ఏండ్ల ఆ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇప్పటి వరకూ 'వుమెన్ ప్రెసిడెంట్' పాలన లేదు. ఈ పీఠం కోసం కొందరు మహిళలు పోటీ పడినప్పటికీ విజయ తీరాలకు చేరుకోలేకపోయారు. తాజాగా భారత సంతతికి చెందిన కమలా హారిస్ కూడా డొనాల్డ్ ట్రంప్‌నకు గట్టి పోటీ ఇచ్చినా ఓవల్ ఆఫీస్‌కు దూరంగానే ఉండిపోయారు.

సింగపూర్, ఫిన్లాండ్ సహా అనేక దేశాల్లో మహిళలే సారథులుగా ఉండి దేశాన్ని నడిపిస్తున్నారు. కానీ, అమెరికాలో మాత్రం ఓటు హక్కు పొందేందుకే మహిళలు అనేక ఏండ్లు ఎదురుచూడాల్సి వచ్చింది. 1920లో ఇక్కడి మహిళలకు ఓటు హక్కు లభించినా కొందరికే పరిమితమైంది. ఏండ్ల పోరాటం అనంతరం చివరకు 1960లో అన్ని వర్గాల మహిళలకు ఓటు హక్కు లభించింది. ఈ క్రమంలో రాజకీయ చైతన్యం పొందిన వారు.. చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ అధ్యక్ష పీఠానికి మాత్రం దగ్గర కాలేకపోతున్నారు.

పోరాడి ఓడిన హిల్లరీ, కమల

గతంలో మార్గరేట్ చేస్ స్మిత్, షెల్లీ చిసమ్ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడ్డారు. ఇక హిల్లరీ క్లింటన్, కమలా హారిస్ ఎన్నికల వరకూ చేరుకొని ఓటమి చవిచూశారు. 2016లో హిల్లరీ క్లింటన్ అధ్యక్ష పీఠానికి దరిదాపుల్లోకి వచ్చినట్లే వచ్చి ఓడిపోయారు. అప్పటి ఎన్నికల్లో ట్రంప్ కంటే 30 లక్షల ఎక్కువ ఓట్లే సాధించారు. కానీ కీలకమైన ఎలక్టోరల్ కాలేజీలో మాత్రం వెనుకబడిపోయారు. తాజాగా కమలా హారిస్ ట్రంప్‌నకు గట్టి పోటీ ఇచ్చారు. అయినప్పటికీ పాపులర్, ఎలక్టోరల్ ఓట్లలో ఆమె వెనుకబడిపోయారు.



అధ్యక్ష పీఠం కోసం మహిళల పోటీ

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మహిళలు పోటీ చేసేందుకు గతంలో ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. కొందరు అభ్యర్థిత్వానికి పోటీ పడి ఓడిపోగా.. మరికొందరు మాత్రం అధ్యక్ష బరిలో నిలిచి పరాజయం పొందారు. ఈ క్రమంలో గతంలో అధ్యక్ష పీఠం కోసం ప్రయత్నించిన మహిళా నేతలను పరిశీలిద్దాం.

- 1964లో తొలిసారి మార్గరేట్ చేస్ స్మిత్ అనే మహిళ రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడ్డారు. కానీ ఆమెకు అభ్యర్థిత్వమే దక్కలేదు. కానీ ఆమే అధ్యక్ష పీఠానికి తొలి పోటీదారు.
- 1968లో... షెల్లీ చిసమ్ తొలి నల్లజాతి మహిళా సెనెటర్‌గా ఎన్నికయ్యారు. 1972లో ఆమె డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీలో ఉన్నట్లు ప్రకటించారు. కానీ ఆమెకూ చుక్కెదురే అయింది.
- 1980నాటికి అమెరికాలో ఫెమినిజం ఊపందుకుంది. ఫలితంగా 1984లో తొలిసారిగా డెమొక్రాటిక్ పార్టీ తరఫున గెరాల్డిన్ ఫెరారో... అధ్యక్ష అభ్యర్థిగా నిలిచారు. కానీ ఓడిపోయారు. కానీ మహిళల తరఫున మరో అడుగైతే ముందుకు పడింది.
- 2008లో.. హిల్లరీ క్లింటన్ డెమోక్రాటిక్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. కానీ పార్టీ అభ్యర్థిత్వం సంపాదించుకోలేకపోయారు. 2016లో పోటీ చేసి ఓటమి చవిచూశారు.
- 2024లో అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసిన కమలా హారిస్.. చివరకు పరాజయం పాలవడంతో అధ్యక్ష పీఠాన్ని చేరుకోలేకపోయారు.



ఎత్తిపోతల పనులు ప్రారంభించాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్

- పార్టీ నారాయణపేట జిల్లా మహాసభలో నూతనకమిటీ ఎన్నిక

నవ తెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

నారాయణపేట- మక్తల్ -కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ అన్నారు. సీపీఐ(ఎం) నారాయణపేట జిల్లా ద్వితీయ మహాసభ మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగింది. ఈ సందర్భంగా సాగర్ ప్రసంగించారు. ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సాగుకు నీరందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శిగా జి.వెంకటరామిరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులుగా గోపాల్, అంజలాగౌడ్, పుంజనూరు ఆంజనేయులు, బాలరామ్, జిల్లా కమిటీ సభ్యులుగా గోవింద్ రాజ్, జోషి, కాశప్ప, నరహరి, అశోక్, బాలప్ప, దస్తప్ప, బొమ్మన్‌పాడ్ బలరామ్, మహ్మద్ అలీ, శివకుమార్‌ను మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మరాఠా పీఠం ఎవరిదో...!?

నువ్వా నేనా అంటున్న మహాయుతి, ఇండియా బ్లాక్

- ప్రభావం చూపనున్న శివసేన, ఎన్సీపీ చీలికలు
- ప్రభుత్వాన్ని కలవరపరుస్తున్న ఉల్లి, చక్కెర రైతుల ఆందోళనలు

దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికల సమరం సాగబోతోంది. ఈ ఎన్నికలలో ఆరు కీలక పార్టీలు తలపడుతున్నాయి. వీటిలో కాంగ్రెస్, బీజేపీ జాతీయ పార్టీలు కాగా శివసేన, శివసేన (యూబీటీ), ఎన్సీపీ, ఎన్సీపీ (శరద్ పవార్) ప్రాంతీయ పార్టీలు. అధికారంలో ఉన్న మహాయుతిలో బీజేపీ 152, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 78, అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ 52 స్థానాలలో అభ్యర్థులను నిలిపాయి. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీడీ)లో కాంగ్రెస్ 102, సేన (యూబీటీ) 96, ఎన్సీపీ (ఎస్పీ) 87 స్థానాలకు పోటీ చేస్తున్నాయి. ఈ రెండు కూటములూ తమ మిత్రపక్షాలైన చిన్న చిన్న పార్టీలకు కొన్ని స్థానాలను వదిలేశాయి. ప్రస్తుతానికి ఇరు పక్షాలకూ విజయావకాశాలు సమానంగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకుడు అభయ్ దేశ్‌పాండే చెప్పారు.

ముంబయి : మహారాష్ట్రలో ఆరు ప్రాంతాలు, 36 జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం శాసనసభ స్థానాలు 288. ఏ ఒక్క పార్టీకీ రాష్ట్రవ్యాప్తంగా మద్దతు లేదు. ఒక్కో పార్టీకి ఒక్కో ప్రాంతంలో బలం ఉంది. ఈ ఎన్నికలలో పలు అంశాలు ప్రభావం చూపబోతున్నాయి. మరాఠాలు-ఓబీసీల మధ్య వివాదం, ఉల్లి రైతుల డిమాండ్లు, చెరకు పండించే ప్రాంతాలలో ఆందోళనలు...ఇవన్నీ ఓటర్లపై ప్రభావం చూపే అంశాలే. రాష్ట్రంలోని ఆరు ప్రాంతాలలో నెలకొన్న ఎన్నికల వాతావరణాన్ని ఒకసారి సింహావలోకనం చేసుకుంటే...

ముంబయిలో...

కొన్ని దశాబ్దాలుగా ముంబయి, దాని పరిసర జిల్లాలలో అవిభక్త శివసేనకు మంచి పట్టుంది. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌పై శివసేన పాతిక సంవత్సరాల పాటు అప్రతిహతంగా ఆధిపత్యం చెలాయించింది. ముంబయి జనాభాలో 28-30 శాతం మంది మరాఠీలే. గుజరాతీలు 19 శాతం ఉండగా యూపీ, బీహార్, కర్నాటక, రాజస్థాన్ నుండి వలస వచ్చిన వారు మరో 40 శాతం వరకూ ఉంటారు. ఈ ప్రాంతంలో 36 శాసనసభ స్థానాలు ఉన్నాయి. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పేరుతో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రతిపక్ష ఎంవీఏకు ధారవి పునరభివృద్ధి ప్రాజెక్ట్ ఎన్నికల అస్త్రంగా మారింది. ఈ ప్రాజెక్టు కాంట్రాక్టును అదానీ గ్రూప్ దక్కించుకున్న విషయం తెలిసిందే. ధారవిలో ఉండే వారికి పునరావాసం కల్పించే పేరుతో నగరంలోని ప్రభుత్వ భూమిని మహాయుతి సర్కారు అదానీ గ్రూపుకు ధారాదత్తం చేసిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.



మరాఠీలు, మరాఠీ యేతరుల మధ్య నెలకొన్న రగడ కూడా ఎన్నికల అంశంగా మారుతోంది. రాష్ట్రంలో కొత్తగా చేపట్టిన పారిశ్రామిక ప్రాజెక్టులను ప్రభుత్వం పొరుగున ఉన్న గుజరాత్‌కు కట్టబెడుతోందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో ముంబయి ప్రాంతంలో ఎంవీఏ 4 స్థానాలు గెలుచుకోగా బీజేపీ, షిండే సేన ఒక్కో స్థానానికి మాత్రమే పరిమితమయ్యాయి.

థానే, కొంకణ్‌లో...

ఐదు జిల్లాలలో విస్తరించి ఉన్న కోస్తా ప్రాంతంలో 39 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ బాల్ థాకరే నేతృత్వంలోని అవిభక్త శివసేన ప్రభావం ఎక్కువే. థానే ప్రాంతంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు పట్టుంది. ఈ ప్రాంతంలో కూడా మహాయుతి ప్రభుత్వం భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ఆశలు పెట్టుకుంది. అయితే ఆయా ప్రాజెక్టులపై స్థానికులలో నెలకొన్న అసమ్మతిని సొమ్ము చేసుకోవడానికి ఎంవీఏ ప్రయత్నిస్తోంది. రాజ్‌కోట్ కోటలో ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిన ఘటనపై ప్రతిపక్షం మండిపడుతోంది. దీనిని ఎన్నికల ప్రచారాంశంగా వాడుకోవాలని అది భావిస్తోంది. గతంలో శివసేనకు కంచుకోటలుగా ఉన్న కొంకణ్, రత్నగిరి, సింధుదుర్గ్‌లో కాలూనాలని బీజేపీ తాపత్రయ పడుతోంది.

పశ్చిమ మహారాష్ట్రలో...

ఈ ప్రాంతంలో చెరకు తోటలు అధికంగా ఉన్నాయి. అవిభక్త ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలకు ఇక్కడ మంచి ఆదరణ ఉంది. ఈ ప్రాంతంలోని ఆరు జిల్లాలలో 70 శాసనసభ స్థానాలు ఉన్నాయి. పశ్చిమ మహారాష్ట్ర రాజకీయాలపై సహకార రంగం ప్రభావం ఎక్కువ. 1960 నుండి మహారాష్ట్రను పాలించిన 20 మంది ముఖ్యమంత్రులలో ఐదుగురు ఈ ప్రాంతం వారే. సీనియర్ నేత శరద్ పవార్‌ది కూడా పశ్చిమ మహారాష్ట్రే. 2014 వరకూ ఇక్కడ కాంగ్రెస్-ఎన్సీపీ కూటమిదే హవా. గత శాసనసభ ఎన్నికలలో అవిభక్త ఎన్సీపీ 27, కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా బీజేపీకి 20, శివసేనకు ఐదు స్థానాలు వచ్చాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో ఈ ప్రాంతంలోని మొత్తం 10 స్థానాలలో ఎంవీఏకు 8 సీట్లు లభించాయి. ఇప్పుడు శరద్ పవార్, ఆయన మేనల్లుడు అజిత్ పవార్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. బీజేపీ నుండి సీనియర్ నేతలను ఆకర్షించడంలో శరద్ పవార్ విజయం సాధించగలిగారు. రాబోయే శాసనసభ ఎన్నికలలో అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ ఏ మేరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాల్సి ఉంది.

విదర్భలో...

ఈ ప్రాంతంలో 62 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మరాఠాలు, ఓబీసీలు, గిరిజనులు, దళితుల సంఖ్య గణనీయంగానే ఉంది. 11 జిల్లాలు ఉన్న విదర్భ ప్రాంతం ఒకప్పుడు కాంగ్రెస్‌కు పెట్టని కోటగా నిలిచింది. అయితే 1990 ప్రాంతంలో బీజేపీ తన ప్రాభవాన్ని చాటుకోవడం మొదలు పెట్టింది. అప్పటి నుండీ విదర్భ బీజేపీ-సేన కూటమికి పట్టం కడుతూనే ఉంది. ప్రత్యేక విదర్భ రాష్ట్ర ఏర్పాటుకు బీజేపీ వ్యూహాత్మకంగా మద్దతు ఇవ్వడం ఆ పార్టీకి బాగా కలిసొచ్చింది. అయితే శివసేన వ్యతిరేకించడంతో ఆ ప్రతిపాదన ఎన్నడూ ముందుకు రాలేదు. విదర్భను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానంటూ బీజేపీ కొత్త పల్లవి అందుకుంది. 2019 శాసనసభ ఎన్నికలలో బీజేపీకి 29, శివసేనకు 7 సీట్లు వచ్చాయి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో విదర్భలోని 10 స్థానాలలో ఎంవీఏకు 7 సీట్లు లభించాయి. ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయం ఈ ప్రాంతంలోని నాగపూర్‌లోనే ఉంది. బీజేపీకి చెందిన గడ్కరీ, ఫడ్నవీస్ వంటి ప్రముఖ నేతలు ఇక్కడి వారే. సోయాబీన్, పత్తి పండించే రైతులకు పెట్టుబడి వ్యయం అధికంగా ఉండడం ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.



మరట్వాడాలో....

కరువుతో విలవిలలాడుతున్న మరట్వాడా ప్రాంతంలోని ఎనిమిది జిల్లాలలో 46 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ మరాఠాలు, ఓబీసీలతో పాటు ముస్లింలు కూడా ఎక్కువగానే నివసిస్తున్నారు. మరాఠాలు, ఓబీసీల మధ్య నెలకొన్న విభేదాలు ఈ ఎన్నికలలో ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒకప్పుడు మరట్వాడా కాంగ్రెస్‌కు కంచుకోట. ఈ ప్రాంతం రాష్ట్రానికి నలుగురు ముఖ్య మంత్రులను అందించింది. మరట్వాడా యూనివర్సిటీకి బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టడంపై ఇక్కడ పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయి. 1980వ దశకంలో శివసేన, బీజేపీ పార్టీలు ఈ ప్రాంతంలో తమ ఉనికిని చాటుకున్నాయి. ఓబీసీ కేటగిరీలో మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ గత సంవత్సరం ఇక్కడ ఆందోళన మొదలైంది. అయితే దీనిని వ్యతిరేకించే వారంతా సంఘటితమయ్యారు. గత శాసనసభ ఎన్నికలలో ఈ ప్రాంతంలో బీజేపీ, అవిభక్త శివసేన కూటమి 28 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్, ఎన్సీపీలు చెరో 8 స్థానాలతో సంతృప్తి పడాల్సి వచ్చింది. లోక్‌సభ ఎన్నికలలో మాత్రం మొత్తం 8 స్థానాలలో ఎంవీఏకు 7 లభించాయి.

ఉత్తర మహారాష్ట్రలో...

ఈ ప్రాంతంలోని నాలుగు జిల్లాలలో కలిపి 35 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ గిరిజనులు, ఓబీసీలు అధికంగా ఉంటారు. ఓబీసీల ఓట్లు సంఘటితం కావడంతో గతంలో బీజేపీ లబ్ది పొందగలిగింది. అయితే ఉల్లి పండించే రైతులలో పెల్లుబుకుతున్న ఆగ్రహం మహాయుతిని దెబ్బతీసే అవకాశాలు కన్పిస్తున్నాయి. గత లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి కేవలం రెండు స్థానాలు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్‌కు రెండు, ఎన్సీపీ (పవార్), శివసేన (యూబీటీ)లకు ఒక్కో స్థానం దక్కాయి. గత శాసనసభ ఎన్నికలలో బీజేపీకి 13 సీట్లు లభించాయి. ఎన్సీపీ 7, సేన 6, కాంగ్రెస్ 5 స్థానాలు గెలుచుకున్నాయి. ఉత్తర మహారాష్ట్రలో మజ్లిస్ పార్టీకి రెండు స్థానాలు వచ్చాయి.

గత సంవత్సరం డిసెంబరులో ఉల్లి ఎగుమతులపై విధించిన నిషేధాన్ని ఈ మేలో తొలగించారు. ఉల్లిపై ఎగుమతి సుంకాన్ని 40 శాతం నుండి 20 శాతానికి తగ్గిస్తూ కేంద్రం గత సెప్టెంబరులో నిర్ణయం తీసుకుంది. ఈ అంశాలు ఓటర్లపై ప్రభావం చూపవచ్చు. గిరిజన ఓటర్లు...ముఖ్యంగా నాసిక్‌లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. లోక్‌సభ ఎన్నికలలో వీరంతా ఎంవీఏకు బాసటగా నిలిచారు.

నవతెలంగాణ

రాజకీయపరమైన స్వతంత్రం ఎంత ఉన్నా అది ఆకలితో అలమటించే వారిని సంతోషపెట్టలేదు - విఐ లెనిన్

గురువారం 07 నవంబరు 2024
www.navatelangana.com

సంపాదకీయం

అది వారి హక్కే...

ఉత్తరప్రదేశ్‌లోని మదర్సాలలో చదువుకునే 17లక్షలమంది విద్యార్థులకు భారీ ఊరట లభించింది. ఆ రాష్ట్రంలో ఏర్పాటైన 16 వేలకుపైగా మదర్సాలు చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు మంగళవారం తేల్చిచెప్పింది. ఈ పాఠశాలలు లౌకికవాద సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. చట్టం రూప కల్పనలో లోపాలున్నాయని నిరూపించినప్పుడు, ప్రాథమిక హక్కులకు, రాజ్యాంగ నిబంధనలకు భంగం కలిగినట్టు నిర్ధారించినప్పుడు మాత్రమే ఆ చట్టాన్ని రద్దు చేయగలరని తెలిపింది. యూపీ ప్రభుత్వం 2004లో ముస్లిం మైనారిటీ విద్యాసంస్థలను నియంత్రిస్తూ మదర్సా విద్యామండలి చట్టాన్ని తీసుకొచ్చింది. రాజ్యాంగంలోని 25వ ప్రవేశికకు అనుగుణంగానే ఈచట్టం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భాష, మతపరమైన అల్పసంఖ్యాక వర్గాల ప్రజలు విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకుని, నిర్వహించుకునే హక్కును రాజ్యాంగం కల్పించిందన్న విషయాన్ని సైతం న్యాయస్థానం గుర్తుచేసింది. అయితే, మదర్సా విద్యాసంస్థలు జారీచేసే 'ఫాజిల్ (డిగ్రీతో సమానం)', 'కామిల్ (పీజీతో సమానం)' స్థాయి పట్టాలపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. యూజీసీ నిబంధనలకు ఇది విరుద్ధంగా ఉందని స్పష్టం చేసింది.

> స్వాతంత్ర్యం తరవాత మదర్సాలు చట్టబద్ధంగానే ఏర్పాటయ్యాయి. వీటి నిర్వహణ రహస్య వ్యవహారం ఏమీకాదు. తొలినుంచి వీటిని వ్యతిరేకించే బీజేపీ తాను అధికారంలోకి వచ్చింది మొదలు తమ విద్వేష రాజకీయాల్లో వీటిని భాగం చేశాయి. మదర్సాలలో కేవలం ఇస్లాం మత బోధనలే కొనసాగడం లేదు. దానితో పాటు హిందీ, ఇంగ్లీషు లాంటి భాషలు, కంప్యూటర్ విద్య లాంటివీ ఉంటాయి. అలహాబాద్ హైకోర్టు తీర్పు తర్వాత ఈ విద్యాలయాల్లోని ఉపాధ్యాయులను, విద్యార్థులను మామూలు విద్యాలయాల్లో చేర్పించాలను కున్నారు. దానికి అనేక శక్తులు ఎన్నో అవాంతరాలు కలిగించాయి. ఆ విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకం చేశాయి.



ఉత్తరప్రదేశ్ తరపున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ కెఎం నటరాజ్ "మదర్సాల్లో బోధనా కోర్సుల్లో గణితం, సైన్స్, సామాజికశాస్త్రం వంటి సబ్జెక్టుల ప్రమేయం వుండదని, సెక్యులర్ సబ్జెక్టులను చదవడమనేది పూర్తిగా మన ఇష్టం" అని లాజిక్‌ను తీసుకువచ్చారు. ఆ లాజిక్‌ను తిప్పికొడుతూ సర్వోన్నత న్యాయస్థానం "మదర్సాలా బోర్డు చట్టాన్ని కొట్టివేయడంలో పరిష్కారం లేదు. మదర్సాల్లో చదువుకునే విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం ఇతర విద్యాసంస్థల్లో అందచేసే నాణ్యత కలిగిన విద్యను పొందేలా చూసేందుకు తగిన ఆదేశాలు జారీచేయాలి" అని వ్యాఖ్యానించింది. మదర్సాల్లో చదివే వారితో సహా మొత్తంగా విద్యార్థులందరి పట్ల 'చట్టబద్ధమైన ప్రభుత్వ ప్రయోజనం' రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నట్లయితే, జీవితంలో వారు మంచి స్థానాల్లో నెలకొనేలా నాణ్యతా ప్రమాణాలు కలిగిన విద్యను అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని కూడా స్పష్టం చేసింది సర్వోన్నత న్యాయస్థానం. ముస్లింలు విద్యాసంస్థలు నిర్వహిస్తే దాన్ని అనుమాన దృష్టితో చూడటం అలవాటైన రోజుల్లో సుప్రీంకోర్టు తాజా తీర్పు మతోన్మాదులకు ఒక చెంపపెట్టు. మదర్సాలలో విద్యాభ్యాసం చేసే వారు ఒక ఉత్తరప్రదేశ్‌లోనే కాదు దేశమంతటా ఉన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో మదర్సాలు ప్రముఖమైన పాత్ర పోషించిన వాస్తవాన్ని విస్మరించకూడదు. వీటిలో చదువుకున్న అనేక మంది నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. స్వాతంత్ర్యం తర్వాత మదర్సాలు చట్టబద్ధంగానే ఏర్పాటయ్యాయి. వీటి నిర్వహణ రహస్య వ్యవహారం ఏమీకాదు. తొలినుంచి వీటిని వ్యతిరేకించే బీజేపీ తాను అధికారంలోకి వచ్చింది మొదలు తమ విద్వేష రాజకీయాల్లో వీటిని భాగం చేశాయి. మదర్సాలలో కేవలం ఇస్లాం మత బోధనలే కొనసాగడం లేదు. దానితో పాటు హిందీ, ఇంగ్లీషు లాంటి భాషలు, కంప్యూటర్ విద్య లాంటివీ ఉంటాయి. అలహాబాద్ హైకోర్టు తీర్పు తర్వాత ఈ విద్యాలయాల్లోని ఉపాధ్యాయులను, విద్యార్థులను మామూలు విద్యాలయాల్లో చేర్పించాలను కున్నారు. దానికి అనేక శక్తులు ఎన్నో అవాంతరాలు కలిగించాయి. ఆ విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకం చేశాయి.

ఒక మతంవారు ప్రత్యేకంగా విద్యాలయాలు నడపకూడదని వాదించడం ప్రారంభిస్తే అది క్రమంగా ఇతర మతాలు నడిపే విద్యాలయాలకు కూడా వర్తింపచేసే ప్రమాదముంది. హిందూ సంస్థలు కూడా పాఠశాలలను నడుపుతున్నాయి. ఆరెస్సెస్ సరస్వతీ శిశు విద్యామందిరాల లాంటివి నడుపుతూనే ఉన్నాయి. అందులో చేయించే ప్రార్థనలూ సైతం భిన్నంగానే ఉంటాయి. కాని దీన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోరు. అదే మదర్సాల దగ్గర కొచ్చేసరికి బోలెడు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంటారు. మదర్సా విద్యను మరింత మెరుగు పరచవలసిన అవసరం ఉండొచ్చు. ఆపని చేయడానికి రాష్ట్రాల ప్రభుత్వాలు ఆ మతానికి చెందిన ప్రతినిధులతో చర్చించి సముచిత నిర్ణయం తీసుకోవచ్చు. ఒక మతంవారు, ముఖ్యంగా విద్యాలయాలను నెలకొల్పితే వక్ర దృష్టితో చూడవలసిన అగత్యమేమి లేదు. ఎవరికి నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను జాతి, మతాలతో నిమిత్తం లేకుండా రాజ్యాంగం అందరికీ కల్పించింది. అదే సమయంలో మతం మారే హక్కునే కాదు... ఏమతాన్ని అనుసరించకుండా ఉండే హక్కును సైతం ఇచ్చింది. అలాంటప్పుడు ఒక మతాన్నే వెలేసినట్టు చూడటమే నిజానికి రాజ్యాంగ విరుద్ధం.

అక్టోబరు విప్లవ ప్రాసంగిత



ఆర్. సుధాభాస్కర్

సోవియట్ విప్లవం ప్రపంచవ్యాపితంగా ఉన్న పెట్టుబడిదార్ల, భూస్వాముల గుండెల్లో ప్రకంపనలు సృష్టించింది. జాతీయ విముక్తి ఉద్యమాలకు బాసటగా నిలిచింది. ప్రస్తుత భారతదేశ పరిస్థితుల్లో దాని ప్రాసంగితను రేఖామాత్రంగానైనా అర్థం చేసుకునేందుకే ఈ వ్యాసం.

(జూలియన్ క్యాలెండర్ ప్రకారం) అక్టోబరు విప్లవం రష్యాలోనే సంభవించి ఉండచ్చు. అది రష్యాకే సంబంధించినది ఎంతమాత్రం కాదు. ఆ విధంగా వ్యాఖ్యానించిన వారి నోళ్లు మూయించడానికా అన్నట్టు స్టాలిన్ "అక్టోబర్ విప్లవం ఒక జాతీయ సరిహద్దుల మధ్య జరిగిన ఘటనగా చూడకూడదు. ప్రాథమికంగా ఇది అంతర్జాతీయ ప్రాధాన్యతున్న విషయం. ప్రపంచ మానవాళి చరిత్రను ఒక మలుపు తిప్పిన ఘటన. గతంలో జరిగిన విప్లవాలన్నీ ఒక దోపిడీ చేసే ముఠా స్థానంలో మరో దోపిడీ ముఠా అధికారాన్ని హస్తగతం చేసుకున్నవే. దోపిడీ యథాతథంగా ఉండింది. కానీ, అక్టోబర్ విప్లవం దోపిడీనే అంతం చేసింది. వర్గరహిత సమాజాన్ని ఆవిష్కరించింది" - (స్టాలిన్ ఏరిన రచనల నుండి)


ప్రపంచ పరిణామాల దశనూ, దిశనూ మార్చిందా విప్లవం. వలస రాజ్య వ్యవస్థ బీటలు వారడానికి బీజాలు పడ్డాయి. జాతీయ విమోచనోద్యమాలకు మద్దతుగా 1920లో లెనిన్ కోమిన్‌టర్న్ 2వ కాంగ్రెస్‌లో ప్రతిపాదించిన తీర్మానం వలస వ్యవస్థలపై పోరాడే శక్తులకు వెయ్యేనుగుల బలమిచ్చినట్లయింది. ఎక్కడిదాకో ఎందుకు? భారత జాతీయోద్యమ నేతలందరిపై, లాలా లజపతిరాయి నుండి నెహ్రూ వరకు బాగా ప్రభావం చూపింది. 8 గంటల పనివిధానం కోసం ప్రపంచవ్యాపితంగా సాగే పోరాటాలకు అక్టోబర్ విప్లవానంతర నిర్ణయాలు ఉత్ప్రేరకాలయ్యాయి. అధికారంలోకొచ్చిన మరుక్షణం ఆ కార్మికవర్గ రాజ్యంలో 8 గంటల పని విధానం అమల్లోకొచ్చింది.

రష్యా ఫ్యూడల్ వ్యవస్థలో తాము సాగుచేస్తున్న భూమిపై ఏ హక్కులూ లేక అర్థాకలితో చనిపోతున్న రైతాంగానికి అక్టోబర్ విప్లవం జయప్రదమైన మరుక్షణం విడుదలైన 'భూ డిక్రీ' (ఆ దేశంలోని భూమంతా ప్రభుత్వం జాతీయం చేయడం) పెద్ద ఊరటనిచ్చింది. మన దేశంలో భూ పోరాటాలకు ఊపునిచ్చింది. దున్నేవాడికే భూమన్న నినాదానికి బలం చేకూర్చింది. కీలక పరిశ్రమలన్నీ జాతీయం చేయడం కూడా మన వంటి దేశాల్లో ప్రభుత్వరంగ కాన్సెప్ట్ అసలు తొడిగేందుకు తోడ్పడింది.

లెనినిజం ప్రాధాన్యత

విప్లవం జయప్రదమయ్యేనాటికి రష్యా అనేక ఐరోపా దేశాలతో పోలిస్తే వెనకబడిన దేశం. బాగా అభివృద్ధిచెందిన పారిశ్రామిక దేశాల్లో, జర్మనీ, ఇంగ్లండ్, అమెరికా వంటి చోట్ల కార్మికవర్గం తిరగబడ్తుందని, పెట్టుబడి పాలనను కూలుస్తుందన్న అంచనా వేశాడు మార్క్స్. దానికి భిన్నంగా సాపేక్షంగా వెనుకబడ్డ దేశం రష్యాలో ఈ తిరుగుబాటు ఎలా సాధ్యమైంది? 'నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయడమనే సూక్తిని లెనిన్ ఉటంకిస్తూ కూచోలేదు. రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ మేరకు అభివృద్ధి అయిందో అధ్యయనం చేశాడు. 'భూ సమస్య' ఏమిటో అధ్యయనం చేశాడు. సామ్రాజ్యవాద దశలో నాటి రష్యా ఉందనీ, ఆ సామ్రాజ్యవాద గొలుసులో బలహీనంగా ఉన్న లింకును తెంపాలని, అప్పటికి రష్యానే ఆ లింకని గుర్తించి ఆ లింకుపై భారీ సమ్మెట దెబ్బ మోదాడు. దభేల్న బద్దలైంది. కష్టజీవులపై వెలుగులు ప్రసరించింది.

మరో కీలకాంశం రష్యాలోని జాతుల సమస్యను లెనిన్ పరిష్కరించిన తీరు. ఏండ్ల తరబడి రష్యన్ జాతి కింద అణిచివేయబడుతున్న జాతులను జారు పాలనను కూల్చేందుకు సహకరించాలని, 'జాతుల బంధిఖానా' కూలిపోయిన తర్వాత 'విడిపోయే హక్కు'తో సహా వారికి గ్యారంటీ చేసేసరికి దశాబ్దాల అణిచివేతకు వ్యతిరేకంగా ఆ జాతులన్నీ ఉవ్వెత్తున లేచి జారు పాలనను కూల్చడంలో బోల్షివిక్కులకు సహకరించాయి. ఆ విధంగా 'యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్స్' (యూఎస్‌ఎస్‌ఆర్) ఉనికిలోకి వచ్చింది.



అనేక యుద్ధాలతో విసిగిపోయి, చితికిపోయిన రష్యన్ సైన్యం యుద్ధాలు చేయలేక డస్సిపోయి ఉన్నది. ఈ సైనికులంతా రైతాంగ బిడ్డలే. అందుకే వీరిని 'యూనిఫార్మ్ వేసుకున్న రైతులు ("పెజెంట్స్ ఇన్ యూనిఫార్మ్") అన్నాడు లెనిన్. 1905 విప్లవం విఫలమైన తర్వాత 'సర్వాధికారాలు సోవియట్లకే' అన్న లెనిన్ నినాదం కోట్ల సంఖ్యలో రైతాంగాన్ని కదిలించింది. నవంబర్ 7న అధ్యక్ష భవనంపై దాడి చేసిన కార్మికవర్గానికి, సైనిక సోవియట్‌లకు అండగా నిలిచింది రైతాంగం. అధికారంలోకి వచ్చిన మరుక్షణం భూమిని, పరిశ్రమలను జాతీయం చేయడంతోపాటు తాము ఏ దేశంతో యుద్ధం కోరుకోవడం లేదు కాబట్టి, శాంతిని వాంఛిస్తున్నాం కాబట్టి అన్ని యుద్ధాల నుండి వైదొలగుతున్నాం అని లెనిన్ ప్రకటించేసరికి రైతాంగంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయడమనే లెనినిస్టు సూత్రానికి నమూనాలివి. లెనినిజం ఒక మార్గదర్శి, విప్లవోద్యమానికి ఒక వేగుచుక్క అయ్యింది. ఆ విధంగానే మార్క్సిజం - లెనినిజం అనేమాట ప్రాచుర్యంలోకి వచ్చింది.

> కృశ్చేవ్ రూపంలో పుట్టిన రివిజనిజం 'వేరు పురుగై' మొత్తం వృక్షాన్ని తొలిచింది. చివరికి మిహాయిల్ గోర్బచేవ్ వంటి కుక్కమూతి పిందెలు 'పెరిస్త్రోయికా", "గ్లాస్‌నాస్త్" అంటూ 1991లో ఆ సోషలిస్టు మహా వృక్షాన్ని కూల్చేశారు. సోషలిజం కూలిపోయిందని కొందరు పండగ చేసుకున్నారు. కాని 1998 ఆసియా పులుల ఆర్థిక సంక్షోభం, 2001లో డాట్ కామ్ సంక్షోభం, 2008లో బద్దలైన అమెరికా హౌసింగ్ బుడగ సంక్షోభం నేటి వరకు పెట్టుబడిదారీ దేశాలను పట్టిన సంక్షోభాలు వదలడం లేదు. అందుకే పెట్టుబడిదారీ విధానమంటేనే సంక్షోభం, యుద్ధాలు, లాభాలకై వెంపర్లాట!

కష్టజీవుల ఆశాజ్యోతి సోషలిజం

1886 తర్వాత 8 గంటల పనిదినంకై సాగుతున్న ప్రపంచ కార్మికవర్గ పోరాటాలకు బహుశా ఈ కార్మికవర్గ రాజ్యం సోవియట్‌లోనే పరిష్కారం దొరికింది. అధికారంలోకి రాగానే 8 గంటల పనిదినం చట్టపరంగా అమలుచేశారు బోల్షివిక్కులు (కమ్యూనిస్టులు). సామాజిక భద్రతా అంశాలు అనేకం అమల్లోకొచ్చాయి. వాటి రూపాంతరాలే నేడు మన దేశంలో అమలౌతున్న పిఎఫ్, ఇఎస్ఐ వంటివి. కార్మికుల సంక్షేమం కోసం యజమానులు ఖర్చుచేయడం అప్పటిదాకా పెట్టుబడిదారీ ప్రపంచంలోని కార్మికుల ఊహకందని విషయాలివి. అటు కార్మికవర్గ రాజ్యం ఆవిర్భవించడంతోపాటు 1918లో మొదటి ప్రపంచయుద్ధ పరిసమాప్తి తర్వాత సామ్రాజ్యవాద దేశాల మధ్య మళ్లీ యుద్ధాలు రాకుండా చూసేందుకు ఒక 'రిఫరీ'ని, 'నానా జాతి సమితి'ని ఏర్పాటు చేసుకున్నారు. దాని ఆధ్వర్యంలో నడిచే అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 1919లో ఆవిర్భవించింది. సోవియట్ ప్రభుత్వం చర్యలు చూసిన తర్వాత ఐఎల్ఓ సభ్య దేశాలన్నింటిలో 8 గంటల పనివిధానం అమలు చేయాలనే నిబంధన వచ్చింది. బ్రిటన్‌లో 8 గంటల విధానం అమల్లోకొచ్చినా వారే పాలిస్తున్న భారతదేశంలోగాని, మరే వలస దేశంలోగాని 8 గంటల పని అమల్లోకి రాలేదు. మరో ముఖ్యమైన అంశం ప్రణాళికాబద్ధ అభివృద్ధి. సోవియట్‌లో 1928లో స్టాలిన్ నేతృత్వంలో పంచవర్ష ప్రణాళికలు ప్రారంభమైనాయి. పెట్టుబడిదారీ దేశాలకు తెలియనిది ఈ ప్రణాళికాబద్ధ అభివృద్ధి. అక్కడ పెట్టుబడిదారులకు ఏ రంగంలో లాభమొస్తే అక్కడే పెట్టుబడులు కేంద్రీకరిస్తారు. ప్రజలకు ఏది అవసరమో అది కాదు. మొదటి నుండీ ప్రణాళికలను వ్యతిరేకించే నాటి జన సంఘం, నేటి బీజేపీ 2014 మే 26న ప్రమాణ స్వీకారం చేసి, ఆగస్టు 15 ఎర్రకోట ఉపన్యాసంలో 'ప్లానింగ్ కమిషన్'ను రద్దుచేస్తున్నట్టు మోడీ ప్రకటించేశారు. 2015 జనవరి 1న నిటిఆయోగ్ పుట్టినట్టు ప్రకటించారు.

నేడు సోవియట్ సోషలిస్టు వ్యవస్థ కుప్పకూలంగానే మన దేశంలో 12 గంటల పనిదినం, చట్టాల్లో మార్పురాకుండానే సర్వసాధారణమై పోయింది. ప్రధాని కాకముందే "ప్రభుత్వరంగం పుట్టిందే చావడానికి, కొన్ని ముందే చస్తాయి, కొన్ని కొంచెం ఆలస్యంగా చస్తాయి" అన్నారు మోడీ. ఆ విధంగా నేడు సైద్ధాంతికంగానే ప్రభుత్వరంగం అంటే గిట్టని బీజేపీ చేతిలో దేశ పాలనుంది. ఒక పక్క సోషలిస్టు నమూనా కూలిపోయింది. మరోపక్క ఇంగ్లండ్‌లో థేమ్స్ నది ప్రయివేటీకరణ దగ్గరి నుండి రైల్వేల ప్రయివేటీకరణ, క్యాలిఫోర్నియా విద్యుత్ ప్రయివేటీకరణ వరకు బయట జరిగే ఏదీ మన దేశంలో ఎవరికీ తెలియవన్నంత తేలిగ్గా దేశంలో 'మోడియా' ప్రచారహోరు సాగుతోంది. ప్రయివేటీకరణల జోరు తగ్గట్లేదు.

నాడు సోవియట్‌లో సోషలిస్ట్ వ్యవస్థే లేకుంటే తూర్పుకి నాజీల దండయాత్ర విజయం సాధించివుంటే భారతదేశ స్వాతంత్ర్యం మనకి కలగానే మిగిలిపోయేది. ప్రపంచంలో వలస వ్యవస్థ యథాతథంగా ఉండి వుండేది. దాదాపు రెండు కోట్ల మంది సోవియట్ పౌరులు ప్రాణత్యాగం చేసి హిట్లర్ సైన్యాన్ని అడ్డుకున్నారు. వాడి చావుకు కారణమైనారు. రెండవ ప్రపంచ యుద్ధంలో అక్షరాజ్య కూటమి ఓటమిపాలు కావడం సోవియట్ ప్రజల అసమాన త్యాగాల ఫలితమే.

భారత జాతీయోద్యమంపై ప్రభావం

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ తన చుట్టూ జరిగే విషయాలను లోతుగా అధ్యయనం చేసేవారు. ఆయన 1930లో మాస్కో నుండి రాసిన లేఖలో "నేను ప్రస్తుతం రష్యాలో ఉన్నాను. నేను ఇక్కడికి రాకుంటే నా జీవిత గమ్యం అసంపూర్తిగా ముగిసేది. మొత్తం ప్రపంచం వారికి వ్యతిరేకంగా వున్నా లక్షపెట్టక ఒక నూతన ప్రపంచాన్ని

> రష్యాలో ఈ తిరుగుబాటు ఎలా సాధ్యమైంది? 'నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయడమనే సూక్తిని లెనిన్ ఉటంకిస్తూ కూచోలేదు. రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ మేరకు అభివృద్ధి అయిందో అధ్యయనం చేశాడు. 'భూ సమస్య' ఏమిటో అధ్యయనం చేశాడు. సామ్రాజ్యవాద దశలో నాటి రష్యా ఉందనీ, ఆ సామ్రాజ్యవాద గొలుసులో బలహీనంగా ఉన్న లింకును తెంపాలని, అప్పటికి రష్యానే ఆ లింకని గుర్తించి ఆ లింకుపై భారీ సమ్మెట దెబ్బ మోదాడు. దభేల్న బద్దలైంది. కష్టజీవులపై వెలుగులు ప్రసరించింది.

ఆవిష్కరించడానికి వారు చేస్తున్న కృషి నన్ను మంత్రముగ్ధుణ్ణి చేసింది. నా కళ్లతో నేను చూడకపోయుంటే తరతరాల పీడన వలన అజ్ఞానంలో, న్యూనతతో కుమిలిపోతున్న లక్షలాది ప్రజలను అక్షరాశ్యులను చేయడం, గౌరవంగా జీవించే మానవులుగా తీర్చిదిద్దడం సాధ్యమని నేను నమ్మేవాణ్ణి కాదు. ఆ వ్యవస్థను ఆ ప్రజలే కాపాడుకోగలరు" - అన్నారు ఠాగూర్. నెహ్రూ తన కుమార్తె ఇందిరాగాంధీకి రాసిన లేఖలో మొదటి ప్రపంచయుద్ధం సంగతి ఎలా ఉన్నా ఆ (అక్టోబర్) విప్లవమే ఒక అసాధారణ ఘటన. అది ప్రపంచ చరిత్రలో అసమాన్యమైనది. అప్పటికి ఆ విప్లవం మొదటిదే అయినప్పటికీ ఎంతోకాలం అది ఒంటరిగా ఉండదు. ప్రపంచవ్యాపితంగా విప్లవకారులకు ఆదర్శంగా ఉంటుంది" అని పేర్కొన్నారు.

ఆయన అక్కడే ఆగిపోలేదు. ఒక కాంగ్రెస్ మహాసభలో అధ్యక్షోపన్యాసం చేస్తూ "ప్రపంచ, భారతదేశ సమస్యలకు సోషలిజమొక్కటే పరిష్కారమని నేను విశ్వసిస్తున్నాను. సోషలిజం అనే మాటను అస్పష్టమైన మానవతావాద దృష్టిలో నేను వాడలేదు. శాస్త్రీయపరమైన, ఆర్థికపరమైన అర్థంలోనే వాడుతున్నాను. సోషలిజం ద్వారా తప్ప మన దారిద్ర్యాన్ని, విపరీతమైన నిరుద్యోగాన్ని రూపుమాపలేము" - అన్నారు. అతివాద నాయకులైన లాలాలజపతిరాయ్ 1920 ఎఐటీయూసీ ప్రారంభ సమావేశంలో అధ్యక్షోపన్యాసం చేస్తూ "సామ్రాజ్యవాదం, మిలటరీయిజం ఈ రెండూ పెట్టుబడిదారీ వటవృక్షానికి పుట్టిన కవలలు. దీనికి ఆలస్యంగానైనా రష్యాలో విరుగుడు కనుగొనబడింది. అదే రష్యా కార్మికవర్గ విప్లవం. ఏనాటికైనా సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థలకన్నా సోషలిజం, అందులోనూ బోల్షివిక్కులు నిర్మిస్తున్న వాస్తవమే నమ్మదగినది. మానవీయమైనది. ఉన్నతమైనది" అని స్పష్టం చేశారు.

ఆ విప్లవ ప్రభావం భారతదేశంపై పడకుండా 1920-28 మధ్య బ్రిటిష్ పాలకులు మూడు పెషావర్ కుట్రకేసులు, కాన్పూర్ కుట్రకేసు, బొంబాయి నుండి కలకత్తా వరకు కార్మికోద్యమంలో పనిచేస్తున్న 33 మందిని ఏరి మీరట్ కుట్ర కేసు బనాయించి జైళ్లలో కుక్కారు. అయినా, కమ్యూనిస్టు ఉద్యమం దేశవ్యాపితమైంది.

ముగింపు



కృశ్చేవ్ రూపంలో పుట్టిన రివిజనిజం 'వేరు పురుగై' మొత్తం వృక్షాన్ని తొలిచింది. చివరికి మిహాయిల్ గోర్బచేవ్ వంటి కుక్కమూతి పిందెలు 'పెరిస్త్రోయికా", "గ్లాస్‌నాస్త్" అంటూ 1991లో ఆ సోషలిస్టు మహా వృక్షాన్ని కూల్చేశారు. సోషలిజం కూలిపోయిందని కొందరు పండగ చేసుకున్నారు. కాని 1998 ఆసియా పులుల ఆర్థిక సంక్షోభం, 2001లో డాట్ కామ్ సంక్షోభం, 2008లో బద్దలైన అమెరికా హౌసింగ్ బుడగ సంక్షోభం నేటి వరకు పెట్టుబడిదారీ దేశాలను పట్టిన సంక్షోభాలు వదలడం లేదు. అందుకే పెట్టుబడిదారీ విధానమంటేనే సంక్షోభం, యుద్ధాలు, లాభాలకై వెంపర్లాట!

కష్టజీవులందరికీ నేడు సోవియట్ విప్లవం ఒక చెదిరిన కల. "చరిత్ర ఎప్పుడూ గెలిచిన వారి ఆస్తి" అనే మాట గుర్తుపెట్టుకుంటే నేటి యుద్ధంలో గెలిచిన సామ్రాజ్యవాదం వండివార్చిన కథలే ప్రచారంలో వున్నాయి. నాటి అక్టోబర్ విప్లవ నేపథ్యమేమిటి? దాని ప్రభావం ఏమిటి? వంటి అంశాలను తవ్వి తెలుసుకోవడమే మన కర్తవ్యం. ■


ధరల మంటల్లో మోడీ సర్కారు మొద్దు నిద్ర

ఈ ఏడాది సెప్టెంబరులో సగటు ధరల పెరుగుదల తొమ్మిది నెలల్లో లేనట్టుగా 55 శాతానికి చేరింది. మరీ ముఖ్యంగా ఆహార వస్తువుల ధరలు 9.2 శాతం దాటాయి. భారతీయుల్లో అత్యధికులు తమ ఆదాయంలో అర్ధభాగం ఆహారంపైనే ఖర్చుపెడతారు. అందువల్ల ఆహార ద్రవ్యోల్బణం మరీ దారుణంగా దెబ్బతీస్తుంది. ఆహార వస్తువుల లోనూ ప్రత్యేకించి కూరగాయల ధరల పెరుగుదల దిగ్భ్రాంతి కలిగించేంత తీవ్రంగా పెరిగింది. ఏడాది కేడాది చూస్తే టమోటాల ధర 42.4 శాతం, ఉల్లిపాయలు 66.2 శాతం, బంగాళా దుంపలు 65.3శాతం పెరిగాయి. దేశ వ్యాపితంగా అత్యధికంగా వినియోగించే కూరగాయలు ఈ మూడే. ప్రభుత్వం దానికి వంతపాడే ఆర్థికవేత్తలు షరా మామూలుగా ఇది వాతావరణ మార్పుల వల్ల వచ్చిన సమస్య అని సాకులు చెప్పడానికి తంటాలు పడినా వాస్తవం మారిపోదు. ప్రతియేటా కొన్ని కూరగాయల ధరలు భరించలేని స్థాయిలో మండిపోతాయి.అప్పటికే బరువుల మయంగా వున్న కుటుంబాల బడ్జెట్‌ల నుంచి ఈ కారణంగా వేల కోట్లు గల్లంతవుతుంటాయి.

ప్రజలపై భారాలు

మరికొన్ని వినియోగ వస్తువులకు సంబంధించి కూడా ధరల పెరుగుదల విపరతంగా వుంది. వంటనూనెలు కూడా ఆ పెరిగే వాటిలో భాగమే. గత మూడు నెలల్లో ముడి పామాయిల్ ధరలు 45శాతానికి పైగా పెరిగిపోవడం కూడా ఇందుకు కొంత కారణం. ముడి పామాయిల్‌ను కేవలం ఆహార పదార్థాల తయారీలోనే గాక సబ్బులు సౌందర్య సాధనాల తయారీలోనూ ఉపయోగిస్తారు. ఈ భారాలు కూడా నిస్సహాయులైన వినియోగ దారులపైకి కంపెనీలు బదలాయించాయి. బడా కంపెనీలకు లాభాలు కట్టబెట్టే తమ విధేయతను ఏ మాత్రం దాచిపెట్టుకోకుండా నిస్సిగ్గుగా ప్రదర్శించే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం కొన్ని అత్యవసర మందుల ధరలు యాభైశాతం పైగా అంటే సగానికి సగం పెంచుకోవడానికి అనుమతినిచ్చింది. ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వును ఇందుకోసం వినియోగించింది. ఆస్తమా, టిబి, తలసేమియా వంటి వ్యాధుల చికిత్సకూ అలాగే బ్యాక్టీరియా వ్యాప్తిని అరికట్టడానికి ఉపయోగించే యాంటీ బయాటిక్స్‌కూ ఇది వర్తిస్తుంది. ఈ విధంగా ధరలు పెంచుకోనివ్వకపోతే ఫార్మా కంపెనీలు లాభాలు రావడం లేదు గనక ఈ మందుల ఉత్పత్తి తమకు లాభదాయం కాదని మానేస్తారని వాదన చేసింది.

పెట్రోలియం ప్రహసనం



ఇదే సమయంలో పెట్రోలియం ఉత్పత్తులపైన హద్దూ అదుపు లేని విధంగా సుంకాలు విధించడం ద్వారా ప్రజలపై పడిన భారానికి అంతే లేదు. అంతర్జాతీయ మార్కెట్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ముడి చమురు ధర 18 శాతం పడిపోయినప్పటికీ మోడీ సర్కారు వాటి ధరలు తగ్గించకుండా అదే స్థాయిలో కొనసాగించింది. 2022-23లో వివిధ రకాల పన్నులు, సెస్సుల, సుంకాలు రాయల్టీల ద్వారా కేంద్రానికి 3.5 లక్షల కోట్ల రాబడి వచ్చిందంటే హడలి పోవలసిందే. 2014లో మోడీ ప్రభుత్వం ఇప్పటివరకూ ఒక్క పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల విధింపు ద్వారానే 26.74 లక్షల కోట్లు ఆదాయం పొందింది. కనీసం మనసం టూ లేకుండా విధించే ఈ భారం రవాణా ఖర్చులు పెంచేసి ఆహార ధాన్యాలు, కూరగాయల వంటి సరుకులపై అనేక రూపాల్లో ప్రభావం చూపిస్తాయి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ఆర్‌బిఐ బూటకాలు

ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ఆర్‌బిఐ చేసే ప్రయత్నాల గురించి ఎంతగానో దృష్టి కేంద్రీకరిస్తుంటారు. అయితే అదంతా బూటకంగానే కనిపిస్తుంది. 2016 మే నుంచి గడిచిన 102 నెలలో చూస్తే వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ నిర్దేశించుకున్న నాలుగు శాతం 28శాతం దాటిపోయిందని ఆర్థికవేత్తల ఒక అంచనా వెల్లడించింది. ఇకపై గరిష్ఠ పరిమితి ఆరు శాతంగా వుండాలని నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఆర్‌బిఐ 28 శాతం సందర్భాల్లో అందుకోలేకపోయింది. ద్రవ్యోల్బణం నియంత్రణ అంటూ కావాలని ఆర్‌బిఐ చేసే హడావుడి కార్పొరేట్ సంక్షేమం కోసం ఉద్దేశించింది తప్ప ప్రజల ప్రయోజనాలతో ముడిపడింది కాదని తేలింది. ఈ చర్యలు బ్యాంకుల వడ్డీ రేట్లతోనూ ఇతర ఆర్థిక విధాన బేహారులతోనూ ముడిపడి వుండటమే ఇందుకు కారణమవుతుంది. ఎన్నిసార్లు వాగ్దానాలు గుప్పిస్తున్నా-ధరల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వ విధానం ఈ విధంగా పూర్తిగా కుప్ప కూలి పోవడం-అనివార్య ఫలితమే. ఎందుకంటే ఈ విషయంలో నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే జరుగుతున్నది.

వనరులు పెంచుకోవడానికి పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు పెంచుకోవడం వంటి మోసపూరిత పథకాలకు దిగడంతో పాటు ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్ఠతపైన, విస్తరణపైన దృష్టి పెట్టి వుండాల్సింది. బహిరంగ మార్కెట్‌లో ధరల మంత్రజాలాన్ని అదుపు చేసేందుకు అది విరుగుడుగా పనిచేసి వుండేది. ప్రత్యేకించి కూరగాయలు (ఉల్లిపాయల వంటివి), ఆహారధాన్యాల (పప్పుధాన్యాలు తదితరాలు) వంటి అత్యవసర సరుకుల అక్రమ నిల్వదారులను చీకటి బజారు వ్యాపారాలను ఆట కట్టించేందుకు ఇప్పుడున్న చట్టాలను కఠినంగా అమలు చేయాల్సింది. ఒక విస్తృత పరిధిలో చూస్తే అత్యవసరమైన మందులను ప్రభుత్వ రంగంలో ఉత్పత్తి వేగ వంతం చేయ వలసి వుంటుంది. ధరలు విపరీతంగా పెరగడానికి కారణమైన విద్య వైద్య సేవల ప్రయివేటీకరణకు ముగింపు పలకాలి. వంటనూనెలు, పప్పు ధాన్యాలతో సహా ముఖ్యమైన వివిధ ఆహార పదార్థాల ఉత్పత్తి స్వయం సమృద్ధి సాధించే దిశలో ముందుకు సాగాలి. అంతేగాని గారడీలు, ఎన్నికల ఊకదంపుడు ప్రచారాలు మాత్రమే ధరలను తగ్గించలేవు. మరింత కార్యాచరణ అవసరం.

> ఇదే సమయంలో పెట్రోలియం ఉత్పత్తులపైన హద్దూ అదుపు లేని విధంగా సుంకాలు విధించడం ద్వారా ప్రజలపై పడిన భారానికి అంతే లేదు. అంతర్జాతీయ మార్కెట్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ముడి చమురు ధర 18 శాతం పడిపోయినప్పటికీ మోడీ సర్కారు వాటి ధరలు తగ్గించకుండా అదే స్థాయిలో కొనసాగించింది. 2022-23లో వివిధ రకాల పన్నులు, సెస్సుల, సుంకాలు రాయల్టీల ద్వారా కేంద్రానికి 3.5 లక్షల కోట్ల రాబడి వచ్చిందంటే హడలి పోవలసిందే. 2014లో మోడీ ప్రభుత్వం ఇప్పటివరకూ ఒక్క పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల విధింపు ద్వారానే 26.74 లక్షల కోట్లు ఆదాయం పొందింది. కనీసం మనసం టూ లేకుండా విధించే ఈ భారం రవాణా ఖర్చులు పెంచేసి ఆహార ధాన్యాలు, కూరగాయల వంటి సరుకులపై అనేక రూపాల్లో ప్రభావం చూపిస్తాయి.

(అక్టోబరు 29 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

గిరిజన హక్కులు కాపాడుకోవడం కోసం పోరాడాలి

- గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ శ్రీరాం నాయక్

నవతెలంగాణ-ఖమ్మం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కులకు ప్రమాదం పొంచి ఉన్నదని, గిరిజన సంఘం కార్యకర్తలు హక్కులు కాపాడుకోవడం కోసం చురుకైన పాత్ర పోషించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ శ్రీరాం నాయక్ కోరారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర స్థాయి కార్యకర్తల రాజకీయ శిక్షణా తరగతులు ఖమ్మం మంచికంటి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది కార్యకర్తలకు 'గిరిజన తెగలు, సంస్కృతీ సంప్రదాయాలు, దేశంలో గిరిజన పోరాటాలు' అంశంపై ఆయన బోధించారు. గిరిజన సంఘం పోరాట ఫలితంగా దేశంలో, రాష్ట్రంలో అనేక ఫలితాలు సాధించామన్నారు. భవిష్యత్తులో రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని కాపాడుకుంటూ, ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలకు గిరిజన సంఘం కృషి చేస్తుందని తెలిపారు. శిక్షణా తరగతులకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మానాయక్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించి సంఘం- నిర్మాణం అంశాన్ని బోధించారు. సంఘం కర్తవ్యాలను రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వాంకుడోత్ వీరన్న నాయక్, భూక్యా హరినాయక్ బాణోత్ వెంకన్న నాయక్, బాణోతు బాలాజీ, మూడు గన్యా, బాణోత్ బన్సీలాల్, బాదావత్ శ్రీనివాస్, భూక్యా కృష్ణానాయక్, భూక్యా నాగేశ్వరరావు, భూక్యా విజయ, అజ్మీర శోభన్ నాయక్, బాణోత్ హరిచంద్, తేజావత్ సీతారాములు, డుంగ్రోత్ శంకర్, బోడ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు...
ప్రజలు సహకరించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నందు ప్రజలు పాల్గొని వివరాలు అందించి సహకరించాలని, సర్వేలో వివరాలు తెలిపితే పథకాలు రద్దు అవుతాయని ఎటువంటి అపోహలు వద్దని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్పష్టం చేశారు. ఖమ్మంరూరల్ మండలంలోని పెద్దతండాలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పరిశీలన చేశారు.పెద్దతండలో వరద వల్ల నష్ట పోయిన బాధితులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నవంబర్ 6 నుంచి 8 వరకు హౌస్ లిస్టింగ్ పూర్తి చేసి ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించాలన్నారు. ప్రతి ఒక్క కుటుంబ వివరాలు సేకరించాలని ఆయన తెలిపారు. సర్వేకు సంబంధించి పక్కాగా షెడ్యూల్ రూపకల్పన చేయాలని, ఏ రోజు ఎక్కడ సర్వే చేపట్టేది ముందుగా సమాచారం ఇవ్వాలని, కావాల్సిన వివరాలు సిద్ధం చేసుకునేలా చూడాలని కలెక్టర్ అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వల్ల ప్రజలకు ఎటువంటి పథకాలు రద్దు చేయడం జరగదని, ప్రజల కోసం మరిన్ని సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికల రూపకల్పన కోసం మాత్రమే ఈ సర్వే చేపడుతున్నామని, ఎటువంటి అపోహలు లేకుండా ప్రజలు పూర్తి వివరాలు అధికారులకు అందించి సహకరించాలని కోరారు. అనంతరం వరదల్లో నష్టపోయిన బాధితులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమకు నష్టపరిహారం అందలేదని, పూర్తిగా నష్టపోయామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఖమ్మం జిల్లాలో దాదాపు 25 వేల కుటుంబాలకు పరిహారం అందించామని, పెద్దతండాలో సైతం 838 కుటుంబాలకు పరిహారం అందిందని తెలిపారు. పరిహారం అందని కుటుంబాలు దరఖాస్తు సమర్పిస్తే, తిరిగి అధికారులచే విచారించి అర్హులకు తప్పనిసరిగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏ ఒక్కరు పరిహారం విషయంలో ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామని కలెక్టర్ అన్నారు. జ్యోతి అనే మహిళ తన పశువులు, మేకలు వరదల వల్ల కొట్టుకొనిపోయాయని, వాటికి పరిహారం అందలేదని తెలియజేయగా, విచారించి పరిహారం అందేలా చూస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, ఖమ్మం రూరల్ ఎంపిడిఓ కుమార్, ఎన్యుమరేటర్ సాలెహ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగ భృతిని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటరమేష్

నవతెలంగాణ- ఖమ్మం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిని అమలు చేయాలనీ, రైల్వే రిక్రూట్ మెంట్‌లో రిటైర్ అయిన వారికి మరలా పోస్టులు ఇచ్చే నిర్ణయాన్ని బీజేపీ, రైల్వే బోర్డు ఉపసంహరించుకోవాలనీ డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ అధ్యక్షతన డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలకు నోచుకోవడం లేదని, ప్రధానంగా యువతకు నిరుద్యోగ భృతిని ఇస్తామని హామీ ఇచ్చి దాని గురించి ఆలోచించడం లేదని వారు ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, యంగ్ ఉమెన్ రాష్ట్ర కన్వీనర్ పఠాన్.రోష్ని ఖాన్, జిల్లా ఆఫీస్ బేరర్స్ చింతల రమేష్, శీలం.వీరబాబు, సత్తెనపల్లి నరేష్, భూక్యా ఉపేందర్ నాయక్, గుమ్మ ముత్తరావు, కూరపాటి శ్రీను, దిండు మంగపతి, బొడ్డు మధు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు కేటాయించాలని సీపీఎం సీనియర్ నాయకులు సిద్ధినేని కోటయ్య అన్నారు. మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలోని బీటీఆర్ భవన్‌లో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం మడిపల్లి వెంకన్న అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కోటయ్య మాట్లాడారు. తెల్దారుపల్లి గ్రామంలో నిరుపేదలు చాలామంది ఉన్నారని, అర్హులైన వారిని ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా, ఎటువంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని మంత్రి పొంగిలేటికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు, పెండ్యాల సుమతి, పగిడిపల్లి ఉపేందర్, జాలారు సంగయ్య, రంజాన్ పాషా, జక్కంపూడి కృష్ణ, వెన్ను రమేష్, మర్రి వాసు, టేకుమట్ల సీతమ్మ, బోళ్ల ఉష, సావిత్రి, సరస్వతి, అనసూయ, హర్యా నాయక్, నగేష్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రూపే కార్డులు దొంగిలించిన ఇద్దరిపై కేసు

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ సొసైటీ కార్యాలయంలో రూపే కార్డులను దొంగిలించి, రైతుల ఖాతాల నుండి నగదు నగదు డ్రా చేసి మోసానికి పాల్పడ్డ మల్లవరం గ్రామానికి చెందిన ఇద్దరిపై తల్లాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. 2018లో తల్లాడ సొసైటీ కార్యాలయంలో 719 మంది రైతుల రూపే కార్డులను మల్లవరం గ్రామానికి చెందిన దుగ్గిదేవర వెంకటకృష్ణారావు, బెల్లంకొండ చిన్న సైదులు ఎత్తుకెళ్లి వాటి ద్వారా 40.56 లక్షల నగదు డ్రా చేశారు. 2021లో బాధిత రైతులు ఫిర్యాదు మేరకు జిల్లా సహకార శాఖ అధికారులు విచారణ నిర్వహించారు, ఇద్దరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 4న సొసైటీ కార్యదర్శి నాగబాబు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై బి.కొండలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షనర్ల సమస్యలపై ఎస్టీవో ఎదుట ధర్నా

నవతెలంగాణ- నేలకొండపల్లి



పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక ఎస్టిఓ కార్యాలయం ఎదుట ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ పాలేరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ పాలేరు డివిజన్ అధ్యక్షులు ఏటుకూరి రామారావు మాట్లాడుతూ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా దశల వారి ఆందోళనలకు పిలుపునిచ్చిందన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ పెన్షనర్లకు సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే ప్రకటించాలని పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను పరిష్కరించాలని లేనియెడల ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ పాలేరు డివిజన్ ప్రధాన కార్యదర్శి చీట్ల భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు వల్లంచెట్ల భాస్కరరావు, జగన్మోహన్రావు, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, దాసరి స్వామినాథం, జనార్దన్‌రావు, కోదండ రామారావు, తోటరామయ్య పాల్గొన్నారు.

మధిర : తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మధిర డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మధిర ఎస్‌టిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఎస్‌టిఓకు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మీరా ఖాన్, ఎ.భాస్కరరావు, డి.మురహరిరావు, నాయకులు తాళ్లూరి ఆంజనేయులు, యం.ఆశీర్వాదం, లక్ష్మణరావు, సుబ్బరాజు, యం. కస్తూరిబాయి, వై.జ్యోతి, సూర్యనారాయణ, బాబూరావు, వెస్లీ, వెంకట్రావు, కృష్ణ రాణి, విమల కుమారి, ప్రకాశమ్మ, దేవమణి, ప్రభాకర్, పున్నారెడ్డి, సాంబశివరావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేసిన డీపీవో

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం డిపిఓ ఆశాలతా విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు మధ్యాహ్న భోజన పథకం అమలు గురించి ఎంపీఓ కొండపల్లి శ్రీదేవితో కలిసి పాఠశాలను సందర్శించి భోజనం చేశారు. పాఠశాల మొత్తం కలియతిరిగి అన్ని సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం మల్లవరం గ్రామపంచాయతీని సందర్శించి తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ గ్రామపంచాయతీ అభివృద్ధి ,పారిశుధ్య పనులపై గ్రామ ప్రజలకు నిత్యం అవగాహన కల్పించాలని కార్యదర్శిని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-సత్తుపల్లి

కిష్టారంలో ఐకేపీ ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. ఈ కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ దయానంద్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ధాన్యం పండించిన రైతులకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మడం ద్వారా క్వింటా ఒక్కింటికి రూ. 500 బోనస్ చెల్లించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, ఏఎంసీ డైరెక్టర్ వినుకొండ కృష్ణ, ఐకేపీ ఏపీఎం కేవీ సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారి వై. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

- లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో వ్యాయామానికి వచ్చిన వారికి ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 176 మందికి షుగర్, బిపి పరీక్షలు చేశారు. వారికి షుగర్, బీపీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్య విషయాలపై తీసుకోవల్సిన జాగ్రత్తలను, తగు సూచనలు చేశారు. ముఖ్యంగా వయస్సుపైబడిన వారు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. షుగర్ వ్యాధితో బాధపడేవారు సమయానికి మితంగా ఆహారం తీసుకోవాలని, వాడవలసిన మందులను తప్పనిసరిగా ఆయా సమయాలలో వాడాలని, బీపీ ఉన్నవారు ఎలాంటి ఆవేశాలకు లోను కావద్దని, ఎంతటి జఠిలమైన సమస్యలు ఎదురైనప్పటికీ తేలికగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ కోఆర్డినేటర్ పిసి రావు, లయన్ గోవర్ధనరావు, విశ్వేశ్వరరావు, పాయల నాగేశ్వరరావు, మర్రు వెంకన్న, వాకర్స్ క్లబ్ సభ్యులు దామోదరరెడ్డి, సాంబశివరావు, ఎస్‌కె సుభాని, ఏపీసి రావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు పాడి పశువుల పంపిణీకి చర్యలు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ- ముదిగొండ



ఇందిరా మహిళా డెయిరి ఏర్పాటులో భాగంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి పాడి పశువులను సంబంధిత కార్పొరేషన్ల ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్ ముజామిల్ ఖాన్ మండల కేంద్రమైన ముదిగొండలో పర్యటించి ఇందిరమ్మ మహిళా డెయిరి చిల్లింగ్ యూనిట్ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిల్లింగ్ యూనిట్ ఏర్పాటు చేసే స్థలం వెంటనే స్వాధీనంలోకి తీసుకొని ప్రహరీ గోడ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముదిగొండ మండల పరిధిలో చిల్లింగ్ యూనిట్ సంబంధించి 5 పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి పాల సేకరణ కేంద్రానికి కనీసం 10 మంది పాడిరైతులను ట్యాగ్ చేయాలన్నారు. పాడి పశువులను పంపిణీ చేసేందుకు మహిళా సంఘాల సభ్యులలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పాడి పశువుల అంశంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత కల్పించాలని, ప్రస్తుతం ఒకటి,రెండు పశువులు ఉన్న వారికి, మరో రెండు పాడి పశువులు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. పాడి పశువుల పంపిణీ కోసం లబ్ధిదారులను గుర్తించిన తర్వాత వారికి సంబంధిత కార్పొరేషన్ల (ఎస్సీ, బీసీ, ఎస్టీ) ద్వారా రుణం మంజూరు అయ్యేలా చూడాలన్నారు. అనంతరం ముదిగొండలో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. లైబ్రరీలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, ఎంతమంది పాఠకులు, ప్రతి రోజు గ్రంథాలయానికి వస్తున్నారు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువకులు హాజరవుతున్నారా, వారికి స్టడీ మెటీరియల్ అందించారా అనే వివరాలను లైబ్రరీయన్ శ్రీనివాసును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లైబ్రరీలో పుస్తకాల రిజిస్టర్, పుస్తకాల లెండింగ్ రిజిష్టర్లను పరిశీలించారు. గ్రంథాలయాన్ని ప్రతి రోజు తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రంథాలయ నిర్వహణ బాధ్యతలలో స్థానిక యువతను భాగస్వామ్యం చేయాలని, ముదిగొండలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఈ లైబ్రరీ వినియోగించుకునేలా చూడాలని, గ్రంథాలయం మరమ్మత్తుల కోసం అవసరమైన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, డిటీడబ్ల్యూఓ విజయలక్ష్మీ, మండల ఎంపీడీఓ శ్రీధర్ స్వామి, తహసీల్దార్ కె.సునీతఎలిజబెత్, లైబ్రేరియన్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ముదిగొండ



రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఏర్పాటు చేయాలని సిపిఐ(ఎం) జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలలో అఖిలపక్ష సభ్యులకు చోటు కల్పించాలని కోరుతూ సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మికి బుధవారం వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపిక, ఏకపక్షంగా చేస్తే ఉద్యమిస్తామన్నారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలలో గ్రామస్థాయిలో ఉన్న రాజకీయ పార్టీల వారికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హత ఉన్న ప్రతి పేదవాళ్లకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరులో అవకతవకలు జరిగితే ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు కందిమల్ల తిరుపతి, టిఎస్ కళ్యాణ్, వేల్పుల భద్రయ్య కోలేటి ఉపేందర్, అరుణ, మందరపు పద్మ, బట్టు రాజు, మంకెన దామోదర్, ఇరుకు నాగేశ్వరరావు, చింతకాయల రామారావు, సామినేని రామారావు, రాంబాబు, పంద్రకొల రాంబాబు, కొండమీది రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి



నవతెలంగాణ- రఘునాథపాలెం

మండల పరిధిలోని పరికల బోడు తండాకు చెందిన బానోత్ సురేష్ కుమార్తె కృషి కన్నా (2) జ్వరంతో బాధపడుతూ బుధవారం ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో మృతి చెందింది. రెండు రోజుల క్రితం కొత్తగూడెం వారి అమ్మమ్మ వారి ఇంటికి వెళ్లింది. అక్కడ అకస్మాత్తుగా జ్వరం వచ్చి వాంతులు చేసుకోవడంతో హుటాహుటిన కొత్తగూడెంలోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ పరిస్థితి విషమించటంతో వెంటనే ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటికే జ్వరంతో ఊపిరితిత్తులు నిమ్ము వచ్చి ప్లేట్ లెట్స్ పడిపోవడంతో చికిత్స పొందుతూ ఆ బాలిక మృతి చెందింది.

త్యాగాలు, పోరాటాల సమ్మిళతమే సీపీఐ

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని

నవతెలంగాణ- ఖమ్మం



త్యాగాలు, పోరాటాల సమ్మిళతమే సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. నిర్బంధాలతో మొదలై త్యాగాలు, పోరాటాలతో ఎదిగిందని తెలంగాణ వ్యాపితంగా లక్ష కుటుంబాలు కమ్యూనిస్టుపార్టీ నీడన ఉన్నాయని ఆయన అన్నారు. సిపిఐ ఖమ్మం జిల్లా కౌన్సిల్ సమావేశం బుధవారం పగడాల మల్లేష్ అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 26 నుండి జరుగనున్న వందేళ్ళ సంబురంలో పార్టీ విస్తరణే లక్ష్యంగా కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు వందేళ్ళ సంబుర కార్యక్రమాలను వివరించగా, జిల్లాలో జరిగిన పార్టీ కార్యక్రమాల నివేదికను జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సురేష్, రాష్ట్ర కంట్రోకమిషన్ ఛైర్మెన్ మహ్మద్ మౌలానా, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాలు

- నాగార్జునసాగర్ కాలువకు గండ్లు పడినా పూడ్చని అధికారులు
- మూడవ జోన్ నుండి నీరు విడుదల
- లబోదిబోమంటున్న రైతులు

నవతెలంగాణ-ఎర్రుపాలెం



ఇటీవల కురిసిన అతి భారీ వర్షాలకు వాగులు వంకలు పొరలి మైలవరం మేజర్ నుండి తెలంగాణ రాష్ట్రంలోని 35/5వ మైలురాయి వద్ద చప్టా కూలిపోయి నాగార్జునసాగర్ కాలువకు గండి పడ్డాయి. తుఫాను ప్రభావం వలన వరదలకు పడిన గండ్లను నేటికీ పూడ్చి వేయకుండా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ప్రవర్తించారని రైతులు విమర్శిస్తున్నారు. గత నాలుగు రోజుల నుండి మూడవ జోన్‌కి నాగార్జునసాగర్ జలాలను విడుదల చేయటంతో పూడ్చని గండ్ల నుండి కాలవల ద్వారా పారుతున్న నీరు పంట పొలాలోకి చేరి చేతికందిన పంట నీట మునిగి పోయిందని రైతులు లబోదిబోమని మొత్తుకుంటున్నారు. మండల పరిధిలోని జమలాపురం తదితర గ్రామాల రైతులకు సంబంధించిన సుమారు 100 ఎకరాల లోపు వరి పంట నీట మునిగిపోయిందని, వరి పంటతో పాటు పత్తి, మిర్చి తోటలు నీట మునిగి తేలియాడుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వలన పంట చేతికి వచ్చే తరుణంలో పంట పొలాలు నీట మునిగి పోవడం వలన అపార నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిద్ర నుండి మేల్కొని గండ్లను పూడ్చి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులుగా సత్యనారాయణ ఎన్నిక

నవతెలంగాణ-ముదిగొండ



సిపిఐ(ఎం) మండల కమిటీలోకి కో -ఆప్షన్ కోటా నుండి పెద్దమండవ గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు మాదారపు సత్యనారాయణను ఎన్నుకున్నట్లు సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.పార్టీ మండల 9వ మహాసభ గత నెల 18న అమ్మపేటలో జరిగిన విషయం విధితమే. 22 మందితో మండల నూతన కమిటీని ఎన్నుకోగా, కో-ఆప్షన్ కోట పూర్తి చేయలేదు. ఈనెల 6న ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో జరిగిన నూతన మండల కమిటీ తొలి సమావేశంలో మాదారపు సత్యనారాయణను ఎన్నుకున్నామని ఆయన పేర్కొన్నారు. దీంతో 23 మంది పార్టీ మండల కమిటీ సభ్యులుగా ఉన్నారు.

పార్టీ సేవలో దిట్ట సత్యనారాయణ

పెదమండవ గ్రామానికి చెందిన మాదారపు సత్యనారాయణ సిపిఐ(ఎం) అనుబంధ విద్యార్థి ప్రజా సంఘమైన ఎస్ఎఫ్ఐలో 1994లో సభ్యులుగా చేరి, విద్యార్థి సంఘం బలోపేతానికి ప్రధాన భూమికను పోషించి కీలకంగా పనిచేశారు. గ్రామంలో సిపిఐ(ఎం) అభివృద్ధికి కృషి చేస్తూ అంచలంచెలుగా ఎదిగి, నాడు పార్టీ డివిజన్ కమిటీ సభ్యులుగా, సిఐటియు పాలేరు డివిజన్ జనరల్ సెక్రటరీగా సత్యనారాయణ పనిచేశారు. ఆనాటి నుండి నేటి వరకు 30 సంవత్సరాలుగా సత్యనారాయణ పార్టీలో కొనసాగుతూ, సుదీర్ఘంగా, దిట్టగా పార్టీకి సేవలందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ తిరిగి సత్యనారాయణను సిపిఐ(ఎం) మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. పార్టీ మండల కమిటీ సభ్యులుగా ఎన్నికైన సత్యనారాయణను పెద్దమండవ గ్రామ శాఖ కార్యదర్శి మాదారపు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కందిమల్ల తిరుపతితోపాటు పలువురు శాఖ సభ్యులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
గురువారం | నవంబర్ 07, 2024 | www.navatelangana.com



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కోరం కనకయ్య
- ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కామేపల్లి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం వ్యవసాయ శాఖ, సహకార సొసైటీలు, ఐకెపిల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందులో భాగంగా కామేపల్లి మండలంలో సహకార సొసైటీలు ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ రైతు నష్టపోవద్దని ముందస్తుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో కొండాయి గూడెం సహకార సొసైటీ ఆధ్వర్యంలో కొమ్మినేపల్లి, కామేపల్లి సహకార సొసైటీ ఆధ్వర్యంలో కొత్తలింగాలలో, ఐకేపీ ఆధ్వర్యంలో మద్దులపల్లి, ఊటుకూరు తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, కొండయ్య గూడెం సహకార సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు, కామేపల్లి సహకార సొసైటీ చైర్మెన్ పుచ్చకాయల వీరభద్రం, తహసీల్దార్ సిహెచ్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఏఓ తారా దేవి వీరితోపాటు మండలంలోని అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.



గడ్డి ట్రాక్టర్‌కు నిప్పు..

నవతెలంగాణ సత్తుపల్లి రూరల్

కరెంట్ సర్వీస్ వైర్ తెగి గడ్డి ట్రాక్టర్ కి నిప్పు అంటుకున్న ఘటన సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకొంది. దమ్మపేట మండలం, నాచారం గ్రామానికి చెందిన ఓ రైతు ట్రాక్టర్‌పైన గడ్డి ఉండల లోడుతో, కాకర్లపల్లి గ్రామలోని ఓ రైతుకి, కిరాయికి తోలుకొచ్చారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో గ్రామంలోని మెయిన్ రోడ్డు నుంచి, లోపలకు వెళుతున్న క్రమంలో పక్కనే వున్న ఒక ఇంటి సర్వీస్ వైరుకు ట్రాక్టర్ పైనున్న గడ్డి తగిలి, ఆ వైర్ తెగి గడ్డి కట్టలపై పడింది. దానితో ఒక్కసారిగా గడ్డి లోనుంచి, మంటలు, పొగలు కమ్మడం జరిగింది. ఇది గమనించిన డ్రైవర్, కూలీలు, స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. స్థానికుల సమాచారం మేరకు స్థానిక విద్యుత్ సిబ్బంది పవర్ ఆపడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. అర్థం గంటలోనే సమాచారం తెలుసుకొన్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి, వెంటనే మంటలు ఆర్పేశారు. ఈ ఘటన లో ప్రాణాపాయం ఏమి జరగలేదు. ట్రాక్టర్ కు ఎటువంటి నష్టం జరగలేదు. గడ్డి మొత్తం పూర్తిగా కాలిపోయింది. నష్టం సుమారు 20 వేల నుంచి 25 వేల వరకు జరిగిందని ట్రాక్టర్ వెంట వున్నవారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిఎస్ఎఫ్ఓ ఎం.వేంకటేశ్వరరావు, డిఓపి వెంకటేశ్వరరావు, సిబ్బంది రాజేందర్, అశోక్, స్థానికులు ట్రాక్టర్ డ్రైవర్, కూలీలు తదితరులు వున్నారు.

పెద్ద బీరవల్లి ఈశాన్య రోడ్డుకు మరమ్మతు పనులు

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని పెద్దబీరవల్లి ఈశాన్య రోడ్డు మరమ్మతు పనులను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పెద్ద బీరవల్లి ఈశాన్య రోడ్డుకు పెద్దపెద్ద గుంతల పడి ప్రమాదకరంగా ఉంది. దీంతో పంచాయతీ కార్యదర్శి తలుపుల రాము జెసిబితో మరమ్మతు పనులు చేయించారు. పెద్ద పెద్ద గుంతలను జెసిబి ద్వారా పూడ్చి రాకపోకలకు అణువుగా రోడ్డును తయారు చేశారు. రోడ్డు మరమ్మతు పనులు చేయించిన పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ అభినందనలు తెలిపారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కల్లూరు



పట్టణ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్‌లో నివాసం ఉంటున్న సైకిల్ మెకానిక్ ఎడవెల్లి రాము కుమార్తె సరిత క్యాన్సర్‌తో బాధపడుతోంది. విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు లక్కినేని రమేష్ బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉబ్బన శ్రీను, ఉబ్బన ఈసుబాబు, ముత్తుమాల రాందాసు, దామాల రాజు, షేక్ అప్ రోజ్, కల్లూరు సిపిఐ నాయకులు దామాల దయాకర్, కల్లూరు పట్టణ బీసీ సంఘం అధ్యక్షులు బయ్యారపు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నర్సిరెడ్డికి నాయుడు కోటి శుభాకాంక్షలు



నవతెలంగాణ-వేంసూరు

టిటిడి పాలకమండలి సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన టిడిపి జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డికి వేంసూరుకు చెందిన తెలుగు యువత రాష్ట్ర నాయకుడు నాయుడు కోటి బుధవారం తిరుమలలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు తెలంగాణ నుండి తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా అవకాశం తగ్గటం తెలంగాణకు ఉపయోగకరంగా ఉంటుందని ఉన్నారు.

నేడు తల్లాడలో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-తల్లాడ

ఈనెల 7న మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి పర్యటిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాప సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుర్రవల్లి, రామానుజవరం, తల్లాడ సొసైటీ ఆఫీస్, పాత విశ్వ భారతి విద్యాలయం ఆవరణ పర్యటిస్తారని చెప్పారు. తెలగవరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు సకాలంలో హాజరై కార్యక్రమాలను, విజయవంతం చేయాలని కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఎర్రుపాలెం



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకరరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 8 మంది లబ్దిదారులకు మూడు లక్షల ఐదు వేల రూపాయల విలువ కలిగిన చెక్కులను పార్టీ మండల కార్యాలయం నందు అందించారు. ఈ సందర్భంగా లబ్ధి దారులు భట్టి విక్రమార్కుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, షేక్ ఇస్మాయిల్, పిచ్చిరెడ్డి, పిల్లి బోసుబాబు, దేవరకొండ శ్రీనివాసరావు, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, పసుపులేటి వెంకటనారాయణ, కృష్ణార్జునరాజు, వెంకటనరసయ్య, రాజేష్, షేక్ జానీబాషా, పుల్లారెడ్డి, వెంకటరత్నం, పాల్గొన్నారు.

8 పేజీలు.. 75 ప్రశ్నలు.. మరికొన్ని సబ్ ప్రశ్నలు..



ఫైల్

- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం
- 10 రోజులపాటు నిర్వహణ
- కుటుంబసభ్యులందరూ ఉండాల్సిన అవసరం లేదు

నవతెలంగాణ - బోనకల్

మరో రెండు రోజులలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కానున్నది. ప్రస్తుతం హౌస్ స్టిక్కరింగ్ ప్రక్రియ జరుగుతుంది. గత ప్రభుత్వం 2014 ఆగస్టు 19న ఒక్క రోజులో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కుటుంబీకులందరూ ప్రాంతాలకు చేరుకోగా పండుగ వాతావరణం కనిపించింది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బుధవారం నుంచి ప్రారంభమైంది. 10 రోజులపాటు కొనసాగనున్నది. అయితే ఈ సర్వేలో కుటుంబ సభ్యులందరూ ఉండాల్సిన అవసరం లేదు. కుటుంబానికి సంబంధించిన వారు ఎవరో ఒకరు వివరాలు చెబితే సరిపోతుంది. ఎన్యుమరేటర్లు ఆ వివరాలను నమోదు చేసుకుంటారు. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనకబడిన తరగతులు, ఇతర బలహీన వర్గాలవారి అభ్యున్నతి కోసం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగు పర్చడానికి తగిన ప్రణాళిక లు రూపొందించనున్నామని ప్రభుత్వం చెబుతోంది. ఇదే ఈ సర్వే ప్రధాన ఉద్దేశమంటోంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం సర్వే చేసినప్పుడు కూడా ఇటువంటి పలుకులే పలుకుంది. మరి ఆ సర్వే ఏమైంది, మరి ఈ సర్వే ఎందుకోసం అనేది చర్చనీయాంశంగ మారింది.

56 ప్రధాన, 19 అనుబంధ ప్రశ్నలు..

సర్వేను ప్రశ్నావళి రూపంలో నిర్వహిస్తారు. ఇందు కోసం 56 ప్రధాన, మరో 19 అనుబంధ ప్రశ్నలకు (మొత్తం 75) పార్ట్-1, పార్ట్- 2 కింద 8 పేజీల్లో సమాచారం సేకరిస్తారు. పార్ట్-1లో కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాల కింద సాధారణ, విద్య, ఉద్యోగ, ఉపాధి, భూములు, రిజర్వేషన్ ప్రయోజనాలు, రాజకీయ, వలసల సమాచారం అడుగుతారు. పార్ట్-2 కింద కుటుంబ వివరాలు సేకరిస్తారు.

ఇవి దగ్గర ఉంచుకోండి...

ఆధార్ కార్డు, రైతులైతే ధరణి పాస్ పుస్తకం, స్థిరాస్తి, చరాస్తి వివరాలు దగ్గర ఉంచుకుంటే ఎన్యుమరేటర్లకు సర్వే సులభమవుతుంది. లేకుంటే అందరి సమయం వృథా అవుతుంది. భూ వివరాలు సేకరించే క్రమంలో ధరణి పట్టాదారు పాసుపుస్తకం నంబర్, భూముల రకం, ఎకరాల సమాచారం చెప్పాల్సి ఉంటుంది. నీటి పారుదల వనరు,

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వివరాల సేకరణ

కౌలు భూమి సాగు చేస్తున్నట్లయితే సాగు విస్తీరణ వివరాలు నమోదు చేస్తారు. విద్య, ఉద్యోగ పరంగా రిజర్వేషన్ విధానంతో ప్రయోజనం పొందినా, గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ది పొందిన పథకాల వివరాలు నమోదు చేస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూ ఎస్. ధ్రువపత్రాలు పొందారా 7 డీనోటిఫై చేయబడిన సంచార, పాక్షిక సంచార తెగకు చెందిన సమాచారాన్ని అవును, కాదు రూపంలో సేకరిస్తారు. ప్రజాప్రతినిధిగా ప్రస్తుతం, పూర్వం ఏ పదవిలో ఉన్నారు. పదవీ కాలం, నామినేటెడ్ వివరాలు నమోదు చేస్తారు. ఈ ప్రశ్నావళి ప్రజాప్రతినిధులుగా పని చేసిన వారికే వర్తిస్తుంది.

ఏమేం తెలుసుకుంటారంటే..

సాధారణ వివరాల కింద కుటుంబ యజమాని, సభ్యుల పేర్లు, సంబంధం, మతం, సామాజికవర్గం, వయసు, మాత భాష, ఆధార్ కార్డు నంబర్ ఇస్తే ఇవ్వొచ్చు. మొబైల్ నంబర్, దివ్యాంగులైతే వైకల్యం, వైవాహిక స్థితి గురించి ఆరా తీస్తారు. విద్య వివరాల కింద పాఠశాలలో చేరిన నాటికి వయసు, విద్యార్హత. ఏ మాధ్యమంలో చదివారు, బడి మానేస్తే వివరాలు చెప్పాల్సి ఉంటుంది. ఇక, ఉద్యోగ, ఉపాధి వివరాలకు సంబంధించి ప్రస్తుతం చేసే పని, వత్తి, ఉద్యోగ, ఉపాధి సమాచారం, వార్షికాదాయం, ఒకవేళ వ్యాపారులైతే వార్షిక టర్నోవర్ చెప్పాలి. సంప్రదాయ కుల వృత్తులైతే ఆ వృత్తి కొనసాగిస్తున్నారా? ఆదాయ పన్ను చెల్లింపుదారులా? అవును/కాదు బ్యాంకు ఖాతా ఉంది, లేదు వంటి వివరాలు నమోదు చేసుకుంటారు.

వలసలకు కారణం.....

కుటుంబీకుల్లో ఎవరైనా ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వలస వెళ్తే ఆ వివరాలను కూడా నమోదు చేస్తారు. వలస వెళ్లడానికి కారణం పై ఆరా తీస్తారు. సర్వేలో కుటుంబీకుల ఫొటోలు తీయరు. ఎలాంటి పత్రాలు తీసుకోరు. అందరూ ఉండాల్సిన అవసరం లేదు. కుటుంబ యజమాని ఉండి, ఆయా వివరాలను చెబితే సరిపోతుంది. ఇచ్చిన సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారు.

ఆస్తులు, అప్పులు చెప్పాలి..

గత ఐదేళ్లలో తీసుకున్న రుణాలు, ఎందుకు తీసుకున్నారు. ఎక్కడి నుంచి పొందారు. ఏదైనా వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో పాల్గొంటే వివరాలు తీసుకుంటారు. పశు సంపద సంఖ్య సేక రిస్తారు.. స్థిరాస్తి, చరాస్తి వివరాలతోపాటు రేషన్ కార్డు నంబర్ (ఉంటే), నివాస గృహ విస్తీరం (చదరపు గజాల్లో), నివాస రకం, గదుల సంఖ్య తాగు నీటి వనరు, విద్యుత్ సదుపాయం, మరుగు దొడ్డి, వంట కోసం వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు. ఈ విధంగా ప్రభుత్వం ఇంటింటి సమగ్ర సర్వే పేరుతో కార్యక్రమాన్ని చేపట్టింది.

బోనకల్ -ఆళ్లపాడు రోడ్డుకు మహర్దశ



బోనకల్ - ఆళ్లపాడు రోడ్డు

- డబల్ రోడ్డుగా మార్పు - రూ. 15 కోట్లు మంజూరు
- నేడు డిప్యూటీ సీఎం శంకుస్థాపన

నవతెలంగాణ- బోనకల్

ఎట్టకేలకు బోనకల్ – ఆళ్లపాడు రోడ్డుకు మహర్దశ పట్టింది. ఈ రోడ్డును డబుల్ రోడ్డు గా మార్చుతూ ఆర్ అండ్ బి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డబుల్ రోడ్డు గా మార్చుట కోసం రూ.15 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ఆళ్లపాడు, రాయన్నపేట, మోటమర్రి, గోవిందాపురం(ఏ) గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆనాడు ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చుటకు ఆనాటి మధిర సీపీఐ(ఎం) ఎమ్మెల్యే కట్టా వెంకట నరసయ్య విశేషమైన కృషి చేశారు. బోనకల్ మండలంలో ఆనాడు అన్ని లింకు రహదారులు బీటీ రోడ్లుగా మారగా చివరగా బోనకల్ – ఆళ్లపాడు రోడ్డు మాత్రమే బీటీ రోడ్డుగా మారింది. కట్ట వెంకట నరసయ్య పట్టుబట్టి ఈ రోడ్డును బీటీ రోడ్డుగా వేయించారు. ఈ రోడ్డు ఆనాడు బీటీ రోడ్డుగా మారడంతో ఆయా గ్రామాల ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ కట్ట వెంకట నరసయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. తాజాగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషితో బోనకల్ – ఆళ్లపాడు-రాయన్నపేట వరకు 9 కిలోమీటర్ల మేర డబల్ రోడ్డుగా మారనున్నది. దీంతో ఈ గ్రామాల ప్రజల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరనున్నది. ప్రధానంగా బోనకల్ – ఆళ్లపాడు రోడ్డు మండలంలో ఎంతో ప్రధానమైన లింకు రహదారి. ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చుతూ నిధులు మంజూరు చేయటం పట్ల ఆయా గ్రామాల ప్రజలు వర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు ఆర్అండ్‌బి అధికారులు తెలిపారు. ఇందుకోసం బోనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేగంగా శిలాపలక నిర్మాణాన్ని కూడా చేపట్టారు. గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారని టీపీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల ప్రజల డబల్ రోడ్డు కోరిక త్వరలోనే నెరవేరనున్నది.



శంకుస్థాపన శిలాఫలకం



రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభ సభలో రాయల నాగేశ్వరరావు


నవతెలంగాణ-ముదిగొండ

రైతుల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలో కమలాపురం, మేడేపల్లి, వనంవారి కిష్టాపురం, గోకినేపల్లి గ్రామాల్లో ఐకెపి, సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం రాయల లాంఛనీయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరంగల్ డిక్లరేషన్ ఏఐసిసి అధినేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేశామన్నారు. రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,సాంకేతిక లోపాల ఉంటే వాటిని సరిచేసి అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, మేడేపల్లి సొసైటీ చైర్మన్ సామినేని వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుపులేటి దేవేంద్రం, ఇలవల పుల్లారెడ్డి, తిగుళ్ల దేవేంద్రం, సొసైటీ డైరెక్టర్ వనం ప్రదీప్త, ముదిగొండ సొసైటీ సీఈవో కె.వెంకటరత్నం, ఐకెపి ఎపిఎం సిహెచ్ కల్పన, ఐకెపి సీసీలు,గ్రామ దీపికలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్దులపల్లిలో సీపీఐ(ఎం) మండల మహాసభ

- హాజరు కానున్న జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు
- జయప్రదం చేయండి : అంబటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ కామేపల్లి



సీపీఐ(ఎం) మండల 9వ మహాసభ ఈనెల 7న ఉదయం 10 గంటలకు మద్దులపల్లి గ్రామంలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల కార్యదర్శి అంబటి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మద్దులపల్లి గ్రామంలోని మేకల వీరన్న నగర్‌లో పార్టీ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు ముఖ్య అతిధులుగా పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, భూక్య వీరభద్రం, మాదినేని రమేష్, దుగ్గి కృష్ణ, మెరుగు సత్యనారాయణ, తదితరులు హాజరుకానున్నరాని తెలిపారు. ఈ మహా సభకు పార్టీ కార్యకర్తలు, సీనియర్ నేతలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

నవతెలంగాణ-కల్లూరు

తెలుగుదేశం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం సాయంత్రం నాలుగు గంటలకు డాక్టర్ రాధాకృష్ణమూర్తి హాస్పిటల్ ఎదురుగా ఉన్న స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా గోపాలరావు నివాసం వద్ద ఏర్పాటు చేసినట్లు పార్టీ మండల కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు తమ తమ సభ్యత్వాన్ని నమోదు చేయించుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా కోరారు.

అర్హత కలిగిన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

సీపీఐ(ఎం) మండల కార్యవర్గ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్

నవతెలంగాణ-ముదిగొండ

అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు వాసిరెడ్డి వరప్రసాద్ అన్నారు.ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో పార్టీ మండల కమిటీ సమావేశం నాయకులు మరికంటి వెంకన్న అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్యూబాపై అమెరికా దేశం విధించిన ఆర్థిక, వాణిజ్య, ద్రవ్య ఆంక్షలకు స్వస్తి చెప్పాలన్నారు. చిన్న దేశాలపై అమెరిక వివక్షత చూపుతుందన్నారు. ప్రధానంగా ఉత్పత్తిరంగంపై అమెరికా విధిస్తున్న ఆంక్షలు వల్ల ప్రపంచ ఆర్థిక వనరులు అందుబాటులోకి రాకుండా పోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ కులం, మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను పెంచుతున్నారన్నారు. భారతదేశాన్ని హిందూ రాజ్యాంగంగా మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోడీ యత్నిస్తున్నారన్నారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరిచి,ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీరం చేసి,ప్రజా సంపదను బిజెపి ప్రభుత్వము కార్పొరేట్ శక్తులకు అప్పనంగా ఇస్తుందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరిచి మాయమాటలతో రేవంత్ సర్కారు ప్రజలను పక్కదారి పట్టిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయటంలో వైఫల్యం చెందిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, హైడ్రా, మూసీనది ప్రక్షాళన పేరుతో రేవంత్ సర్కార్ సరికొత్త డ్రామాతో తెరలేపిందని, ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతు పండించిన పత్తి, ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే రైతులకు అండగా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని వాసిరెడ్డి వరప్రసాద్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్న ఇందిరమ్మ ఇండ్లను రాజకీయాలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇండ్లు ఇవ్వాలన్నారు. ఇండ్ల మంజూరులో



అవకతవకతలు జరిగితే పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు గ్రామాలలో పారదర్శకంగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, మండల నాయకులు టీఎస్ కళ్యాణ్, వేల్పుల భద్రయ్య, మంకెన దామోదర్, కోలేట్ ఉపేందర్, కోలేటి అరుణ, మందరపు పద్మ, కందిమల్ల తిరుపతి, పంద్రకొల రాంబాబు, మేడా నారాయణ, ఇరుకు నాగేశ్వరరావు, చెన్ను అంజయ్య, బట్టు రాజు, చింతకాయల రామారావు, నంబూరి వెంకటేశ్వరరావు, కొండమీద రఘుపతి, సామినేని రాంబాబు, సామినేని రామారావు, రాయల శ్రీనివాసరావు, పయ్యావుల ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



యడవల్లి చెరువులో చేప పిల్లలు విడుదల

నవతెలంగాణ-ముదిగొండ

రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేసిన 65 వేల చేప పిల్లలను మండల పరిధిలో యడవల్లి పోలినేని చెరువులో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం వదిలారు. చెరువులో చేప పిల్లలను మత్స్యకారులు జాగ్రత్తగా పెంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ మధిర నియోజకవర్గ బి బ్లాక్ అధ్యక్షులు కందిమల్ల వీరబాబు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చెరుకుపల్లి రాంబాబు, మత్స్య సొసైటీ అధ్యక్షులు బొల్లిబోయిన సతీష్, ఉపాధ్యక్షులు ఐతనబోయిన పుల్లయ్య, కార్యదర్శి బి శ్రీను, డైరెక్టర్లు శ్రీకాంత్, పాపయ్య, శ్రీను, వెంకటేష్, సాయి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేలో కులం దగ్గర దూదేకుల ముస్లిం అని రాయించాలి

దూదేకుల ముస్లీంలకు సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు షేక్ హిమామ్ సూచన

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



కుల గణన సర్వేలో దూదేకుల ముస్లింలు కులం ఆప్షన్ దగ్గర దూదేకుల అని రాయించాలని దూదేకుల ముస్లిం సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు షేక్ హిమామ్ బుధవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈనెల నవంబర్ 6 నుండి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే పేరు తోటి కుల గణన సర్వే చేస్తుందని చెప్పారు. ఈ సర్వేలో అధికారులు మధ్యాహ్నం నుండి మీ ఇండ్లకు వస్తారు. ఇంటికి స్టిక్కర్ కూడా వేస్తారు. స్టిక్కర్ వేసినారు అంటే మీ ఇంటికి వస్తున్నామని అర్థం. అది అర్థం చేసుకొని సర్వే అధికారులు వచ్చేముందు ఎటు వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉండి సర్వేలో కులగణనలో కుటుంబాలన్నీ పాల్గొనాలని చెప్పారు. కుల గణనలో కులం దగ్గర ఏమి రాయించాలి, మతం దగ్గర ఏమి రాయించాలి అలాగే మాతృభాష దగ్గర ఏమి రాయించాలి, గ్రూపు దగ్గర ఏమి రాయించాలనే చాలామంది సందేహాల్ని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. దానికి సమాధానంగా పత్రికా ముఖంగా మీకు ప్రకటన ద్వారా తెలియజేస్తున్నానని చెప్పారు. కులం దగ్గర దూదేకుల ముస్లిం అని రాయించాలని చెప్పారు. మతం దగ్గర ఇండియన్ ముస్లిం అని రాయించాలి లేదా ఇస్లాం మతం అని అయినా రాయించవచ్చు అలాగే గ్రూపు దగ్గరకు వచ్చేసి బీసీ బి అని రాయించాలన్నారు. ఎందుకంటే చట్టప్రకారం మనం బీసీ బీ లోనే ఉన్నామని పేర్కొన్నారు. తరువాత మాతృభాష వచ్చి ఉర్దూ భాష అని రాయించాలని తెలిపారు. ఈ నాలుగు అంశాలను జాగ్రత్తగా సర్వే అధికారులు వచ్చినప్పుడు రాయించుకోవాలన్నారు. అలాగే మీ ఆధార్ కార్డులలో రేషన్ కార్డులలో పిల్లల చదువుకునే సర్టిఫికెట్లలో పేర్లు ఎలా ఉన్నాయో అలాగే స్పెల్లింగ్ మిస్టేక్ లేకుండా పేర్లు రాయించుకోవాలన్నారు. ఇప్పుడు గనక మనం కులం కాలంలో జాగ్రత్తగా పేరు దూదేకుల ముస్లిం అని రాయించుకుంటే మన కుల జనాభా ఎంతో బయటపడుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మనకు రావాల్సిన రిజర్వేషన్లు, నామినేటెడ్ పదవులు జనాభా దామాషా ప్రకారం మనకు వస్తాయన్నారు.

పుస్తకముద్రల టెండర్‌లకు ఆహ్వానం

- ఐటీడీఏ పీఓ బీ.రాహుల్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో గల గిరిజన ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసించు విద్యార్థులకు మూడవ తరగతి నుండి 5వ తరగతి వరకు సుమారుగా 5,611 మంది విద్యార్థులకు 12, 06,224 పేజీలను పుస్తక రూపంలో వర్క్ బుక్స్ ముద్రించి సరఫరా చేయుటకుగాను భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో గల ప్రింటింగ్ ప్రెస్ దారుల నుండి స్వల్పకాలిక టెండర్లు దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ప్రింటింగ్ ప్రెస్ దారులు షార్ట్ టెండర్ ఫారాలను డిడిటిడబ్ల్యూ కార్యాలయం ఐటీడీఏ భద్రాచలం నుండి తగిన రుసుము డిడి రూపంలో చెల్లించి పొందాలని సూచించారు. ఈ టెండర్ పారాములను ఈనెల 12వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు సమర్పించాలని, 13వ తేదీ నాడు ఉదయం 11 గంటలకు ఐటీడీఏ భద్రాచలంలో టెండర్ ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9701315526, 9182861609 లను సంప్రదించాలని తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

నవతెలంగాణ-బూర్గంపాడు

యువతి అదృశ్యంపై బుధవారం బూర్గంపాడు పోలీ స్టేషన్‌లో కేసు నమోదైంది. బూర్గంపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బూర్గంపాడు మండల పరిదిలోని టేకులచెరువు గ్రామానికి చెందిన నాగ మణి(22) అనే యువతి టైలరింగ్ చేసుకుంటూ ఇంటి వద్దనే ఉంటుంది. ఈనెల 3వ తేదీన సాయంత్రం బట్టలు కొనుగోలు చేసేందుకు లక్ష్మీపురం గ్రామానికి వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరినట్లు తెలిపారు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల దగ్గర ఆరా తీసిన జాడ తెలియ రాలేదు. దీంతో యువతి తల్లి మంగమ్మ పిర్యాదు మేరకు బుధవారం ఎస్ఐ ఇ.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఎస్‌డబ్ల్యూఎఫ్

రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల రాక

- ఇల్లందు డిపోలో పర్యటన

నవతెలంగాణ-ఇల్లందు

కార్మికులు, ఉద్యోగుల, బస్సు డిపో సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, విఎస్.రావులు ఇల్లందుకు రానున్నట్లు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) బస్ డిపో కార్యదర్శి జేయూ చారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఏలూరి భవన్, సిఐటియు కార్యాలయంలో సాయంత్రం 3:00 గంటలకు డిపో కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్యూటీలో లేని ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే

- జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి



నవతెలంగాణ-చంద్రుగొండ

ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్రకుటుంబ ఇంటింటి సర్వేను పకడ్బందీ చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి మండల అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక సర్వే బృందంతో కలిసి ఇంటింటి స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో తప్పులు దొర్లకుండా ఎన్యుమరేటర్లు జాగ్రత్తగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటిని సర్వే చేయాలన్నారు. ఇంటి నెంబర్లు లేకపోయినా సర్వే చేయటం జరుగుతుందన్నారు. అధికారులు బాధ్యతతో సర్వేను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ ఖాన్, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, సెక్రటరీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన సమాచారాన్ని తెలియజేయాలి

- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రారంభించిన కలెక్టర్ జితేష్ వీ.పాటిల్

నవతెలంగాణ-కొత్తగూడెం

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ప్రజలు ఖచ్చితమైన సమాచారాన్ని తెలియజేయాలని కలెక్టర్ జితేష్ వీ.పాటిల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను జిల్లాలో కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎమ్యునరేటర్ సేకరిస్తున్న వివరాలను పరిశీలించారు. అనంతరం సర్వే చేసిన ఇంటికి స్టికర్‌ను అంటించారు. అనంతరం సర్వేలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చేపట్టవలసిన చర్యలపై ఎమ్యునరేటర్‌కు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైందన్నారు. జిల్లాలో మొత్తం 2761 ఏమ్యూనరేషన్ బ్లాక్‌లు ఉన్నాయని, అన్ని బ్లాక్‌లకు ఎన్యూమరేటర్లను నియమించామన్నారు. ఒక్కో ఎన్యూమనరేటర్‌కి 150 గృహాలను కేటాయించామని తెలిపారు. రానున్న మూడు రోజులు ఇంటి గుర్తింపు కార్యక్రమం చేపడతామని, గుర్తింపు చేసిన గృహాలకు స్టిక్కర్లు అందించడం జరుగుతుందని తెలిపారు. సర్వేలో భాగంగా ప్రజలు ఖచ్చితమైన సమాచారాన్ని తెలియజేయాలని దాని ద్వారా రాష్ట్రంలోని షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు వెనుకబడిన తరగతులు, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కొరకై వివిధ సామాజిక, ఆర్థిక



విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరచడానికి తగిన ప్రణాళికలు తయారు చేయడం, వాటిని అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దీనిలో భాగంగా ప్రతి ఎన్యూమనరేటర్ ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో ఎంతమంది ఉంటారు..?, వారి యొక్క ఆదాయ వివరాలు...?, ఎవరైనా విదేశాలలో ఉన్నారా...? ప్రజా ప్రతినిధులుగా ఎవరైనా ఉన్నారా...?, వారి యొక్క ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు వివరాలు వంటి 75 ప్రశ్నలకు వివరాలు సేకరిస్తున్నారన్నారు. ప్రజలు అందరూ ఇంటింటి సర్వేలో పాల్గొనాలని సూచించారు. సర్వేలో భాగంగా ఫారం నింపే సమయంలో ప్రజలు ఆధార్ కార్డు, రేషన్ కార్డ్ వంటి పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన స్వామి, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు సరైన పద్ధతిలో భద్రపరచాలి

జిల్లా గ్రంధాలయాన్ని పరిశీలించిన కలెక్టర్

విలువైన గ్రంధాలు, మంచి పుస్తకాలను కాపాడుకోవాలని, వాటిని సరైన పద్దతిలో భద్రపరచాలని జిల్లా కలెక్టర్ గ్రంధాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, గ్రంథాలయంలో పుస్తకాలు చదువుకోవటానికి గాను శాశ్వత సభ్యత్వం ఎంత, విద్యార్థులకు ఇచ్చే పుస్తకాలను రిజిస్టర్ మైంటైన్ చేస్తున్నారా...? లేదా తదితర వివరాలను గ్రంథాలయ అధికారిని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో స్టోర్ రూమ్‌లోని పుస్తకాలను పరిశీలించారు. స్టోర్ రూమ్ కురుస్తుందా...? మరుగుదొడ్లు, ఫ్యాన్లు లైట్లు ఇతర సౌకర్యాలు ఉన్నాయా...? అని ఆరా తీశారు. పుస్తకాలకు ఇన్ వర్డ్ నెంబర్ ఉన్నదా లేదా అని తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయంలో ఎంతో విలువైన, పురాతనమైన పుస్తకాలు ఉన్నాయని, వాటిని సరైన పద్ధతిలో భద్రపరచాలని సూచించారు. గ్రంథాలయంలో పుస్తకాలు భద్రపరచడానికి గాను గోడకి అలమారాలు ఏర్పాటు చేయాలని, పుస్తకాలు శుభ్రపరచడానికి వ్యాక్యూమ్ క్లీనర్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొత్తగూడెం తెలంగాణ భవన్ ప్రక్కన నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పుస్తకాలు చదివేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రంథాలయంలో పుస్తకాలను పోటీ పరీక్షలు, గ్రంథాలు, నవలలు తదితర వాటిని విభజించి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన గ్రంథాలయంలో మిషన్ భగీరథ అధికారుల ద్వారా పైప్ లైన్ ఏర్పాటు చేసి సంపు ద్వారా తాగునీటి ట్యాంకును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సుదూరం నుండి విద్యార్థులు చదువుకోవడానికి గ్రంథాలయానికి వస్తారని, మహిళా సంఘాల ద్వారా వారికి అందుబాటులో రూ.20లకే భోజనం క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రంథాలయ వార్షికోత్సవల సందర్భంగా విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున గ్రంథాలయాలకు వచ్చి మన పురాతన గ్రంథాలను, పుస్తకాలను చదివి వాటి యొక్క ప్రాముఖ్యతను అందరికీ తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన స్వామి, జిల్లా గ్రంథాలయ అధికారి ఎం.నవీన్ కుమార్, లైబ్రేరియన్ జి.మణి మృదులా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

- భద్రాచలంలో ఇసుక ర్యాంపుని ప్రారంభించాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎంబీ. నర్సారెడ్డి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

కూలి దొరకక పస్తులు ఉంటున్న భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని, పట్టణంలో వెంటనే ఇసుక ర్యాంపుని ఏర్పాటు చేసి భవనిర్మాణ కార్మికులకు పని చూపించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎంబి.నర్సారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆ సంఘం నాయకులు నకరికంటి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన పట్టణ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన భద్రాచల పట్టణం మీద ఎవరికీ కూడా ఎటువంటి ప్రేమ లేని పరిస్థితుల్లో అభివృద్ధికి నోచుకోవటం లేదని విమర్శించారు. సుమారు 5000 మంది భవన నిర్మాణ కార్మికులు భద్రాచల పట్టణంలో నివాసం ఉంటున్నారు. వారికి ఏ విధమైన ఉపాధి లేక అనేక రాష్ట్రాలకి పట్టణాలకు వలసలు పోతున్నారు. దీనికి కారణం ప్రధానంగా అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని ఉన్నట్లు పక్కనే గోదావరి పారుతూ కావలసినంత ఇసుక మేట వేసి ఉన్న దాన్ని తీసుకొని భవనాలు నిర్మించుకోవడానికి వీలు లేనటువంటి పరిస్థితులు ఇక్కడ ఉన్నాయి. దీనికి కారణం భద్రాచల పట్టణంలో ఇసుక ర్యాంపు లేకపోవడం కారణం. దాని వలన అనేకమంది ఇతర మార్గాల ద్వారా ఎక్కువ రేటు చెల్లించి ఇసుక కొనుగోలు చేయటం అది కూడా ఎవరైనా పట్టుకుంటే ఫైన్‌లు కట్టడం దీనివలన ఇక్కడున్న కార్మికులకి పని దొరకటం లేదని, కనీసం రేపు రాబోయే కాలంలో ప్రభుత్వం మంజూరు చేస్తామని చెబుతున్న ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి కావలసిన ఇసుక లేనందున ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం ఈపరిస్థితి ఉన్నందున వెంటనే స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు ఎన్నికల ముందు చేసిన వాగ్దానానికి అనుగుణంగా ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వ అధికారులు రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని వెంటనే ఇసుక రాంపును ప్రారంభించి స్థానికులకు తక్కువ రేటుకు ఇసుకను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల భవన నిర్మాణ కార్మికులను, స్థానిక ప్రజలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు గడ్డం స్వామి, బండారు శరత్ బాబు, జి.లక్ష్మణ్, అప్పారీ రాము, డి.రామకృష్ణ, గుంజ చెన్నకేశవులు, గజ్జల రాజు, పిలకశివమ్మ, అజయ్ కుమార్, రాయల రాములు, శ్రీనివాస్, ఆది, పోసి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సమగ్ర సర్వే ప్రారంభం

- ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 ఇండ్ల కేటాయింపు
- 56 ప్రశ్నలు.. 75 అంశాలు
- సర్వేకు వచ్చిన అధికారులకు సహకరించండి
- పరిశీలించిన ఎమ్మెల్యే కోరం, మున్సిపల్ చైర్మెన్ డీవీ

నవతెలంగాణ-ఇల్లందు

రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర సర్వే కార్యక్రమం ఇల్లందులో బుధవారం ప్రారంభమైంది. మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు 10వ వార్డులో ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ఈ సర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేయగా ఆ మేరకు అంతా సిద్ధమైంది.
6, 7, 8 తేదీల్లో హౌస్ లిస్టింగ్ 9 నుంచి సర్వే ప్రారంభం కానుంది. కుటుంబ సర్వేలో ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 ఇండ్ల కేటాయించారు.
ప్రతిరోజూ పది ఇండ్ల సర్వే పూర్తికి కసరత్తు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ఇందులో 56 ప్రశ్నలు.. 75 అంశాలు ఉన్నాయి.
సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ప్రభుత్వం ఒక కుటుంబ యజమాని నుంచి 75 అంశాలకు సంబంధించి వివరాలు సేకరించేందుకు



ఫార్మాట్‌ను తయారు చేసింది. ఎమ్మెల్యే కోరం, చైర్మెన్ డివి మాట్లాడుతూ సర్వేకు వచ్చిన అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకు షావలి, ఆర్ఐ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ మండల కన్వీనర్ కమిటీ ఎన్నిక

- భద్రాచలం కన్వీనర్‌గా ఆకోజ్ సునీల్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

బీఆర్ఎస్ భద్రాచలం మండల కన్వీనర్ కమిటీని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు బుధవారం ప్రకటించారు. గత నెలలోనే అన్ని కమిటీలను రద్దు చేస్తూ రేగా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో భద్రాచలం కన్వీనర్‌గా ఎవరిని నియమిస్తారా అన్న ఉత్కంఠకు తెరదించుతూ బీఆర్ఎస్ భద్రాచలం కన్వీనర్‌గా ఆకోజ్ సునీల్‌ని, కో కన్వీనర్‌గా రేపాక పూర్ణచంద్రరావుని ప్రకటిస్తూ ప్రకటన విడుదల చేశారు. గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు సిపిఐ పట్టణ కార్యదర్శిగా పనిచేసిన సునీల్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. చిన్న వయసులోనే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన సునీల్ బీఆర్ఎస్‌లో చేరిన అతి కొద్ది కాలంలోనే కన్వీనర్‌గా ఎదగటం పట్ల పలు రాజకీయ ప్రముఖులు అభినందిస్తున్నారు.

నాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెడతా
బీఆర్ఎస్ మండల కమిటీ కన్వీనర్ సునీల్

బీఆర్ఎస్ భద్రాచలం కన్వీనర్‌గా ఎన్నుకున్నందుకు జిల్లా అధ్యక్షులు రేగకాంతరావుకి, పార్టీ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్‌కి, భద్రాచలం నియోజవర్గ సీనియర్ నాయకులు మాని రామకృష్ణ తుమ్మలపల్లి గణేష్‌రావు తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం నాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను. 6 గ్యారంటీల మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పాత కొత్త నాయకులను కలుపుకొని ప్రతిపక్ష పాత్రను పోషిస్తాం. భద్రాచలం పట్టణంలో నెలకొన్న సమస్యలపై స్థానిక ప్రజలను కార్యకర్తలను కలుపుకొని పోరాటాలకు వెళ్తాం.

కంప్యూటర్ శిక్షణ విద్యార్థులకు ఎంతో ఉపయోగం

- డీఐవీఓ వెంకటేశ్వర్లు

కొత్తగూడెం : విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులు నేర్చుకోవడం ఎంతో మేలుగా ఉంటుందని, అందులో కంప్యూటర్ శిక్షణ విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని కొత్తగూడెం నోడల్ ఆఫీసర్ డిఐవిఓ సిహెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సులలో భాగంగా అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం, వృత్తి విద్యా కోర్సులలోని విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు. 2నెలల "ఆన్ జాబ్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డిఐవిఓ సిహెచ్. వెంకటేశ్వర్లు మాట్లాడారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ కోర్సులో భాగంగా కొత్తగూడం పట్టణంలోని గ్లోబ్ సాఫ్ట్ కంప్యూటర్ ఇనిస్యూట్‌షన్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్నారని, విద్యార్థులు నేర్చుకుంటున్నా విద్యా మీ జీవితంలో ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ కత్తి రమేష్, కో-ఆర్డినేటర్ బి.శంకర్, కంప్యూటర్ సైన్స్ లెక్చరర్, సెంటర్ నిర్వహకులు ఎండి.సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలి

- ఎస్పీ రోహిత్ రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం

పోలీస్ అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు వహించాలని ఎస్పీ రోహిత్ రాజు కోరారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎస్పీ రోహిత్ రాజు ప్రారంభించారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. పోలీస్ శాఖలో భర్తీ అయినప్పుడు కఠినమైన శిక్షణతో, పూర్తి శారీరక సామర్థ్యంతో, ఆరోగ్యంగా శిక్షణా కేంద్రాల నుండి ప్రజలకు సేవలు అందించడానికి బయటకు రావడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత విధులలో చేరినప్పటి నుండి నిత్యం శాంతి భద్రతల పరిరక్షణతో పాటు, ప్రజలకు సేవలందిస్తూ పోలీసులు విశ్రాంతి లేని జీవితాన్ని గడపాల్సి వస్తుంది అన్నారు. చాలా సందర్భాల్లో నిద్రాహారాలు మాని విధులు నిర్వర్తించాల్సి వస్తుందని, అందుమూలంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు.



జిల్లాలో సబ్ డివిజన్ల వారీగా పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసిన కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులు అందరినీ జిల్లా ఎస్పీ అభినందించారు. నిత్యం ప్రజలకు వైద్య సేవలందిస్తూ, తాము అడగగానే పోలీస్ కుటుంబాలకు కూడా వైద్య చికిత్సలు చేయడానికి విచ్చేసిన వైద్య బృందానికి కూడా ఎస్పీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వైద్య వృత్తి కూడా చాలా బాధ్యతాయుతమైన వృత్తి అని కొనియాడారు. అనంతరం ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులందరినీ శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ వైద్యశిబిరంలో ఈసిజీ, గైనకాలజీ, బీపి, షుగర్, దంత సమస్యలు, కళ్ళ పరీక్షలు, ఆర్థోపెడిక్, యురాలజీ, ఫిజియోతెరపి, గుండె సంభంధిత పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎ.నాగరాజు, డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ కంబంపాటి రంగారావు, డాక్టర్ అయ్యప్ప రాజశేఖర్, డాక్టర్ జి.ప్రవీణ్, సీఐలు వెంకటేశ్వర్లు, కరుణాకర్, రమేష్, శివప్రసాద్, ఇంద్రశేనారెడ్డి, ఆర్ఐలు సుధాకర్, కృష్ణారావు, నరసింహారావు, లాల్ బాబు, ఇతర పోలీసులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


బస్సు డిపో సమస్యలు పరిష్కరించాలి



- కొత్త బస్సులు, మెకానిక్‌లను, డీజిల్ బంక్‌ను ఏర్పాటు చేయాలి
- మాస్ లైన్ రాష్ట నాయకురాలు చంద్ర అరుణ

నవతెలంగాణ-ఇల్లందు

ఏడాదికి పైగా బస్సు డిపో అనేక సమస్యలతో కునారిల్లుతోందని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని బుధవారం బస్సు డిపో వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఇల్లందు బస్ డిపోకు ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక వచ్చిన అరకొర బస్సులతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. డొక్కు బస్సులను రద్దుచేసి కొత్త బస్సులను డిపోకు కేటాయించాలన్నారు. నియోజకవర్గంలోని, రొంపేడ్, మిట్టపల్లి, ధర్మార తండా, మసివాకు మాణిక్యరం, చెట్టుపల్లి, మామిడిగూడెంకు, బస్సు కేటాయించాలన్నారు. టేకులపల్లి మండలంలోని బోడు, పాతర్లగడ్డ గ్రామానికి, బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. మండలంలోని రాఘబోయినగూడెం మోద్లగూడెం చీమలపాడు వరకు బస్సు లేక ప్రజలు నాన ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇల్లందు నుండి గుండాల మీదుగా పసర, ఇల్లందు నుండి నర్సంపేట వరంగల్ వరకు, మహిళలకు, ఇల్లందు నుండి హైదరాబాదుకు ఎక్స్ప్రెస్ బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. ఇల్లందు బస్సు డిపోని అభివృద్ధి చేయాలని, డీజిల్ బంకు ఏర్పాటు చేస్తూ బస్సు మెకానిక్‌లను కూడా కేటాయించాలన్నారు. ఈ ధర్నాలో పార్టీ జిల్లా నాయకులు బుర్ర వెంకన్న పిఓడబ్ల్యు మహిళా సంఘం కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, ఎదలపల్లి సావిత్రి, ఇల్లందు పట్టణ నాయకులు, శేషయ్య ఎస్కి రంజాన్, వేముల



గురునాథం, ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, బోళ్ల సీతారాములు, వెంకన్న పాండు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

- తహసీల్దార్ నాగ భవాని



నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలో సోషియో ఎకనామిక్ సర్వేకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ నాగ భవాని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎకనామిక్ సర్వేకు సంబంధించి హౌస్ లిస్టింగ్ (ఇండ్ల జాబితా తయారీ)ని ప్రారంభమైందని తెలిపారు. మండలంలోని మొత్తం కుటుంబాల 16,356 ఉన్నాయని, కుటుంబాలకు సంబంధించి, ఎన్యుమారటర్స్, 109 ఉద్యోగస్తులను కేటాయించినట్లు, సూపర్వైజర్‌లు 11 మంది, ఒక్కొక్క ఎన్యుమరేటర్‌కు 150 నుండి 200 కుటుంబాలు వస్తాయని తెలిపారు. ప్రతి 10 మంది ఎన్యుమారటర్లకు ఒక్క సూపర్వైజర్‌ను కేటాయించినట్టు తెలిపారు. సర్వే అధికారి ఐడెంటి కార్డు తో కుటుంబాలను సర్వే చేయాలన్నారు.

పోలీస్ జాగిలంతో మండలంలో తనిఖీలు


నవతెలంగాణ-టేకులపల్లి



ఎస్పీ ఉత్తర్వుల మేరకు మండలంలో మాదక ద్రవ్యాలను గుర్తించే పోలీస్ జాగిలంతో టేకులపల్లి మండలంలోని పాత గంజాయి నేరస్తులు, అనుమానితులఇళ్లల్లో, నిర్మానుష్య ప్రదేశాలలో సిఐ తాటిపాముల సురేష్, ఎస్ఐ పోగుల సురేష్ జాగిలం హ్యాండ్లర్ వెంకటేష్ బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. పోలీస్ తనిఖీలతో పాటు, స్థానికులు కూడా ముందుకు వచ్చి, గంజాయి వంటి డ్రగ్స్ సమాచారాన్ని పోలీస్‌కి అందిస్తే మరింత త్వరగా మత్తు రహిత సమాజాన్ని చేరుకోగలమన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలి

- ఇన్స్‌పెక్టర్ శివప్రసాద్



నవతెలంగాణ-కొత్తగూడెం

సీనియర్ సిటిజన్స్ ఎక్కువగా సైబర్ మోసగాళ్ల మోసాన బారినపడి ఆర్థికంగా నష్టపోతున్నారని, సైబర్ మోసాలపై సీనియర్ సిటిజన్స్ అవగాహన పెంచుకోవాలని కొత్తగూడెం త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ కోరారు. బుధవారం సైబర్ మోసాలను నివారించడంలో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్ ఆద్వర్యంలో ఏర్పాటు చేశారు. చుంచుపల్లిలోని కార్యాయలంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ టెక్నాలజీ పెరిగింది. నగదు బదిలీలు బ్యాంకింగ్ వ్యవహారాల కోసం ప్రతి ఒక్క వినియోగదారుడు కూడా ఇంటర్నెట్‌పై ఆధారపడుతున్నారు. ఇలాంటి తరుణంలో సీనియర్ సిటిజన్స్ సైబర్ మోసగాళ్ల బారినపడి ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. ఎవరు కూడా సైబర్ మోసగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని ఉద్దేశంతో సీనియర్ సిటిజన్స్ కోసం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మస్తాన్, సైబర్ వారియర్ మహిళా పోలీసు ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
8
గురువారం | నవంబర్ 07, 2024 | www.navatelangana.com

రూ. 1.87 కోట్ల విలువైన గంజాయి దహనం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

రూ.1.87 కోట్ల విలువ చేసే 750 కిలోల గంజాయిని బుధవారం దాహనం చేశారు. భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 34 కేసుల్లో పట్టుబడిన గంజాయిని ఎడబ్ల్యూఎం కన్సల్టింగ్ లిమిటెడ్ తల్లేడ మండలం గోపాల్‌పేట్ గ్రామంలో ప్రభుత్వ అనుమతి పొందిన దహన కేంద్రాంలో గంజాయిని దగ్ధం చేయించారు. గంజాయి దహనానికి ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. గంజాయిని దహనం చేసే సమయంలో ఖమ్మం డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి అసిస్టెంట్ కమిషనర్ గణేష్, భద్రాది కొత్తగూడెం ఎక్సైజ్ సూపరిండెంట్ జనాయ్య, భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ రహీమ్ ఉన్నీషా ఉన్నారు. గంజాయిని దగ్ధం చేయించిన సిబ్బందిని ఖమ్మం జిల్లా ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి అభినందించారు.

'చెకుముకి సైన్స్ సంబురాలను విజయవంతం చేయండి'

నవతెలంగాణ-కొత్తగూడెం

విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం కలిగించటానికి సృజనాత్మకతను పెంపొందించటానికి "చెకుముకి" పరీక్షలు దోహదం చేస్తాయని ఈ పరీక్షలను చెకుముకి సైన్స్ సంబురాలుగా పాఠశాల స్థాయిలోను, మండల స్థాయిలోను జిల్ల స్థాయిలోను, రాష్ట్ర స్థాయి లోను నిర్వహిస్తున్నామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు ఆర్.వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులు అడపాల కస్తూరి, కె.నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలు మన జిల్లాలో షుమారు 270 హైస్కూళ్లలో వివిధ ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్‌అన్ ఎయిడెడ్, అన్ని గురుకుల పాఠశాలల్లో అన్ని మండలాల్లో నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. సుమారు. 25000 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని జిల్లా అధ్యక్షకార్యదర్శులు కె.వీరభద్రం, యం.మోహనరావు తెలిపారు.

పరీక్షల వివరాలు

నవంబరు 7 న పాఠశాల స్థాయిలోను, నవంబరు 21న మండల స్థాయి లోను, నవంబరు 28న జిల్లా స్థాయిలోను, డిశంబరు 14,15,16 తేదీలలో రాష్ట్ర స్థాయి లో నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ కమీషనర్, జిల్లా విద్యాశాఖాధికారి అనుమతి పొందటం జరిగిందన్నారు. పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతుల నుండి ప్రథమ స్థానం సాధించిన ఒక్కొక్కరిని అనగా 8వతరగతి, 9వ తరగతి, 10వ తరగతి ఈ ముగ్గురితో ఒక టీమ్‌ను ఏర్పాటు చేసి ఆ టీమ్ మండల జిల్ల రాష్ట్ర స్థాయిలో సమైక్య కృషితో పాల్గొనే విధంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతి స్థాయిలోను అనగా మండల స్థాయి నుండి తగు యోగ్యతా పత్రములు బహుమతులు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి లోను, జిల్లా స్థాయి లోను జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు ఎందరో పాల్గొని విజయవంతం చేస్తారని తెలిపారు.

ఇంటింటి కుటుంబ సర్వేకు సహకరించండి

- ఎంపీడీవో రామకృష్ణ

నవతెలంగాణ-పినపాక

పినపాక మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, భూమి, రుణాలు, వ్యవసాయం, స్థిరాస్తి, రేషన్ సహా పలు అంశాలపై ఎన్యుమరేటర్లు వివరాలు సేకరించి కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం పినపాక మండలంలో ఉపాధ్యాయులతో పాటు సెక్రటరీలు వివిధ శాఖల అధికారులు ఇంటింటికీ తిరిగి వివరాలు నమోదు చేస్తున్నారు. 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక పరిశీలకుడిని నియమించగా, 10 శాతం కుటుంబాలను వీరు మరోసారి సర్వే చేస్తున్నారు.. ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకోవడం తో సర్వే ముమ్మరంగా కొనసాగుతున్నట్లుగా ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఈనెల 8 వరకు మూడు రోజులపాటు ఇండ్ల జాబితా నమోదు (హౌస్‌లిస్టింగ్) కార్యక్రమం చేపట్టనున్నారని . గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామం (ఆవాసం) పేర్లను కోడ్ రూపంలో సేకరిస్తారన్నారు. వార్డు నంబర్, ఇంటి నంబర్, వీధి పేరు కూడా హౌస్ లిస్టింగ్‌లో నమోదు చేసి ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటిస్తారని తెలిపారు.56 ప్రధాన ప్రశ్నలు, 19 అనుబంధ ప్రశ్నలు కలిపి మొత్తం 75 ప్రశ్నలకు సంబంధించిన సమాచారం సేకరిస్తారని పార్ట్-1, పార్ట్-2 కింద 8 పేజీల్లో ఆయా వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేస్తారని తెలిపారు. కాగా, ప్రతి ఒక్క కుటుంబ యజమాని ఎన్యుమరేటర్‌కు సరైన సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని కుటుంబ యజమాని ఎవరు?, ఆ ఇంట్లో ఉండే మొత్తం కుటుంబాలు ఎన్ని? అనే సమాచారం తెలియజేయాలన్నారు. ఈ సర్వేలో కిరాయిదారులు వారు ప్రస్తుతం ఉన్న ఇంట్లో కానీ, వారి స్వగ్రామంలో కానీ సర్వే చేయించుకోవచ్చన్నారు . ఉపాధి కొరకు వేరే ప్రాంతాల్లో ఉంటే నమ్మకస్తులు లేదా బంధువుల ద్వారా కుటుంబ వివరాలు ఎన్యుమరేటర్‌కు తెలపాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సమ్మయ్య, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీవో వీరభద్ర స్వామి, ఏపీఎం జ్యోతి, ఉపాధ్యాయులు, సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

రైతులు తమ పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి, సన్న రకం ధాన్యానికి రూ 500 ల బోనస్ పొందాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డిసిఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సభ్యులు, వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖా అధికారులతో అవగహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇస్తుందని, బోనస్ పొందాలంటే రైతులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. అన్ని శాఖల అధికారులు మేలైన ధాన్యానికి పొందుపరిచిన ప్రభుత్వ నిబంధనలను రైతులకు వివరించాలన్నారు. పాల్వంచ సొసైటీ ద్వారా రైతులకు మండల పరిధి ప్రభాత్ నగర్ (రెడ్డిగూడెం), కారెగట్టు, సోములగూడెం, సంగం, మున్సిపాలిటీ పరిధిలోని పేటచెరువులలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మి, సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మెన్ కాంపెల్లి కనకేష్, సహాయ పౌరసరఫరాల అధికారి వర్ధరాజు, వ్యవసాయ శాఖాధికారి శంభో శంకర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, సొసైటీ డైరెక్టర్లు బుడగం రామ మోహన్ రావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, సామా జనార్దన్ రెడ్డి, జరబన సీతారాంబాబు, యర్రంశెట్టి మధుసూదన్ రావు, మైనేని వెంకటేశ్వరరావు, నిమ్మల సువర్ణ, భూక్యా కిషన్, వ్యవసాయ శాఖ ఏ ఈ ఓ లు అనురిక, సుజాత, శాంతి, సొసైటీ సీఈఓ లక్ష్మీనారాయణ, కొనుగోలు కేంద్రాల ఇంచార్జులు, తదితరులు పాల్గొన్నారు.

సున్నం భీమరాజుకు నివాళి

నవతెలంగాణ-మణుగూరు



సున్నం భీమరాజు బుధవారం అనారోగ్యంతో మరణించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు భీమరాజు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కోడిశాల రాములు, కార్యదర్శి వర్గ సభ్యులు దామల్ల లెనిన్ బాబు, సత్రపల్లి సాంబశివరావు, పిట్టల నాగమణి, సమితి సింగారం జనరల్ శాఖ, మహిళా శాఖ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల ద్వారానే ఇందిరమ్మ కమిటీలు ఎన్నుకోవాలి

- రైల్వే నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రమాదాల అరికట్టాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

నవతెలంగాణ-మణుగూరు



గ్రామ సభల ద్వారా ఇందిరమ్మ కమిటీలను ఎంపిక చేసి పారదర్శకంగా పేదలకు ఇల్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక శ్రామిక భవనంలో ఉప్పతల నరసింహారావు అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పారదర్శకంగా పార్టీలకతీతంగా ఇంద్రమ్మ కమిటీలు ఉంటాయని మంత్రులు అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇందిరమ్మ కమిటీలు నియామకం జరగడం లేదన్నారు. స్థానిక శాసనసభ్యుల కనుసనల్లోనే కమిటీలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దీని కారణంగా అసలైన లబ్దిదారులకు అన్యాయం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇల్లు లేని ఆదివాసీలు దళితులు ఇతర పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలన్నారు. మణుగూరు మండలంలో రైల్వే భూనిర్వాస్తులకు వెంటనే ప్యాకేజీ అందజేసి రైల్వే పనులు పూర్తి చేయాలన్నారు. మణుగూరు నుండి భద్రాద్రి పవర్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా చేసేందుకు నిర్మాణం జరుగుతున్న రైల్వే పనులను నత్త నడకన నడుస్తున్నాయని, వాటిని వేగంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు మార్గం ద్వారా బొగ్గు సరఫరా చేయడం కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రోజుకు 150 లారీలు నిరంతరాయంగా బొగ్గును సరఫరా చేయడం వలన రోడ్డు ధ్వంసం అయిందన్నారు. విపరీతమైన దుమ్ముతో ప్రయాణికులు, మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే రైల్వే మార్గం నిర్మించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఒకటి రెండు మినహా మిగతావి ప్రజలకు అందని ద్రాక్ష మిగిలాయని విమర్శించారు. రుణం ఇచ్చే సమయంలో లేని ఆంక్షలు రుణమాఫీ చేసేటప్పుడు ఎందుకని ప్రభుత్వంపై మండిపడ్డారు. దానిపై సమీక్షించాలని అధికారులను కోరారు. సంక్షేమ పథకాలను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్య, వైద్యం, తాగు సాగునీరు నీరు నిరుపేదలకు అందించకుండా యూటర్న్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే
సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు నిత్యం పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రతి కమ్యూనిస్టు నిత్యం అధ్యయనం చేయాలన్నారు. సమాజం పట్ల అవగాహన పెరగాలంటే అధ్యయనం ఒకటే ఆయుధం అని తెలిపారు. పినపాక నియోజకవర్గం కేంద్రం మణుగూరులో కార్మిక ప్రజల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి ఆదర్శంగా మణుగూరు కేంద్రంగా ఉద్యమాలు నిర్వహించాలన్నారు పారిశ్రామిక నియోజకవర్గమైన పినపాకలో కార్మిక పోరాటాలు ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కొడిశాల రాములు, దామల్ల లెనిన్ బాబు, సత్రపల్లి సాంబశివరావు, మడి నరసింహారావు, అల్లే సుధాకర్, పిట్టల నాగమణి, తోట పద్మ, పల్లపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ ఏర్పాటు చేయాలి

- కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌ని యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్స్‌గా అప్ గ్రేడ్ చేయాలి
- సీఎంను కోరిన మంత్రి తుమ్మల
- సానుకూలంగా స్పందించిన సీఎం
- ఎర్త్ సైన్సెస్‌కి సంబంధించి అదనపు డిపార్ట్ మెంట్ల ఏర్పాటుకు వినతి
- అన్ని వసతులతో అనుకూలంగా కొత్తగూడెం జిల్లా కేంద్రం
- విమానాశ్రయం నేషనల్, గ్రీన్ ఫీల్డ్ హైవేలతో అభివృద్ధి దిశగా కొత్తగూడెం

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెంలో ఇప్పటికే ఉన్న కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌ను అప్ గ్రేడ్ చేస్తూ యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో సిఎంను కలిసి పలు విషయాలు వివరించారు. వినతి పత్రం అందజేసిన విషయాల ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ కొత్తగూడెంలో అనేక ఇండస్ట్రీయల్ కంపెనీలు ఉన్నాయని, సింగరేణి కాలరీస్ కాలరీస్ సంస్థ ఉందని, అంతేకాకుండా టీఎస్ జెన్‌కో, నవ భారత్ వెంచర్స్, బయ్యారం మైన్స్, మైలారం కాపర్ మైన్స్, ఎన్ఎండిసీ లాంటివి పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే ఉన్న కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (కెఎస్ఎం, స్కూల్ ఆఫ్ మైన్స్)ని అప్ గ్రేడ్ చేస్తూ యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా చేయాలని ముఖ్యమంత్రిని తుమ్మల కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జిల్లా కేంద్రంగా కొత్తగూడెం ఉందని వివరించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నేషనల్ హైవేలతో రవాణా వ్యవస్థకు అనువైన ప్రాంతంగా ఉందన్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులందరికీ కొత్తగూడెం యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ ప్రయోజనకరంగా ఉంటుందని తుమ్మల వివరించారు. అన్ని వనరులు ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ని యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్స్‌గా అప్ గ్రేడ్ చేస్తే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని చెప్పారు. అప్ గ్రేడ్ చేసిన యూనివర్సిటీలో యూ.జి, మాస్టర్స్, పి.హెచ్.డి ప్రోగ్రాంలలో భూగర్భశాస్త్రం, ఎన్విరాన్ మెంటల్ సైన్స్, జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రీ లాంటి ప్రోగ్రాంలు అదనంగా చేర్చి, భూగర్భశాస్త్ర, ఖనిజ శాస్త్రం, ఎన్విరాన్ మెంటల్ సైన్స్, జియో కెమిస్ట్రీ, మరియు జియో ఫిజిక్స్‌లలో ప్రత్యేక విద్య, శిక్షణని అందించాలని కోరారు. ఈ విధంగా చేసినట్లయితే ఈ విషయాలలో భారతదేశంలోనే మొట్టమొదటి యూనివర్సిటీ అవుతుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ ద్వారా విద్యార్థులకు ఎర్త్ సైన్స్‌లో మంచి విద్యను అందించడంతో పాటు, ఆర్థికాభివృద్ధికి, నైపుణ్యాలను మెరుగుపరుచు కోవడానికి, పర్యావరణాన్ని కాపాడుకోవడంలో, ఇండస్ట్రీ, విద్య రెండిటిని సమన్వయం చేసుకుంటూ విద్యను అభ్యసించడానికి అవకాశం ఏర్పడుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌కు వివరించారు.



స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించిన పలు అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తు, కోరిన విధంగా త్వరలోనే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌ని యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా మారుస్తూ, దానికి సంబంధించిన అదనపు డిపార్ట్ మెంట్లను కూడా చేర్చడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



బీఆర్ఎస్ చర్ల నూతన కన్వీనర్, కో- కన్వీనర్లుగా తాతారావు, పవన్ కుమార్

నవతెలంగాణ-చర్ల

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు బుధవారం పార్టీ చర్ల మండల నూతన కన్వీనర్, కో కన్వీనర్లగా దొడ్డి తాతారావు, అయినవోలు పవన్ కుమార్‌లను నియమించారు. ఈ నియామకం పట్ల చర్ల మండల నాయకులు, కార్యకర్తలు జిల్లా పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా దొడ్డి తాతారావు, అయినవోలు పవన్ కుమార్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు ప్రతి గ్రామపంచాయతీలో కమిటీని ఏర్పాటు చేసి పార్టీ బలోపే తనికి కృషి చేస్తామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని పటిష్ట పరిచి కార్యకర్తలను సైనికులుగా తయారు చేస్తామన్నారు. పార్టీ నాయకులకు కార్యకర్తలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ నిరంతరం ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా పాటు పడతామని నూతనంగా నియమించబడిన చర్ల పార్టీ కన్వీనర్ కో కన్వీనర్లు తెలిపారు. మా మీద ఎంతో నమ్మకంతో పార్టీ బాధ్యతలు మాకు అప్పగించిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావుకి, భద్రాచలం డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్‌కి, మానె రామకృష్ణకి చర్ల మండల నాయకులకు, కార్యకర్తలకు వారు ధన్యవాదాలు తెలిపారు.

మహిళా ఉద్యోగులకు కౌన్సిలింగ్

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలోని కొత్తగూడెం ఏరియాలోని మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు కొత్తగూడెం ఏరియాలోని గనులలో, ఉపరితల గనిలో సర్ఫేస్ విభాగాలలో 16 డిజిగ్నేషన్స్‌లను ఎంచుకోవాలని ఎస్ఓటు జీఎం జీవి.కోటిరెడ్డి తెలిపారు. అలా ఎంచుకున్న డిజిగ్నేషన్‌కు శిక్షణ అందిస్తామని, శిక్షణ పొందిన తర్వాతే వారు ఎంచుకున్న సంబంధిత పనులకు పంపిస్తామని తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌లో కమిటీ సభ్యులుగా ఎస్.ఓ.టు జీఎం, డిజీఎం (పర్సనల్) బి.శివ కేశవరావు, డిజీఎం (ఐఈడి) ఎస్. యోహన్, మెడికల్ సూపరైంటెంట్ ఎం.పరశురాములు, సీనియర్ పిఓలు ఏం.మురళి, జి.సంఘమిత్ర, సంబంధిత కార్యాలయ సిబ్బంది, మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి

నవతెలంగాణ-టేకులపల్లి

ఈనెల 8న ఇల్లందులో జరిగే ఎక్సైజ్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో సేవాలాల్ సేన సమావేశం మండల అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎంఆర్‌పి రేట్లు అధిగమించి అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్న సిండికేట్, బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలన్నారు. గత నెల ఫిర్యాదు చేసినప్పటికి చర్యలు తీసుకోపోవడంతో ఇల్లందు ఎక్సైజ్ శాఖ కార్యాలయం ముట్టడి చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జర్పుల లాలు నాయక్, బోడ శేఖర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

- ఐటీడీఏ పీఓ బీ.రాహుల్
- ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరం విజయవంతం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని ఐటీడీఏ పీఓ బీ.రాహుల్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మారుతి నర్సింగ్ కాలేజ్ లయన్స్ క్లబ్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో ఎస్ఆర్ వాసవి అసోసియేషన్ యుఎస్ఏ పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రాబాద్ వారి సహకారంతో బుధవారం మారుతి నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమం అంధత్వ నివారణ కొరకు గిరిజన ప్రాంతంలో నిర్వహించబడుట అభినందనీయమని స్వచ్ఛంద సంస్థల సేవలను కొనియాడారు. అంధత్వ నివారణ కొరకు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ అన్ని చర్యలు చేపడుతుందని, ఈ కార్యక్రమానికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిధులుగా బి.రవిబాబు (డిసిహెచ్ఎస్), డా. యం. రామకృష్ణ (సూరిండెంట్ ఆఫ్ భద్రాచలం ఏరియా హాస్పిటల్), యస్.వెంకటపుల్లయ్య (మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్), డా. ఆర్. నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఆర్‌డీవో కె.దామోదర్‌రావు కంటి ఆపరేషన్లకు ఎంపికైన మొదటి బ్యాచ్ 40 మందిని పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రాబాద్‌కి తీసుకువెళు న్న వాహనమును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రోగ్రాం చైర్మెన్ డా.ఎస్-ఎల్.కాంతారావు మాట్లాడుతూ గిరిజన సంక్షేమం అంధత్వ నివారణ కొరకు జితేష్ వి.పాటిల్ జిల్లా కలెక్టర్ పూర్తి సహకారంతో ఈ కార్యక్రమమును నిర్వహించి విజయవంతం చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 1120 మందికి పరీక్షలు నిర్వహించి, 602 మందిని 15 బ్యాచ్లుగా కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి చూపు తక్కువ ఉన్న 320 మందికి కంటి అద్దాలు ఇచ్చేందుకు ఎంపిక చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించినట్లు, అలాగే శిబిరానికి వచ్చిన అందరికీ మధుమేహం, బిపి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఎస్ఆర్ వాసవి అసోసియేషన్ అధ్యక్షులు పందిరి శ్రీనివాసరావు ప్రెసిడెంట్ ఎలెక్ట్ రమేష్ బాపనపల్లి కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ రంగారావుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.రాజారెడ్డి, వై. సూర్యనారాయణ, చారుగుళ్ళ శ్రీనివాస్, బి.సుబ్బరాజు, ఎస్ఎన్వి రామారావు, డా.వి.కామేశ్వరరావు, బి. వెంకటరెడ్డి, డా.ఆర్. చైతన్య జి.సంజీవరావు, పుష్పగిరి కంటి ఆసుపత్రి రాజేష్, బి.రమణారెడ్డి, గోళ్ళ భూపతిరావు, కురిచేటి శ్రీనివాస్, దేసు వెంకట సుబ్బారావు, పల్లంటి దేశప్ప, ఆరుద్ర సత్యనారాయణ, తిరుపతిరావు, డా. భాను ప్రసాద్, సిహెచ్ రామలింగేశ్వరరావు, ఉమా శంకర్ నాయుడు, డా.స్వామి, బి.రంగారెడ్డి, మారుతి కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు జోహార్లు

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని వెంకటయ్య తండాలో ప్రజా ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు జోహార్లు న్యూడెమోక్రసీ నాయకులు బుధవారం తెలిపారు. అమరవీరుల స్థూపంపై ఐఎఫ్‌టియు టేకులపల్లి ఏరియా నాయకుడు దేగటి లాలయ్య జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్య హర్షా, ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి గుగులోత్ రామచందర్ మాట్లాడారు. ఎంతోమంది వీరులు అమరత్వం పొందిన నక్సలిజంకి మరణం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎట్టి నరసింహారావు, ఆంగోతు బాలు, గుగులోతు చంధ్య, ధరావత్ వెంకన్న, కానుగుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటండి

నవతెలంగాణ-చంద్రుగొండ



భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర నాయకులు తాళ్లూరి వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. బుధవారం తిప్పనపల్లి పంచాయతీలోని ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొక్కలు నాటడం అనేది మంచి అలవాటు అని, దానిని ప్రతి ఒక్కరు జీవన విధానంలో అలవాటుగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగులోత్ రమేష్, బిఆర్ఎస్ నాయకులు అల్లం గాంధి, సుంకర రామారావు, షేక్ అబ్జల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు తనిఖీ

- రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి
- అదనపు కలెక్టర్ డీ. వేణుగోపాల్

నవతెలంగాణ-దమ్మపేట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ బుధవారం దమ్మపేట మండలంలో పర్యటించారు. మండలంలోని నాచారం, గుండుగులపల్లి, దమ్మపేట గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, ధాన్యం కొనుగోలు సాఫీగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, గన్ని బ్యాగ్స్ కొరత లేకుండా అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. అనంతరం దమ్మపేట మండలం అల్లిపల్లి గ్రామంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్‌ను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ అధికారుల సమన్వయంతో రాష్ట్ర సరిహద్దుల ద్వారా వరి ధాన్యం అక్రమ రవాణా కాకుండా పటిష్టమైన బందోబస్తు చేపట్టాలని, విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని అధికారులను ఆదేశించారు. అదే విధంగా మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ సందర్శించి ఎన్యుమరేటర్‌లకు, సూపర్‌వైజర్‌లకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎం సివిల్ సప్లై బాబు, డిసిఓ ఖుర్షీద్, దమ్మపేట తహశీల్దార్ నరేష్, ఎఓ చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు చేపట్టిన జీఎం (పర్సనల్) కే.శ్రీనివాసరావు

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాలరీస్ సంస్థ జీఎం(సెక్యూరిటీ)గా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.శ్రీనివాస రావుని ఇటీవల యజమాన్యం జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయటం జరిగినది. ఈ నేపధ్యంలో జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి గా కె.శ్రీనివాస రావు బుధవారంన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భముగా పర్సనల్, ఇతర డిపార్ట్మెంట్ అధికారులు శ్రీనివాస రావుని ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కేటీసీలో వెలువడిన విషవాయువు

క్షణాలలో 16 మేకలు మృతి

- మనుషుల ప్రాణాలు పోయిన ఇంతేనా..?
- ప్రశ్నిస్తున్న లచ్చగూడెం గ్రామస్తులు
- మాకు ఎటువంటి సంబంధం లేదు అంటున్న సింగరేణి అధికారులు

నవతెలంగాణ -టేకులపల్లి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెం ఉపరితల గనిలో వెలువడే విషవాయువులతో బుధవారం 16 మేకలు మృతి చెందాయి. బాధితుల కథనం ప్రకారం పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని, ప్రాణాలు ఎప్పుడు గాల్లో కలిసి పోతాయో అర్థం కావడం లేదని, మండలంలోని లచ్చగూడెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు రవాణా జరిగే రహదారిపై చనిపోయిన మేకలతో ధర్నాకు దిగారు. సింగరేణి అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు మండి పడుతున్నారు. లచ్చగూడెం గ్రామానికి చెందిన జబ్బు వెంకటేశ్వర్లుకు చెందిన మేకలు, కాపరి ముసలయ్య సుమారు 30 మేకలతో ఉదయం ఓసిసి పరిసర ప్రాంతంలో మేతకు తీసుకెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఆ మేకల్లో 16 మేకలు కనిపించలేదు. వాటిని వెతుక్కుంటూ ఉండగా, ఓసీ పరిసర ప్రాంతంలో మృతి చెంది పడి ఉన్నాయి. ఓసీ నుంచి విష వాయువు వెలువడడంతో మృతి చెందాయని కాపరి వాపోయారు. వాటిని సేకరించి రోడ్డుపై పెట్టి లారీలను నిలుపుదల చేసి ఆందోళనకు దిగారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్ సింగరేణి అధికారులతో చర్చించారు. బేతంపూడి పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు లక్కినేని సురేందర్ రావు మేకల రైతుకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్, బోడు ఎస్సై పి.శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని బాధిత రైతులు అధికారులతో చర్చిస్తున్నారు.

మహిళా ఉద్యోగులకు ఉద్యోగ స్థానాలపై కౌన్సిలింగ్

నవతెలంగాణ-ఇల్లందు

స్థానిక వైసీఓఏ క్లబ్ నందు ఏరియాలో పనిచేస్తున్న మహిళ బదిలీ వర్కర్స్/ జనరల్ మజ్దూర్ అందరికీ సంస్థలోని మహిళా బదిలీ వర్కర్స్/ జనరల్ మజ్దూర్లకు ఎంపిక చేయబడ్డ 16 కేటగిరీల ఉద్యోగ స్థానాలపై కౌన్సిలింగ్ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఓటు జిఎం బొల్లం వెంకటేశ్వర్లు నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. మహిళ బదిలీ వర్కర్/జనరల్ మజ్దూర్‌లకు ఎంపిక చేయబడ్డ ఉద్యోగ స్థానాల పని స్వభావం, అర్హత ప్రమాణాలు, అనుభవం, తదితర అంశాలపై మహిళా ఉద్యోగులందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం గిరిధర్ రావు, డిజిఎం పర్సనల్ మోహన్ రావు, మెడికల్ సూపరింటెంట్ జి.వి నరసింహారావు, అధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

మొత్తం 16184 గృహాలు, 160 బ్లాక్‌లు

- మండల వ్యాప్తంగా ప్రారంభం అయిన సర్వే
- పర్యవేక్షించిన తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్

నవతెలంగాణ-అశ్వారావుపేట



తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఎన్యూమరేటర్ లకు తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ సూచించారు. బుధవారం ప్రారంభమైన సమగ్ర సర్వేను పట్టణంలోని వడ్డెర బజార్‌తో పాటు మండలంలోని పలు పంచాయతీలలో ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర సర్వే నిర్వహణకు మండల వ్యాప్తంగా ఉన్న 16184 గృహాలను 116 బ్లాకులుగా విభజించి 116 మందిగా ఎన్యూమరేటర్ లతో సమగ్ర సర్వే ప్రారంభించినట్లు వివరించారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 ఇళ్ళను సర్వేకు కేటాయించటం జరిగిందని, రోజుకి 15 ఇళ్ళు సర్వే చేసి ఈ నెలాఖరుకు పూర్తి సమాచారాన్ని సంభంధిత కార్యాలయంలో అందించాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ముందుగా ఈ నెల 6 నుండి 8 వరకు ఇళ్ళు గుర్తించి ఆ ఇళ్ళకు స్టిక్కర్‌లు అంటించిన తరువాత సర్వే ప్రారంభించటం జరుగుతుందని అందుకు ప్రజలు పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు.

భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపిన మోదుగు జోగారావు

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని మేదర్ బస్తీలో మాదిగ జేఏసి ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి మాదిగ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు జోగారావు హాజరై మాట్లాడుతూ.. దేశ సంపద, వనరులను ప్రజలందరికి అందాలని ఆకాంక్షించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. వారు భవిష్యత్ లో దేశ సంపదను, వనరులను దేశ ప్రజలందరికి అందే విధంగా కృషి చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీల వర్గీకరణను తెలంగాణ రాష్ట్రంలో త్వరగా అమలు జరిగేటట్లు కృషి చేసి, ఉప కులాల జీవితాలలో వెలుగులు నింపాలని కోరారు. ఈ సమావేశంలో టి.ప్రవీణ్, జి.కుమార్, ఎన్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ నాగయ్య

నవతెలంగాణ-పినపాక

పాఠశాలకు ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరుకావాలని లేని పక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవని మండల విద్యాధికారి నాగయ్య సూచించారు. బుధవారం రావిగూడెం ఎస్సీ, రావిగూడెం బీసీ, ఏడూళ్ళ బయ్యారం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను, విద్యార్థుల వర్క్ బుక్స్‌ని, పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

నవతెలంగాణ- టేకులపల్లి



ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల గంగారంలో జరిగిన టీపీటీఎఫ్ మండల కౌన్సిల్ సమావేశంలో మండల అధ్యక్షులుగా బి.రామరాజు, మండల ప్రధాన కార్యదర్శిగా పి.సమ్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా ఎం.మోహన రావు, ఎ.వీరన్న, పి.నాగేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా బి.మంగీలాల్, జి.నంద, పి.వెంకటేశ్వర్లు, జి.కుమారి, జిల్లా కౌన్సిలర్లుగా ఏ.రామ్మూర్తి, ఎం.ప్రశాంతి, వి.భాస్కరరావు, సిహెచ్.లక్ష్మయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.వెంకటరామయ్య సభ్యులుగా జి.రమేష్, బి.నరేష్‌లను ఎన్నుకున్నట్లు టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హరిలాల్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉపాధ్యాయ దర్శిని సంపాదకవర్గ సభ్యులు ఎం.రామాచారి, జి.హరిలాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.జగన్, బి.వాల్య, బుగ్గ వెంకటేశ్వర్లు, ఎర్రయ్య రామారావు, కస్నా నాయక్ వసంతరావు, వీరన్న, శ్రీనివాస్ రావు, సమ్మక్క, స్వామి, రవి వర్మ బిచ్చ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలి

- తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి

నవతెలంగాణ -బూర్గంపాడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేని మండలంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి లు బుధవారం ప్రారంభించారు. ఎమ్యునరేటర్ సేకరిస్తున్న వివరాలను పరిశీలించారు. అనంతరం సర్వే చేసిన ఇంటికి స్టికర్‌ను అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైందని వారు అన్నారు. మండలంలో మొత్తం 123 ఎమ్యూనరేషన్ బ్లాక్‌లు ఉన్నాయని, 123 మంది ఎన్యుమనేటర్లు 12 మంది సూపర్వైజర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని వారు పేర్కొ న్నారు. వారికి గ్రామపంచాయతీ కార్యదర్శులు సహకరిస్తారని ఒక్కో ఇమ్యునరేటర్‌కి 150 గృహాలను కేటాయించామన్నారు. రానున్న మూడు రోజులు ఇంటి గుర్తింపు కార్యక్రమం చేపడతామని, గుర్తింపు చేసిన గృహాలకు స్టిక్కర్లు అందించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సునీల్ కుమార్, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పట్ల ప్రభుత్వం మొద్దు నిద్ర

- గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జె.రమేష్
- భారీ ప్రదర్శన, కలెక్టరేట్ ఎదురుగా ధర్నా
- నవంబర్ 20 లోగా పరిష్కరించకపోతే సమ్మెకి సిద్ధం అవుతాం



గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఒక రోజు దీక్ష





నవతెలంగాణ -పాల్వంచ

రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 40 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, వదలకపోతే ఈ నెల 20 తర్వాత ఏ క్షణమైనా సమ్మెలోకి వెళ్తామని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జె.రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికుల పాలిట మరణ శాసనంలా ఉన్న మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని,ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని, కారోబార్, బిల్ కలెక్టర్‌లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికులకు పది లక్షల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధనకు గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ దగ్గర ధర్నా చౌక్ లో ఒక్క రోజు దీక్ష నిర్వహించి కలక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకులు తోకల నరేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఎ.జె.రమేష్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన నిరవధిక సమ్మె సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని,కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా,నిరవధిక సమ్మె సందర్భంగా కార్మికుల టెంట్ ల దగ్గరకు వచ్చి పై సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన హామీలు ఈ కాలంలో పరిష్కరించలేదని అన్నారు. ముఖ్యమంత్రి మొదలు మంత్రి సీతక్క, కమీషనర్ తదితరులకు గత 11 నెలల కాలంలో పదుల సంఖ్యలో కలిసి వినతి పత్రాలు ఇచ్చామని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో ఒక రోజు సమ్మె చేశామని, కలెక్టరేట్‌ల ముందు సుమారు ఆరు సార్లు ధర్నాలు చేశామని, చివరికి హైద్రాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేశామని అన్నారు. అయినప్పటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదని అన్నారు. మంత్రిని కలిసిన ప్రతి సందర్భంలో ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదని అన్నారు. కరోనా సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ప్రభుత్వంతో కీర్తించబడిన గ్రామ పంచాయతీ వర్కర్లకు పేరు మాత్రమే మిగిలిందని అన్నారు. ప్రతి పనికి గ్రామ పంచాయతీ కార్మికుడు అవసరమైన ప్రభుత్వానికి కార్మికుడి కుటుంబం, కనీస వేతనం, ప్రమాద బీమా తదితర సమస్యల పరిష్కారంలో తీవ్ర వివక్ష చూపుతున్నదని అన్నారు. ఇదే పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరిస్తే నవంబర్ 20 తర్వాత ఏ క్షణమైనా సమ్మె లోకి వెళ్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీక్ష అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి, కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ కార్య నిర్వహణ అధికారి రమాదేవి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కార్యనిర్వహణాధికారి రమణారావులకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీక్ష, ధర్నా కార్యక్రమానికి సీఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవి కుమార్, సహాయ కార్యదర్శులు కె.సత్య డి.వీరన్న, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, నిమ్మల మధు, నాయకులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, యాకుబ్, సురేష్, వెంకన్న, కళ్యాణ్, విజయ్, రుక్మందరావు, చెన్నకేశవవులు, మనోజ్ రెడ్డి, విజయలక్ష్మి, రేవతి, భవాని తదితరులు నాయకత్వం వహించారు.

ఎమ్మెల్యే జారే విస్తృత పర్యటన

- రూ.1 కోటి 35 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

నవతెలంగాణ-అశ్వారావుపేట



అశ్వారావుపేట మండలంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం విస్తృతంగా పర్యటించారు. రూ.1 కోటి 30 లక్షల 80 వేల నిధులతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. అశ్వారావుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు అనుసంధానంగా రూ. 24 లక్షల 50వేల వ్యయంతో నిర్మించనున్న శవ పంచనామా గది నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఊట్లపల్లి లో ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తేమ శాతం తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరగాలని సూచించారు. ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు రూ.500లు బోనస్ ఒక్కొక్క క్వింటాలకు అందిస్తుందని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. వినాయకపురంలో రూ.18 లక్షల 30 వేల వ్యయంతో నిర్మించే కల్వర్ట్, రూ.17 లక్షలతో నిర్మించే పంచాయతీ కార్యాలయం ప్రహరీ గోడ పనులకు శంకుస్థాపన చేశారు. తిరుమల కుంట పంచాయతీ పాకలగూడెంలో రూ.7 లక్షలతో అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేశారు. మొద్దులమడ లో గత వారం అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కాకా వీరయ్య కుటుంబాన్ని పరామర్శించి తాత్కాలిక ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందించారు. గుంటిమడుగులో రూ.15 లక్షల నిధులతో నూతనంగా నిర్మించే అంగన్వాడీ భవనానికి భూమి పూజ చేశారు. నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.18 లక్షలతో నిర్మించే భోజన శాల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. సూర్యం పేటలో గత పర్యటనలో ఇచ్చిన కరెంటు లైన్ ఏర్పాటు హామీ మేరకు నూతన విద్యుత్ లైన్ ప్రారంభోత్సవం చేశారు. దత్తత గ్రామం చెన్నాపురంలో అంగన్వాడీ కేంద్రం ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.6 లక్షలతో పనులు ప్రారంభించారు. కావడిగుండ్లలో నూతన అంగన్వాడీ భవనం నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులు కేటాయించి భూమి పూజ చేశారు. గోపన్న గూడెంలో రూ.15 లక్షల వ్యయంతో సిసి రోడ్లు రిటర్నింగ్ వాల్ పనుల ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ శ్రీధర్, ఎంఈఓ ప్రసాదరావు, ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి, ఆర్ఎంవో డాక్టర్ విజయ్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు చిన్నం శెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ సుంకవల్లి వీరభద్రరావు, చెన్నకేశవ రావు, జూపల్లి రమేష్, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విద్యకు అభినందనల వెల్లువ

- సన్మానించిన సీఐ రాజు వర్మ

నవతెలంగాణ-చర్ల



హైదరాబాదులో జరిగిన తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్స్ పోటీ అండర్ 16 విభాగంలో 80 మీటర్ల హర్డిల్స్ పోటీల్లో విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించిన మడకం శ్రీ విద్య దొరకు మండల వ్యాప్తంగా అభినందనలు వెలివిరిచాయి. మండల పరిధిలోని ఉయ్యాల మడుగు ఆదివాసీ గ్రామంలో మడకం శంకర్, అన్నపూర్ణల కుమార్తె అయిన శ్రీవిద్య ఆది నుండి క్రీడల పట్ల శ్రద్ధ చూపడం వల్ల నెలలో ఒడిస్సా రాజధాని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల చదువుతున్న విద్యార్థిని మడకం శ్రీవిద్యకు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. బుధవారం ఆమెను స్థానిక పోలీస్ స్టేషన్ లో జరిగిన కార్యక్రమంలో సిఐ రాజు వర్మ శాలువాతో సత్కరించి నగదు బహుమతిని అందజేశారు. ఐసీడీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిడిపిఓ చైతన్య, అంగన్వాడీ టీచర్లు శ్రీవిద్య కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేంద్ర, అధ్యాపకులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరేంద్ర మాట్లాడుతూ దేశ ప్రతిష్టను ప్రపంచ స్థాయిలో ఇనుమడింప చేయటానికి అథ్లెటిక్స్ క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. శ్రీవిద్య దినదినాభివృద్ధి చెందుతూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు సంపాదించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. శ్రీవిద్యలో దాగివున్న ప్రతిభను గుర్తించి వెలికి తీసిన కోచ్ గిరిప్రసాద్ ను అభినందించారు. వచ్చే నెలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో విజేతగా నిలిచి చర్ల మండలం కీర్తి పతాకాన్ని జాతీయ స్థాయిలో ఎగురువేయాలని ఆకాంక్షించారు. ప్రతిభ గల క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలన్నారు. పాఠశాలలో అటెండెన్స్ తగ్గించడంతోపాటు విద్యార్థులను పాస్ మార్కులు కూడా తగ్గిస్తే వారు క్రీడలపై దృష్టి సారించి అద్భుతాలను సృష్టిస్తారన్నారు. శ్రీ విద్య తమ కళాశాల విద్యార్థి కావడం మాకు ఎంతో గర్వకారణమన్నారు. మిగతా విద్యార్థుకు సైతం ఆమెను స్ఫూర్తిగా తీసుకొని విద్యతో పాటు క్రీడలలోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కొండలరావు, అమృత రావు, గంగరాజు, వీరభద్రం, శెట్టి ప్రసాద్, విజయ, దీప, విద్యార్థి తల్లిదండ్రులు శంకర్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిన మిషన్ భగీరథ కార్మికులు

నవతెలంగాణ-చర్ల



కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిర్వహిస్తున్న పోరాటాలకు ఆకర్షితులై మండలంలో మిషన్ భగీరథలో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు విష్ణు, నవీన్, నాగు సీఐటియులో చేరారు. ఈ ముగ్గురు కార్మికులకు సిఐటియు మండల కన్వీనర్ పాయం రాధా కుమారి, మండల నాయకులు పామర్ బాలాజీ మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ నాయకులు పృథ్వీ, కిషోర్, విద్యాసాగర్ సిఐటియు కండువా కప్పి సంఘం లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతన 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పని కేంద్రాలలో మెరుగైన రక్షణ సౌకర్యాలు కల్పించాలని ,పండగ బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందని పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కారం చేసుకోవాలని సూచించారు. ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల కోసం పోరాటం చేయటంలో రాష్ట్రంలో, దేశంలో సిఐటియు అగ్రస్థానంలో ఉందని తెలిపారు. చర్ల మండలంలో అన్ని రంగాల కార్మికులు సిఐటియులోనే ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మిషన్ భగీరథ కార్మికుల యూనియన్ నాయకులు పృథ్వీ, విద్యాసాగర్, కిషోర్ ప్రశాంత్, నవీన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన ఆర్డీవో

నవతెలంగాణ -టేకులపల్లి



మండలంలో జరుగుతున్న సోషియో ఎకనామిక్ సర్వేను కొత్తగూడెం ఆర్డీవో డి.మధు పరిశీలించినట్లు తహసీల్దార్ బుధవారం నాగ భవాని తెలిపారు. మండలంలోని ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మీ కుటుంబ సభ్యుల వివరాలకు తప్పక నమోదు చేయించుకుని అధికారులకు సహకరించగలరని మండల ప్రజలను కోరారు.

క్రాప్ డిజిటల్ సర్వే ఏఈఓ ఒక్కరే ఎలా చేయాలి..?

- మహిళ ఉద్యోగులకు ఎలా సాధ్యం...?
- రాష్ట్ర వ్యాప్తంగా 58 మందిపై సస్పెన్షన్ వేటు...!
- ఎత్తివేయాలని ఏఈఓల నిరసనలు

నవతెలంగాణ -కూసుమంచి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ పంట సర్వే పథకం కారణంగా రాష్ట్రంలో వ్యవసాయ శాఖలో ఉన్నతాధికారులకు వ్యవసాయ విస్తరణ అధికారులకు మధ్య చిచ్చు రగులుతూనే ఉంది. అదనపు సిబ్బంది లేకుండా ఒక్కరమే సర్వే చేయలేమంటూ ఒక క్లస్టర్ లోని ఆరుగురు ఏడుగురు చేయవలసిన డిజిటల్ క్రాప్ సర్వేని ఒక్కరే ఎలా చేయాలని, అలాగే ఎక్కడో గ్రామాలకు దూరంగా అడవులకు దగ్గరగా జనసంచారం లేని ప్రదేశాలలో ఉండే పంట భూములలో మహిళా ఉద్యోగులు ఎటువంటి తోడు లేకుండా ఒంటరిగా తిరుగుతూ ప్రతి గుంట భూమిలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులను ఆదేశించడంపై ఆ శాఖ ఉన్నతాధికారిపై రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ విస్తరణ అధికారులు మండిపడుతున్నారు. వారు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

60 శాతం మహిళ ఏఈఓలు..!

వ్యవసాయ శాఖలో 60శాతం కంటే ఎక్కువగా మహిళా ఏఈఓలు ఉన్నారని, పంట సర్వేలో భాగంగా తమకు జరగరానిది ఏదైనా జరిగితే తమ కుటుంబాలకు ఉన్నతాధికారులు ఏ విధమైన భరోసా కల్పిస్తారని మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ సదరు ఉన్నతాధికారి నుండి ఎటువంటి హామీ రాలేదు.

గత 45 రోజులుగా నిరసన కార్యక్రమాలు...

రాష్ట్రవ్యాప్తంగా ఏఈఓలు శాంతియుత నిరసనలు తెలియజేస్తున్నారు. క్షేత్రస్థాయిలో తమకు ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నప్పటికీ సమస్యలను పరిష్కరించకపోగా రాష్ట్ర వ్యాప్తంగా 58 మంది అధికారులపై సస్పెన్షన్ విధించడాన్ని నిరసిస్తున్నారు. ఉన్నతాధికారుల ఈ చర్యను "ఏఈఓలపై కక్షనా..? లేక రాష్ట్రంలో వ్యవసాయ రంగ వృద్ధికి పరీక్షా?" అని ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్నారు. మహిళా ఉద్యోగుల భద్రత పట్ల వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరిపై రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న మహిళా ఏఈఓలు మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో నేలపై కూర్చొని నిరసనలు తెలుపగా పురుష అధికారులు సైతం వారికి మద్దతుగా నేలపై కూర్చొని నిరసనలు తెలియజేశారు. మహిళా అధికారులు భారీ నిర్జన ప్రదేశాలలో ఒంటరిగా తిరగడం వల్ల తమ మాన ప్రాణాలకు సంభవించే ప్రమాదాల దృష్ట్యా, తమ వ్యక్తిగత భద్రత దృష్ట్యా మాత్రమే తాము డిజిటల్ పంట సర్వే చేపట్టడానికి జంకుతున్నామని తెలిపారు. గత ఏడు సంవత్సరాల కాలంలో క్షేత్రస్థాయిలో ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నో ప్రతిష్టాత్మక పథకాలను చిత్తశుద్ధితో అమలు చేశామని తెలిపారు.

మహిళ ఏఈఓలకు రక్షణ కరువు...?

గతంలో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఆలేరు క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగిని కంట్లో కారం కొట్టి గుర్తుతెలియని వ్యక్తి బంగారు నగలు దోచుకు వెళ్లిన సంఘటనను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. రైతు వేదికలలో మహిళా ఉద్యోగుల కాలకృత్యాలకు సంబంధించి సరైన ఏర్పాట్లు చేయకపోవడంపై మహిళా ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు.

వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించడంతో పాటుగా మహిళా ఏఈఓ ల భద్రత విషయంలో తప్పనిసరిగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మహిళా ఏఈఓలు కోరారు. 58 మంది అధికారులపై ఉన్న సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని ఈ సందర్భంగా ఏఈవోలు డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వమే సమస్యను పరిష్కారించాలి..

రాష్ట్రవ్యాప్తంగా ఏఈఓలను ఒంటరిగా వెళ్లి పంట పొలాల్లో డిజిటల్ సర్వేను చేయడం అనేది చాలా కష్టంతో కూడుకున్న పని, ముఖ్యంగా మహిళ ఏఈవో లకం తీవ్రమైన సమస్యగా మారిందని, ఈ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ సమస్యను పరిష్కరించాలని ఏఈవోలు విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొన్నారు.



'శ్రీ చైతన్య' మరో ప్రపంచ రికార్డు

- 20 రాష్ట్రాల నుంచి 10 వేల మంది విద్యార్థులు
- 100 రోజుల్లో విద్యార్థులను నిష్ణాతులుగా మార్చే ప్రత్యేక శిక్షణ

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

శ్రీ చైతన్య విద్యాసంస్థ మరో ప్రపంచ రికార్డును సృష్టించింది. 20 రాష్ట్రాలు 120 బ్రాంచ్‌లు 10,000 మంది విద్యార్థులు, ఒకటి నుంచి 600 గణిత సూత్రాలను అప్పజెప్పి అబ్బురపరిచారు.. ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులు. ఇప్పటికే 3 ప్రపంచ రికార్డులు సృష్టించి విజయకేతనాన్ని ఎగరవేసిన శ్రీ చైతన్య.. తాజాగా బుధవారం జరిగిన శిక్షణలో మరో ప్రపంచ రికార్డును సృష్టించింది. నల్లగండ్ల బ్రాంచ్‌కు చెందిన మెమరిక్స్ విభాగానికి చెందిన ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులు రెండున్నర ఏండ్ల నుంచి 10 ఏండ్ల లోపు విద్యార్థులు 600 గణిత సూత్రాలను అవలీలగా చెప్పి సూపర్ హైట్రిక్ వరల్డ్ రికార్డ్ సృష్టించి విజయకేతనం ఎగురవేశారు. ఈ విజయానికి ప్రోత్సహించిన సహకరించిన శ్రీ చైతన్య సీఓఏ పుష్పవల్లి, ఏజీఎం శివరామ కృష్ణ, ఆర్ఐ అనిత, అకాడమీ కోఆర్డినేటర్ అన్నపూర్ణ, నల్లగండ్ల ప్రైమరీ ఇన్‌చార్జి అమల, ప్రాథమిక విభాగానికి చెందిన ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు నల్లగండ్ల బ్రాంచ్‌కు చెందిన ప్రిన్సిపాల్ వాణి అభినందనలు తెలిపారు.

కులగణన పారదర్శకంగా జరగాలి

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కులగణన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రభుత్వాన్ని కోరింది. బుధవారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ కులగణన అవసరమని అన్నారు. దాని వల్లే జనాభా శాతాన్ని బట్టి రిజర్వేషన్లను కేటాయించడానికి అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. దేశంలో కులవివక్ష, అసమానతలు ఉన్నాయనీ, అవి ఏ మేరకు ఉన్నాయో ఈ కులగణన కార్యక్రమం ద్వారా తెలుస్తుందన్నారు. కులగణనపై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయనీ, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. మూసీ నది పునరుజ్జీవం సమస్యను తక్షణమే పరిష్కరించాలంటూ ముందుకు తేవడాన్ని ఆయన ఖండించారు. దానికోసం రూ.1.50 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయాలనుకోవడం సరైంది కాదన్నారు. మూసీ నది తీరం వెంట వేలాది పేద కుటుంబాలు నివాసముంటున్నాయనీ, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా తొలగించాలనుకోవడం అన్యాయమని విమర్శించారు. రైతు భరోసా, రూ.రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2,500 వంటి అనేక హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవానికి పూనుకోవడం పట్ల తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె రమ, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సూర్యం, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎల్ పద్మ, వి ప్రవీణ్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు డి స్వరూప, నగర అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మిబాయి, వరలక్ష్మి, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థుల ఎంపికకు పరిశీలకుల నియామకం

- 8 వరకు ప్రక్రియ పూర్తి చేయాలి : పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ-2008) అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, ఎంపిక ప్రక్రియ కోసం ఉన్నతాధికారులను జిల్లాస్థాయి పరిశీలకులుగా పాఠశాల విద్యాశాఖ నియమించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంగారెడ్డికి హైదరాబాద్ ఆర్జేడీ ఈ విజయలక్ష్మి, నల్లగొండకు సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ పి రాజీవ్, రంగారెడ్డికి విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పి మదన్ మోహన్, హన్మకొండకు వయోజన విద్య సంచాలకులు జి ఉషారాణి, ఖమ్మంకు మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి, నిజామాబాద్‌కు ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఏ ఉషారాణి, ఆదిలాబాద్‌కు వరంగల్ ఆర్జేడీ కె సత్యనారాయణరెడ్డి, కరీంనగర్‌కు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ ఎం సోమిరెడ్డి, మహబూబ్‌నగర్‌కు సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ బి వెంకటనర్సమ్మను నియమించామని తెలిపారు. డీఎస్సీ-2008లో నష్టపోయిన బీఈడీ అభ్యర్థులకు సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) కాంట్రాక్టు ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ మినహా మిగిలిన తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో కాంట్రాక్టు ఉద్యోగాలను ఇవ్వనుంది. పరిశీలన, ఎంపిక ప్రక్రియను జిల్లాల్లో పూర్తి చేయాలని పరిశీలకులను ఆదేశించారు. డీఈవోలు పరిశీలకులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియను ఈనెల ఎనిమిదో తేదీలోగా పూర్తి చేయాలని కోరారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థుల వివరాల జాబితాను సమర్పించాలని ఆదేశించారు. డీఎస్సీ-2008 నోటిఫికేషన్‌లో ఎస్జీటీ పోస్టులు వంద శాతం డీఈడీ, బీఈడీ అభ్యర్థులకు చెందుతాయని నాటి ప్రభుత్వం ప్రకటించింది. కానీ 2009, జనవరి 29న అప్పటి ప్రభుత్వం విడుదల చేసిన జీవోనెంబర్ 28 ప్రకారం 30 శాతం ఎస్జీటీ పోస్టులు డీఈడీ అభ్యర్థులకే కేటాయించబడతాయని స్పష్టం చేసింది. దీంతో బీఈడీ అభ్యర్థులు డీఎస్సీ-2008కి అర్హత సాధించినా ఉద్యోగాలు పొందకుండా నష్టపోయారు. ఉద్యోగాలు కావాలని వారు అప్పటినుంచి ఇప్పటి వరకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. డీఎస్సీ-2008లో నష్టపోయిన బీఈడీ అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా 2,367 మంది ఉన్నట్టు విద్యాశాఖ గుర్తించింది.

సీఎం సహాయనిధికి అపెక్స్ బ్యాంకు రూ.కోటిన్నర విరాళం

- సీఎం రేవంత్‌రెడ్డికి చైర్మెన్, వైస్ చైర్మెన్ చెక్కందజేత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం సహాయ నిధికి తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ పాలకవర్గం రూ. 1,51,01,116 ని ప్రకటించింది. దానికి సంబంధించిన చెక్కును బుధవారం హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డికి ఆయన నివాసంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆ బ్యాంకు చైర్మెన్ ఎం.రవీందర్‌రావు, వైస్ చైర్మెన్ కె.సత్తయ్య, పాలకమండలి సభ్యులు అందజేశారు.

రాష్ట్రంలో నిలిచిన మద్యం సరఫరా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం మద్యం సరఫరా నిలిచిపోయింది. సాంకేతిక కారణాల వల్ల మద్యం డిపోల నుంచి డీలర్లు లిక్కర్‌ను తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో షాపులకు ఆన్‌లైన్ ద్వారా మద్యం సరఫరా కొనసాగుతోంది. ఈ క్రమంలో డీలర్లు మద్యం కోసం డిపోల చుట్టూ తిరుగుతున్నారు. అనుకోకుండా ఏర్పడ్డ సాంకేతిక సమస్యను రాత్రి లోపు పరిష్కరిస్తామని ఆబ్కారీ శాఖ అధికారులు తెలిపారు.

సీసీఎల్ అసిస్టెంట్ సెక్రెటరీగా లచ్చిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిప్యూటీ కలెక్టర్ వి.లచ్చిరెడ్డిని భూ పారిపాలనా శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రెటరీగా నియమిస్తూ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జీవో 408ని విడుదల చేశారు. ఇటీవల ఆయనను సీఎంఆర్‌వో ప్రాజెక్ట్ డైరెక్టర్ పోస్ట్ నుంచి బదిలీ చేసిన ప్రభుత్వం వెకెన్సీలో ఉంచింది. అయితే తాజాగా అదే కార్యాలయానికి అదనపు కార్యదర్శిగా ప్రభుత్వం నియమించడం గమనార్హం .

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

- జీవో 60 ప్రకారం వేతనాలివ్వాలి
- జీపీ కార్మికుల డిమాండ్
- తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

నవతెలంగాణ- మొఫసిల్ యంత్రాంగం



తమ వేతన బకాయిలు విడుదల చేయడంతో పాటు జీవో51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపట్టారు. నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చాగంటి వెంకటయ్య ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయ ప్రధాన గేటు వద్ద జీపీ కార్మికులు బైటాయించి ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాకు అందజేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. గ్రామపంచాయతీలలో కొనసాగుతున్న జీవో51తో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట కార్మికులు ఒక్కరోజు దీక్ష చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి జీపీ కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి దీక్షలో పాల్గొన్నారు.సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. కేవల్ కిషన్ భవన్ నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చారు. అనంతరం గేటు ఎదుట బైటాయించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు మాట్లాడుతూ.. గ్రామాల్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మురికిలో మగ్గుతూ పనిచేస్తున్న కార్మికులకు వేతనాలివ్వకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దారుణమన్నారు. కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలేవీ అమలు కావడం లేదన్నారు. కార్మికుల వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నల్లగొండ మున్సిపాలిటీ ఎదుట మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల రిలే నిరాహార దీక్ష 3వ రోజు కొనసాగింది. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి సందర్శించి మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు రావలసిన పెండింగ్ ఏరియర్స్, ఇతర స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే నవంబర్ 12 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్‌ఎం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో ఒక్క రోజు దీక్ష నిర్వహించారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకులు తోకల నరేష్ అధ్యక్షతన జరిగిన సభలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్ మాట్లాడారు. కార్మికుల పట్ల ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికుల పాలిట మరణ శాసనంలా ఉన్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని, కారోబార్, బిల్ కలెక్టర్‌లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు పది లక్షల రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని అన్నారు.

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- రెండ్రోజులకొక గీత కార్మికుడు మృతి : కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ
- తాటి, ఈత చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి
- జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలి : రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి

నవతెలంగాణ-జనగామ



కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ డిమాండ్ చేశారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో కుర్ర ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన కేజీకేఎస్ జిల్లా సమావేశంలో ఎంవీ రమణ మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని అన్నారు. ఏటా సుమారు 550మంది చెట్టుపై నుంచి జారి పడుతున్నారని, వీరిలో 180 మంది చనిపోతున్నారని తెలిపారు. సరాసరి రెండు రోజులకొక్కరు గీతాకార్మికులు చనిపోతున్నారన్నారు. ప్రమాదాలను నివారించడానికి కాటమయ్య రక్ష సేఫ్టీ కిట్టులను పంపిణీ చేయాలన్నారు. లిక్కర్, బెల్టుషాపులు, శీతల పానీయాల వల్ల కల్లు అమ్మకాలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీరా, తాటి, ఈత ఉత్పత్తుల శిక్షణా కేంద్రం ఏర్పాటు, నందనంలో 5 ఎకరాల భూమి కొనుగోలు కార్యక్రమాలు.. చేపట్టినప్పటికీ తగిన శ్రద్ధ చూపక పోవడంతో టాడీ కార్పొరేషన్ నిర్వీర్యమైందన్నారు.

గత ప్రభుత్వం టూరిజంశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నక్లెస్ రోడ్‌లో నీరా కేఫ్ ఏర్పాటు చేసిందని, దీన్ని టాడీ కార్పొరేషన్ ద్వారా నిర్వహించి జిల్లాలకు విస్తరింప చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురై చనిపోయిన వారి కుటుంబా లకు, శాశ్వత వికలాంగులకు రూ.10 లక్షలు, తాత్కాలిక వికలాంగులకు రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా నెల రోజుల లోపు ఇవ్వాలని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా 50 ఏండ్లు నిండిన ప్రతి గీత కార్మికునికి చేయూత పథకం ద్వారా రూ. 5వేలు చెల్లించాలని, వృత్తికి ఉపయోగపడే ద్విచక్ర వాహనాలు ఇవ్వాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హయాంలో కోటి వరాల పథకంలో ఇచ్చిన 439 సొసైటీల భూములకు ఫెన్సింగ్ చేయించాలని, తదితర డిమాండ్లు పరిష్కరించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి మాట్లాడుతూ.. తాటి, ఈత చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా కొత్త చట్టం తీసుకురావా లన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు.

జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో నవంబర్ 30న జరిగే జిల్లా సదస్సును జయ ప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కమ్మగాని నాగన్న, కనకటి రాజయ్య, జిల్లా కమిటీ సభ్యులు భాస్కర్, శ్రీనివాస్, వెంకటేష్, మహేందర్, ఉపేందర్, శ్రీధర్, శంకరయ్య, కొండయ్య, రమేష్, వరం దామ, కృష్ణమూర్తి, వెంకటయ్య, బుసి గంపల సమ్మయ్య, పోతుల అంజయ్య, మూల వైకుంఠం, ములుగూరి సంతోష్, గూడా రవీందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తేయాలి

- ఇథనాల్ కంపెనీల ఏర్పాటుపై పున:సమీక్షించాలి : తెలంగాణ పీపుల్స్ జేఏసీ కన్వీనర్ ప్రొ.హరగోపాల్



నవతెలంగాణ- హిమాయత్‌నగర్

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సామాజిక బాధ్యత కలిగిన ప్రజాపక్ష విద్యావేత్త ఆరేపల్లి విజయ్ కుమార్‌పై ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను బేషరుతుగా ఎత్తేయాలని తెలంగాణ పీపుల్స్ జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో తెలంగాణ పీపుల్స్ జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్, పీవోడబ్ల్యూ జాతీయ అధ్యక్షులు వి.సంధ్య, కమిటీ కో-కన్వీనర్లు అంబటి నాగయ్య, కన్నెగంటి రవి తదితరులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ, జేఏసీ చైర్మెన్‌గా ప్రజా ఉద్యమాలకు సంఘీభావం తెలుపుతున్నారని చెప్పారు. ఇథనాల్ పరిశ్రమలకు వ్యతిరేకంగా పోరాడుతున్నందున ఆయనను విద్యాశాఖాధికారులు ఈ నెల 2న సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. దాంతోపాటు నిర్మల్ నుంచి ఆయన బయటకు వెళ్లడానికి అనుమతి లేదంటూ పెట్టిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని కోరారు. చిత్తనూరు, దిలావర్పూర్, గుండంపల్లి, రాష్ట్రంలోని ఇతర చోట్ల ఇథనాల్ కంపెనీల ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాడుతున్న గ్రామీణ ప్రజలతో ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ కంపెనీల విషయంలో ప్రజలు లేవనెత్తుతున్న అభ్యంతరాలను లోతుగా పరిశీలించాలని, ప్రజలు, ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని కోరారు. రాష్ట్రంలో 30 ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం పున:సమీక్షించాలని, కేంద్ర ప్రభుత్వం విచక్షణా రహితంగా తెచ్చిన ఇథనాల్ పాలసీని ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలు సంఘాల నేతలు విస్సా కిరణ్ కుమార్, బి.కొండల్ రెడ్డి, కరుణాకర్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించడంలో సర్కారు విఫలం

పోతినేని సుదర్శన్‌రావు, టి. సాగర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి. సాగర్ విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని (ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్) ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర ఆఫీస్‌బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రభుత్వం పట్ల రైతాంగంలో వ్యతిరేకత ప్రారంభమైందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని చెప్పారు. పంట రుణాలు 2024-25 వానాకాలానికి రూ.81,477 కోట్లు ప్రణాళిక రూపొందించి నేటి వరకు ఆరు లక్షల మందికి రూ.10 వేల కోట్లు మాత్రమే రుణ పంపిణీ చేశారని తెలిపారు. రైతులు వ్యవసాయ తరుణంలో ప్రయివేటు రుణాలను అధిక వడ్డీకి తెచ్చి అప్పులౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వానాకాలం రైతు భరోసాను ఎగవేసే ప్రయత్నం చేస్తున్నదన్నారు. రైతు భరోసాను యాసంగితో కలిపి వెంటనే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధరణిలోని లోపాలను ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్నప్పటికీ పరిష్కారం కాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని గుర్తు చేశారు. కాలయాపనను నివారించి భూమాత సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రాష్ట్రంలో ఏటా ఆరు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయనీ, ప్రభుత్వం రైతాంగానికి ఉపయోగపడే విధంగా పంటల బీమా పథకాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. సన్నవడ్లకే కాకుండా దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి ధాన్యం కొట్టుకుపోతుందని చెప్పారు. పత్తి కొనుగోలు కేంద్రాలను సీసీఐ పెంచాలనీ, తేమ పేరుతో రైతాంగానికి నష్టం చేయవద్దని కోరారు. కౌలు రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, బొంతల చంద్రా రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎంఎల్‌ఏలు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహ్మారెడ్డి, పి.జంగారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, మాదినేని రమేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు మూడ్ శోభన్, లెల్లెల బాలకృష్ణ, కందాల ప్రమీల, అన్నవరపు సత్యనారాయణ, బొంతు రాంబాబు, మాటూరి బాల్‌రాజ్ గౌడ్, ఈసంపెల్లి బాబు, శెట్టిపల్లి సత్తి రెడ్డి, యం శ్రీనివాసులు, పల్లపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చాలని వేధింపులు.. కుటుంబం ఆత్మహత్య

- బాసర గోదావరిలో దూకిన తండ్రి, కూతురు గల్లంతు
- తల్లిని కాపాడిన స్థానికులు
- కూతురిపై అసభ్య పదజాలం వాడటంతో మనస్తాపం చెందినట్టు సమాచారం

నవతెలంగాణ-నవీపేట్/కంఠేశ్వర్

వ్యాపారం కోసం చేసిన అప్పులు తీర్చాలని అప్పులోళ్ల వేధింపులు తారా స్థాయికి చేరి కూతురిపై అసభ్య పదజాలం వాడటంతో మనస్తాపం చెందిన తల్లిదండ్రులు కూతురిని తీసుకొని బాసర గోదావరిలో మునిగి ఆత్మహత్యకు యత్నించారు. తండ్రి, కూతురు నీటిలో గల్లంతవగా స్థానికులు తల్లిని కాపాడారు. ఈ ఘటన నిర్మల్ జిల్లా బాసర గోదావరి వంతెన వద్ద బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాల్కల్ రోడ్డుకు చెందిన దంపతులు ఉప్పలించి వేణు, అనురాధ కుటుంబం.. గంజి మార్కెట్‌లో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి కూతురు పూర్ణిమ ఉన్నారు. కాగా, వ్యాపార నిమిత్తం వేణు వ్యాపారులు రోషన్, వికాస్ దగ్గర సుమారు రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. వడ్డీకి చక్రవడ్డీ వేసి అప్పు కట్టాలని, లేకపోతే ఇంటికి మనుషులను పంపించి వయసులో ఉన్న కూతురితో పాటు ఆడవాళ్ళను అవమానించేలా చేస్తామని అప్పు ఇచ్చిన వారు బెదిరించేవారు. దాంతో గత్యంతరం లేక ఆత్మహత్యకు పూనుకున్నట్టు బాధితురాలు అనురాధ ఘటనాస్థలం వద్ద స్థానికులకు, పోలీసులకు కంటతడి పెడుతూ ఆవేదన వ్యక్తం చేసింది. తండ్రి వేణు మృతదేహం లభించగా కూతురి పూర్ణిమ మృతదేహం కోసం పోలీసులు గాలిస్తున్నారు. సీఐ మల్లేష్, ఎస్ఐ మహేష్.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కాంగ్రెస్ హయాంలో కులవృత్తులకు పెద్దపీట

- కాటమయ్య కిట్లతో గీత కార్మికులకు భరోసా
- బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికే సర్వే : మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కుల వృత్తులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని, కాటమయ్య కిట్లతో గీత కార్మికులకు భరోసా కల్పిస్తుందని మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ తెలిపారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ పరిధిలో 60 కాటమయ్య కిట్లను లబ్దిదారులకు టీఎస్ఐఐసీ చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరుతో కలిసి మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ అందజేశారు. ఈ సందర్భంగా అటవీ, దేవాదాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. సంప్రదాయ పద్ధతిలో కల్లుగీస్తూ ఎంతో మంది గీత కార్మికులు ప్రమాదాల బారినపడి ప్రాణాలు పోగొట్టుకున్నారని అన్నారు. అలాంటివి ఇక ముందు జరగకుండా ఉండటానికి ప్రభుత్వం వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో గీత కార్మికులకు శిక్షణనివ్వడంతోపాటు ఉచితంగా కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. కాటమయ్య కిట్లు గీత కార్మికులకు ఆత్మస్థైర్యం ఇవ్వడంతో పాటు ప్రమాదాల బారిన పడకుండా కాపాడుతాయన్నారు.

బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. గత పదేండ్లలో ప్రమాదాల బారిన పడి సుమారు 750 మంది వరకు గీత కార్మికులు చనిపోయారని, అలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు కాటమయ్య కిట్లు ఉపయోగపడతాయని అన్నారు.

నీరా విక్రయ కేంద్రాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా వెనకబడిన తరగతుల అధికారి జగదీష్, జిల్లా ఎక్సైజ్ సూపరిండెంటెండ్ నవీన్ చంద్, జిల్లా కల్లు గీత కార్మికుల సంఘం అధ్యక్షులు ఆశన్న గౌడ్, కార్యదర్శి రమేష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డెడికేటెడ్ కమిషన్ చైర్మెన్‌గా బూసాని వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన డెడికేటెడ్ కమిషన్ చైర్మెన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంక టేశ్వరరావు, సభ్యులుగా ఐఎఫ్ఎస్ అధికారి, బీసీ గురుకులాల కార్యదర్శి బడుగు సైదులు బుధవారం హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్‌లో గల డీఎస్ఎస్ భవన్ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపల నివేదిక తయారు చేయడానికి తమ కమిషన్ పనిచేస్తుందని తెలిపారు. అనంతరం బూసాని వెంకటేశ్వరరావు, సైదులు ఖైరతాబాద్‌లో బీసీ కమిషన్ చైర్మెన్ జి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి, ఇంతవరకు బీసీ కమిషన్ జరిపిన అధ్యయన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్, శ్రీనివాస్ రావు, లక్ష్మి నారాయణ రీసెర్చ్ ఆఫీసర్, ప్రత్యేకాధికారి జి. సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాగులతో అదిరే రుచులు



మన శరీరానికి ఎన్నోరకాల ఆరోగ్యకర ప్రయోజనాలను అందించే సిరి ధాన్యాల్లో రాగులు కూడా చాలా ముఖ్యమైనవి. రాగుల్లో కాల్షియం పుష్కలంగా ఉండటం వల్ల ఎముకలు బలంగా ఉండేందుకు సహాయపడుతుంది. దానిలోని కాల్షియం పిల్లల సక్రమ ఎదుగుదలకు తోడ్పడుతుంది. వయసు పెరిగే వారికి కూడా ఇందులోని కాల్షియం బాగా సహాయపడుతుంది. అలాగే మహిళల్లో ఎముకల పటుత్వానికి రాగులు ఎంతో మంచిది. ఈ చిరుధాన్యంలో కొవ్వు ఉండదు. పీచు, ఐరన్ కూడా ఎక్కువే. రోజువారీ ఆహారంలో వీటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం పెంచడంలో, బరువు తగ్గించడంలో సాయపడతాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలోనూ ఇది ఎంతో ఉపయోగపడుతుంది. వెజిటేరియన్లకు మంచి ప్రొటీన్ దొరికే ఆహారం ఇది. ఎన్నో పోషకాలున్న రాగులతో చేసే అల్పాహారాలు కొన్ని నేటి మానవిలో...

స్వీట్ అట్టు...

కావలసిన పదార్థాలు : రాగిపిండి -



500 గ్రాములు, బెల్లం : 25 గ్రాములు, నీళ్ల : తగినంత, నూనె : తగినంత, ఉప్పు : కొద్దిగా. యాలుకలు - రెండు.

తయారీ విధానం :
ముందుగా బెల్లంను నీటిలో కరిగించాలి.. ఈ నీటిలో రాగి పిండి, యాలుకల పొడి వేసి కలిపి బాగా కలపాలి. ఈ మిశ్రమం పలుచగా ఉండేటట్లు సరిచూసుకోవాలి. స్టవ్ వెలిగించుకుని పెనం పెట్టుకోవాలి. అది బాగా కాగిన తర్వాత గరిటతో కలిపి ఉంచిన పిండిని దోశెలా వెయ్యాలి. అట్టును రెండువైపులా కాల్చాలి.. అంతే రాగి స్వీట్ అట్టు రెడీ.. ఎంతో సింపుల్ గా అయిపోతుంది. మీరు కూడా ట్రై చెయ్యండి.. తియ్యగా ఉంటుంది కాబట్టి పిల్లలూ ఇష్టంగా తింటారు..

పూరి..

కావలసిన పదార్థాలు : రాగి పిండి - 100 గ్రాములు, మైదా : 25 గ్రాములు, నూనె : 120 గ్రాములు, ఉప్పు : తగినంత, నీళ్ల : తగినంత.

తయారీ విధానం : ఒక గిన్నె తీసుకొని మైదా, రాగి పిండిలో ఉప్పు, తగినన్ని నీళ్ళు



పోసి పూరి పిండిలాగా కలుపుకోవాలి. పిండిని అరగంటపాటు నాననివ్వాలి. ఉండల్లా చుట్టుకొని పూరీల్లా చేసుకోవాలి. ఈ పూరీలను బాగా మరిగిన నూనెలో వేయించుకోవాలి.. కాంబినేషన్‌గా పుదీనా చట్నీతో వీటిని తీసుకుంటే రుచి మరింత పెరుగుతుంది.



ఇడ్లీ..

కావలసిన పదార్థాలు : రాగి పిండి - 60 గ్రాములు, మినపపిండి - 20 గ్రాములు, ఉప్పు : తగినంత.

తయారీ విధానం : మినపప్పును నానబెట్టుకొని రుబ్బుకోవాలి. దీనికి రాగి పిండిని కలిపి సమపాళ్ళలో నీటిని కలిపి ఇడ్లీ పిండిలా కలుపుకోవాలి. దీన్ని రాత్రంతా నాననివ్వాలి. తరువాత రోజు ఇడ్లీ పాత్రలో ఇడ్లీలవలె పోసి 15 నిమిషాలు ఉడక నివ్వాలి. అల్లం చట్నీ, పల్లీ చట్నీలతో తింటే ఇడ్లీలు చాలా బాగుంటాయి. ట్రై చెయ్యండి..

ఉప్మా

కావలసిన పదార్థాలు : రాగి పిండి - ఒక కప్పు, ఆవాలు ఒక స్పూను, జీలకర్ర -



ఒక స్పూను, నూనె - రెండు స్పూన్లు, పల్లీలు - రెండు స్పూన్లు, శనగపప్పు - కొంచెం, పచ్చిమిర్చి - 2, ఉల్లిపాయలు - ఒకటి సన్నగా తరుగుకోవాలి), కరివేపాకు - రెండు రెమ్మలు, కొత్తిమీర - చిటికెడు, ఉప్పు - అవసరమైనంత, నీరు - రెండు కప్పులు, నిమ్మరసం - ఒక స్పూన్

తయారీ విధానం :
ముందుగా స్టవ్ మీద కళాయి పెట్టి అందులో ఒక స్పూన్ నూనె వేయాలి. వేడి అయిన తర్వాత రాగుల పిండిని వేసి సువాసన వచ్చేవరకు వేయించాలి. తర్వాత మరో కళాయిని స్టవ్ మీద పెట్టాలి. అందులో నూనె పోసి వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, శనగపప్పు వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. తర్వాత కరివేపాకు, ఉల్లిపాయలు, మిగిలినవి వేసుకుని వేయించాలి. వేగాక అందులో నీళ్ల పోసి నిదానంగా రాగుల పిండి వేస్తూ కలుపుతూ ఉండాలి. ఇప్పుడు మూత పెట్టి 5 నిమిషాలు తక్కువ మంట మీద నీళ్ల ఆరిపోయే వరకు ఉడకనివ్వాలి. నీళ్ళు పూర్తిగా ఆరిపోయాక అందులో నిమ్మరసం, కొత్తిమీర చల్లి దింపితే రాగి ఉప్మా రెడీ.

పకోడీ...

కావలసిన పదార్థాలు:
రాగి పిండి - ఒక కప్పు, శనగపిండి - పావు కప్పు, ఉల్లిపాయలు - రెండు (సన్నగా పొడవుగా తరుగుకోవాలి), పచ్చిమిర్చి -



నాలుగు, కొత్తిమీర - కొద్దిగా, జీలకర్ర - పావు టీస్పూన్, అల్లం - కొద్దిగా, ఉప్పు - రుచికి తగినంత, నూనె - వేయించడానికి తగినంత.

తయారీ విధానం: ఒక పాత్రలో రాగి పిండి, శనగపిండి (బెసన్), ఉప్పు, జీలకర్ర, పచ్చిమిర్చి ముక్కలు, సన్నగా తరిగిన అల్లం ముక్కలు వేసి బాగా కలపండి. నాలుగు స్పూన్ల నూనెను వేడి చేసి ఈ పిండిలో వేసి కలుపుకోవాలి. ఆ తర్వాత కొద్దికొద్దిగా నీరు పోసి ఉండలు లేకుండా మృదువైన ముద్దలా చేసుకోవాలి. ఈ ముద్దలో చిన్న ముక్కలుగా తరిగిన ఉల్లిపాయలు, కొత్తిమీర వేసి మరొకసారి కలుపుకోవాలి. కడాయిలో నూనె వేడి చేసి, ఈ మిశ్రమాన్ని పకోడీల ఆకారంలో వేసి, రెండు వైపులా బంగారు రంగు వచ్చే వరకు వేయించండి. అంతే వేడి వేడి పకోడీ రెడీ.

పసికందులను దగ్గు వేధిస్తుంటే...

ప్రస్తుతం ఇన్ఫెక్షను ఎక్కువయ్యాయి. పిల్లలను ఇలాంటి ఇన్ఫెక్షన్లు మరింత ఇబ్బంది పెడుతున్నాయి. పసిపిల్లలకు ఆగకుండా దగ్గు వస్తే వెంటనే పిల్లల స్పెషలిస్టను సంప్రదించాలి. డాక్టర్‌ను కలవడానికి మరింత



సమయం పడుతుందనుకున్నప్పుడు కొన్ని చిట్కాలను పాటిస్తే పిల్లలకు ఊరట కలుగుతుంది. ఈ చిట్కాలను కూడా వైద్యులను సంప్రదించే పాటించాలి.

దగ్గు చాలా రకాలుగా వుంటుంది. పొడి దగ్గు, కఫం దగ్గు, ఇలా రకరకాలుగా వుంటాయి. కొన్ని సందర్భాల్లో దగ్గితే రక్తం రావడం, మింగడానికి కూడా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతుంది. పసికందులు, లేదా చిన్నారులు దగ్గినప్పుడు కఫం బయటకు వస్తుంది. వారి శరీరం హైడ్రేటెడ్‌గా వుండేలా చూసుకోవాలి. లేదంటే శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఈ పరిస్థితిలో తల్లిపాలనివ్వడం శ్రేయస్కరం.

పసికందు ముక్కులో ఓటీసీ సెలైన్ డ్రాపులు వేయవచ్చు. ఒక ముక్కు రంధ్రంలో రెండు లేదా మూడు సెలైన్ డ్రాపులు వేయాలి. అలాగే వారి ముక్కులో కఫాన్ని క్లీన్ చేస్తూ వుండాలి. దీని కోసం చిన్న సక్షన్ ట్యూబులు వుంటాయ్. ఈ సక్షన్ ట్యూబుల సాయంతో పసిపిల్లల ముక్కులో మ్యూకస్ లేకుండా చూసుకోవాలి.

హ్యూమిడిఫైయర్‌ను ఉపయోగించడం వల్ల పిల్లలకు వేడి గాలి వస్తుంది. ఈ వేడి గాలిని పీల్చడం వల్ల కఫంతోపాటు ఏదైనా వుంటే బయటకు వచ్చేస్తుంది, కరిగిపోతుంది. బాత్‌రూంలో హాట్ వాటర్ షవర్‌ని ఆన్ చేసి 10 నిమిషాలు బాత్‌రూంను క్లోజ్ చేయాలి. అప్పుడు బాత్‌రూం లోపల వేడి గాలి మొత్తం నిండిపోయి వుంటుంది. బిడ్డను ఆ బాత్‌రూం లోకి తీసుకొని వెళ్లి చాతిపై నిమరడం వల్ల కఫం బయటకు వస్తుంది.

సిగరెట్ తాగేవారిని పిల్లలకు దూరంగా ఉంచాలి. పిల్లలకు వాడే బట్టలు, పరుపులు నీట్‌గా వుండేలా జాగ్రత్తపడాలి. పిల్లలకు దగ్గు రావడానికి చాలా కారణాలున్నాయి. చలికాలంలో వాతావరణ మార్పుల వల్ల దగ్గు ఎక్కువగా వస్తుంది. కొత్తరకాల వైరస్‌ల వల్ల కూడా దగ్గు వస్తుంది. నుమోనియా కూడా దగ్గు వచ్చేలా చేస్తుంది. కాబట్టి పిల్లలకు దగ్గు వస్తే తక్కువ అంచనా వేయకుండా వెంటనే అప్రమత్తమై వైద్యులను సంప్రదించాలి.

చలికాలంలో పిల్లలకు దగ్గు ఎక్కువగా వస్తుంది. ఈ సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే దగ్గు బారిన పడకుండా వుంటారు. బేబీ మాయిశ్చరైజర్‌ను క్రమం తప్పకుండా ఉపయోగించాలి. బేబీ చుట్టూ పరిశుభ్రంగా వుండేలా చూసుకోవాలి. బేబీ వున్న రూంలో ఉష్ణోగ్రత తగినట్లు వుండేలా, మరీ ఎక్కువ చలి లేకుండా జాగ్రత్త పడాలి.

సామాన్యుల సంగతేంటి?

చేరిందని, అయినా వాటిని నియంత్రించడంలో కేంద్రం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. సంఘటిత, అసంఘటిత రంగంలోని ప్రజలు ధరల్ని భరించలేని పరిస్థితి నెలకొందన్నారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సిన కేంద్రం మీనమేషాలు లెక్కపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యధికంగా ప్రజలు ఉపయోగించే టమాటా, ఆలు, ఉల్లి ధరలు వందల రెట్లు పెరిగిపోయాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం కేంద్రం దారిలోనే నడుస్తోందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రైతులు పండించిన పత్తి, వరి ధాన్యం కొనుగోలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించడంలో కేంద్రం నిర్లక్ష్యంగా ఉంటోందన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు సంగారెడ్డి పట్టణంలో జనవరి25 నుంచి 28 తేదీల్లో జరగనున్నాయని తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, తెలంగాణ ప్రజల సంక్షోభంపై చర్చించనున్నట్టు చెప్పారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ సంగారెడ్డిలో జరిగే పార్టీ రాష్ట్ర మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. మహాసభల సందర్భంగా జనవరి 25న జరిగే బహిరంగసభకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్‌కరత్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు, ఎం.నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యులు రేవంత్ కుమార్, లలిత, కృష్ణ, నాయకులు అశోక్, నరసింహారెడ్డి, సునీతా, మద్దూరు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ఇండ్లకు స్టిక్కర్లు

(మొదటిపేజీ తరువాయి)

సేకరించారు. రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వేను కొన్ని చోట్ల మంత్రులు, మరికొన్ని చోట్ల జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. విద్య ఉపాధి, సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రణాళిక కోసం సర్వే చేపట్టినట్టు మంత్రులు తెలిపారు. రేషన్‌కార్డులు, ఆరోగ్య శ్రీ లాంటి ప్రభుత్వ పథకాలకు దూరమవుతారని జరుగుతున్న ప్రచారం అవాస్తవని అన్నారు. ఆధార్ ప్రామాణికం కాదన్నారు. ఎలాంటి పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా శంకరపల్లిలో శ్రీధర్‌బాబు ప్రారంభించారు. హైదరాబాద్‌లో మొదటి రోజు ఇంటింటికీ స్టిక్కర్‌లు వేశారు. జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి అధికారులు స్టిక్కర్ అంటించారు. పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు సర్వేను పరిశీలించారు. మొత్తంగా మొదటి రోజు సర్వే ప్రశాంతంగా జరిగింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని రాంపల్లి దాయర, గోధుమకుంటలో సర్వేను కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ రాధికా గుప్తా పరిశీలించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముందుగా గుర్తింపు చేసిన గృహాలకు స్టిక్కర్లు వేస్తున్నారు. సాయంత్రం అధికారులు వచ్చి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. ఎన్యూమరేటర్ ప్రతి ఇంటికీ వెళ్లి సమాచారాలు సేకరిస్తున్నారు. మెదక్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. అటవీ, దేవాదాయ, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రులు కొండ సురేఖ, దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి పట్టణం, చిట్కూల్ గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభించారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండాలో సర్వేను అధికారులు తనిఖీ చేశారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్యునరేటర్ సేకరిస్తున్న వివరాలను భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ కలెక్టర్ పరిశీలించారు. ఫారం నింపే సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు వంటి పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ కోరారు. నల్లగొండలో సర్వేను కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించారు. మొదటి రోజు ఉమ్మడి జిల్లాలో ఇండ్లకు స్టిక్కర్లు అంటించారు.

సర్వే నిర్వహణలో లోపాలపై కలెక్టర్ ఆగ్రహం

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో సర్వేను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. గెర్జం గ్రామంలో ఇండ్ల జాబితా సర్వే సరిగా నిర్వహించకపోవడం, స్టిక్కర్లపై సరైన వివరాలు నమోదు చేయకపోవడం, సర్వేకు సంబంధించి మ్యాప్, ఎక్కడి నుంచి ఎక్కడి వరకు సర్వే నిర్వహించాలో ముందుగా నిర్ధారించకపోవడం, సర్వేలో తప్పులు నమోదు చేయడంతో ఎంపీడీఓ లక్ష్మణ్, ఏఓ కైలాస్, పంచాయతీ సెక్రటరీ సయ్యద్ ఏజాజ్ హస్మికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

'పీఎం విద్యాలక్ష్మి'కి ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. అనంతరం నేషనల్ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. పీఎం విద్యాలక్ష్మి పథకం కింద ఉన్నత విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పొందిన వారు ఆయా సంస్థల్లో చదువుకునేందుకు రుణాలు పొందవచ్చన్నారు. ఈ రుణాలకు కొలేటరల్, గ్యారంటర్ అవసరం లేదని తెలిపారు. దేశవ్యాప్తంగా 860 ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ హామీతో రూ.7.50 లక్షల వరకూ రుణం పొందవచ్చని, రుణంలో 75 శాతం బ్యాంకులకు కేంద్రం గ్యారెంటీ ఇస్తుందని, ఈ పథకం కింద ఏటా గరిష్టంగా 22 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతారని అన్నారు. వార్షిక కుటుంబ ఆదాయం రూ.8 లక్షల వరకూ ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రూ.10 లక్షల వరకూ 3 శాత వడ్డీ రాయితీ కల్పించనున్నారు. 'పీఎం విద్యా లక్ష్మి' పోర్టల్ ద్వారా విద్యార్థులు నేరుగా రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి ఉన్నత విద్యతకు దూరం కాకూడదనేదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి తెలిపారు.

ఎఫ్‌సీఐకి మూలధన పెట్టుబడికి రూ.10,700 కోట్లు ఈక్విటీ

ప్రధాని మోడీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు మూలధన పెట్టుబడి కోసం రూ.10,700 కోట్ల ఈక్విటీని సమకూర్చడానికి ఆమోదం తెలిపిందని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఊతమివ్వడంతో పాటు దేశవ్యాప్తంగా రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. వ్యూహాత్మక చర్య రైతులకు మద్దతు ఇవ్వడానికి, దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వ స్థిరమైన నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు ఆహార ధాన్యాల సేకరణ, వ్యూహాత్మక ఆహార ధాన్యాల నిల్వల నిర్వహణ, సంక్షేమ పథకాల కింద ఆహార ధాన్యాల పంపిణీ, మార్కెట్లో ఆహార ధాన్యాల ధరల స్థిరీకరణతో దేశ ఆహార భద్రతలో ఎఫ్‌సీఐ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈక్విటీ సమీకరణ ఎఫ్‌సీఐ తన విధిని సమర్థవంతంగా అమలు చేయడంలో నిర్వహణ సామర్థ్యాలను పెంచ డానికి కీలకమైన అడుగని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఎఫ్‌సీఐ తక్షణ ఆర్థిక అవసరాల కోసం స్వల్ప కాలిక రుణాలపై ఆధారపడుతోందని, ఇప్పుడు లభించే ఈక్విటీ సంస్థ వడ్డీ భారాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. తద్వారా కేంద్ర ప్రభుత్వ సబ్సిడీని కూడా తగ్గిస్తుందని అన్నారు.

ప్రజలపై మోడీ సర్కార్‌కు ఆసక్తి లేదు

ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. మోడీ ప్రభుత్వం ప్రజలను రక్షించడానికి ఆసక్తి చూపడం లేదని, అభివృద్ధి చెందిన దేశాలు, కార్పొరేట్ల ఒత్తిడికి లొంగిపోయిందన్నారు. రైతుల తీవ్ర ప్రతిఘటన ఫలితంగా మోడీ ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. అయితే ఇది అభివృద్ధి చెందిన దేశాలు, బహుళజాతి సంస్థలకు మింగుడు పడటం లేదని తెలిపారు. వారు భారతదేశ వ్యవసాయం, వ్యవసాయ మార్కెట్లను అనేక విధాలుగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాయని వివరించారు. ఇందుకోసం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)ను ప్రయోగిస్తున్నాయని, నయా ఉదారవాద ఆర్థిక విధానాలు దేశ ప్రజల పోషకాహార స్థితిని ప్రతికూలంగా ప్రభావితం చేశాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం మంది ప్రజలు పోషకాహార లోపంతో ఉన్నారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయని గుర్తుచేశారు. దేశంలో ప్రజలకు పోషకాహారం అందించేందుకు కేంద్రం సిద్ధంగా లేదని విమర్శించారు. అందుకే దేశంలో ఆకలి చావులు, గ్రామీణ నిరుద్యోగం పెరుగుతోందన్నారు. అయినా మోడీ ప్రభుత్వంలో చలనం రావటం లేదని దుయ్యబట్టారు. వ్యవసాయం లేకుండా గ్రామీణాభివృద్ధి సాధ్యం కాదని, అలాంటి వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నా.. పట్టించుకోకపోగా, అసలు ఆత్మహత్యలే జరగలేదని చెప్పే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) రైతుల మరణాలను, ఆత్మహత్యలను లెక్కించటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ నేతలు అశోక్ దావలే, విజుకృష్ణన్, హన్నన్ మొల్లా, పి. కృష్ణప్రసాద్, నిలీష్ విలత్ తదితరులు మాట్లాడారు.

అందరికీ సామాజిక న్యాయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజ్యాంగ లక్ష్యాల సాధన కోసం అందరికీ సామాజిక న్యాయం అందించేందుకు కులగణన చేపట్టినట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కులగణన నిర్వహిస్తే ఎవరెంత మంది ఉన్నారో తెలుస్తుందనీ, ఆ వివరాలతో వారికి రాజకీయ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించేందుకు వీలు కలుగుతుందని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో నిర్వహించిన సర్వే ఎవరి కోసం నిర్వహించారో? ఎందుకోసం నిర్వహించారో? వారికే తెలియాలని ఎద్దేవా వేశారు. బీఆర్ఎస్ సమగ్ర కుటుంబ సర్వే లెక్కలకు కాలం చెల్లిపోయిందని, అందులోని సర్వే అంశాలు.. కుల గణన సర్వే అంశాలు భిన్నమైనవని అన్నారు. బీఆర్ఎస్ తీరుగా కాకుండా తాము చేపట్టిన కులగణన వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. అయితే కుటుంబాలు, వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచ నున్నట్టు



చెప్పారు. సంపదను, సహజ వనరులను, ఆస్తులను సమానంగా అందరికీ అందించాలన్నదే తమ విధానమనీ, ఇది ఇష్టం లేకే కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సమగ్ర సమాచారం వస్తే.. సంపద ఇంకా ఎంత మందికి అందలేదు అనేది తెలుస్తుందని చెప్పారు. రాజకీయ అవకాశాలు అందాయా..? ఎలాంటి అవకాశాలు వచ్చాయి అనేది సర్వేలో తేలుతుందని స్పష్టం చేశారు. సర్వే కుల వివాదాలను రగిలిస్తుందన్న ఆరోపణలు అర్థరహితమని, తెలంగాణ కులగణన దేశానికి దిక్సూచీ వంటిదని, రోల్ మోడల్ అని ఇప్పటికే రాహుల్ గాంధీ సైతం చెప్పారని గుర్తు చేశారు. సర్వేకు ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉపయోగించుకోవడం విద్యాహక్కు చట్టం నిబంధనలను ఉల్లంఘించడమే నని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించడం అవగాహనా రాహిత్యమని కొట్టి పారేశారు. బీహార్‌లో కులగణన ప్రక్రియ సత్ఫలితాలిచ్చిందా లేదా అన్నది ఆ రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారమన్నారు. దేశంలో అనేక సామాజిక సమస్యలకు కులగణనతో పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు క్యాబినెట్ నిర్ణయించి, అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రవ్యాప్తంగా సర్వే మొదలుపెట్టినట్టు తెలిపారు. ఈ సర్వే భవిష్యత్తులో ప్రణాళికలు రూపొందించేందుకు ఉపయోగపడు తుందని చెప్పారు. దేశ స్వాతంత్ర్యం, సొంత రాజ్యాంగంలా కులగణన విప్లవాత్మకమైన చర్య అని అభివర్ణించారు. దేశంలో కులం, కులవివక్ష ఉందనేది వాస్తవమన్నారు. ఈ సర్వే రిపోర్టులో బయటపడుతుందని చెప్పారు. ఆ వివక్షను రూపుమాపే క్రమంలో కులగణన దోహదపడుతుందని తెలిపారు.

ప్రత్యేక హోదా పునరుద్ధరించండి

శ్రీనగర్ : ఆర్టికల్ 370 ప్రకారం గతంలో కల్పించిన ప్రత్యేక రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కోరుతూ జమ్మూకాశ్మీర్ శాసనసభ బుధవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. 2019 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో జమ్మూకాశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా...జమ్మూ కాశ్మీర్, లడఖ్...విభజించారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోరుతూ నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, ఉప ముఖ్యమంత్రి సురీందర్ కుమార్ చౌదరి శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

'జమ్మూకాశ్మీర్ శాసనసభ ప్రత్యేక హోదా, రాజ్యాంగ గ్యారంటీల ప్రాధాన్యతను పునరుద్ఘాటిస్తోంది. అవి జమ్మూకాశ్మీర్ ప్రజల గుర్తింపు, సంస్కృతి, హక్కులను పరిరక్షిస్తాయి. వీటిని ఏకపక్షంగా తొలగించడంపై ఈ సభ ఆందోళన వ్యక్తం చేస్తోంది' అని ఆ తీర్మానంలో తెలియజేశారు. ప్రత్యేక హోదా, రాజ్యాంగ గ్యారంటీల పునరుద్ధరణ కోసం జమ్మూకాశ్మీర్ ప్రజా ప్రతినిధులతో సంప్రదింపులు ప్రారంభించాలని, రాజ్యాంగ వ్యవస్థలపై దృష్టి సారించాలని ఆ తీర్మానంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు చేపట్టే ఏ ప్రక్రియ అయినా దేశ ఐక్యతను, జమ్మూకాశ్మీర్ ప్రజల చట్టబద్ధమైన ఆకాంక్షలను పరిరక్షించాలని తెలిపారు. ప్రతిపక్ష బీజేపీ సభ్యుల నిరసనల మధ్య తీర్మానాన్ని సభ ఆమోదించింది. తీర్మానం సభా వ్యవహారాల జాబితాలో లేదని ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ ప్రస్తావించారు. జమ్మూకాశ్మీర్ శాసనసభకు ఎన్నికలు జరిగిన తర్వాత అసెంబ్లీ సమావేశం కావడం ఇదే మొదటిసారి. పది సంవత్సరాల విరామం తర్వాత జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. అంతేకాక ఆర్టికల్ 370 రద్దు తర్వాత సభ జరగడం కూడా ఇదే తొలిసారి.

సబ్సిడీ టార్పాలిన్లు అందేనా?

(మొదటిపేజీ తరువాయి)

నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి వారు తీవ్ర నష్టానికి గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసి, వాటిని కాంటా వేసే వరకు కనీసం 20 రోజులు పడుతుంది. ఈ సమయంలో వర్షాలు పడితే ధాన్యం తడిసిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యం తడుస్తుందన్న భయంతో రూ.2వేల నుంచి రూ.3వేల వరకు అద్దె చెల్లించి తెచ్చుకుంటున్నట్టు రైతులు చెబుతున్నారు. ఈ లెక్కన మండల వ్యాప్తంగా సుమారు రూ.1.90 కోట్ల నుంచి రూ.2.85 కోట్ల వరకు రైతులపై భారం పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై టార్పాలిన్లు అందజేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సబ్సిడీపై ఇవ్వాలి : అగయ్య, రైతు

టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకోవడంతో రూ.2500 నుంచి రూ.3వేల వరకు అదనపు భారం పడుతోంది. ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు ఇస్తే మాకు అనువుగా ఉంటుంది.

సరఫరా కావడంలేదు : మణి, వ్యవసాయ అధికారి

ఐదారేండ్లుగా ప్రభుత్వం నుంచి సబ్సిడీపై టార్పాలిన్లు సరఫరా కావడంలేదు. దాంతో రైతులకు అందించలేకపోతున్నాం. ప్రభుత్వం నుంచి వస్తే రైతులకు అందజేస్తాం.

జనగణనలో కులసర్వేను పరిగణనలోకి తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)



వర్మను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సర్వే విషయంలో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా నిలవనుందని తెలిపారు. బుధవారం నుంచి ప్రారంభమైన సర్వే తీరును, ప్రక్రియను, పూర్తి స్థాయి వివరాలను ఈ సందర్భంగా గవర్నర్‌కు ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం సీఎం తన సోదరుని కూతురు వివాహానికి గవర్నర్‌ను ఆహ్వానించారు. గవర్నర్‌తో భేటీ అయిన వారిలో సీఎంతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, గుత్తా అమిత్ రెడ్డి ఉన్నారు.

ఆదర్శంగా స్పోర్ట్స్ పాలసీ

- స్పోర్ట్స్ వర్సిటీలో కోర్సులపై సమగ్ర చర్చ
- క్రీడలపై శాట్ చైర్మెన్ సమీక్షా సమావేశం



నవతెలంగాణ-హైదరాబాద్ : తెలంగాణ నూతన క్రీడా పాలసీ దేశానికే ఆదర్శంగా ఉండనుందని, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు ఎటువంటి సిఫారసులతో అవసరం లేకుండా నేరుగా నగదు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ ఉద్యోగాలు పొందనున్నారని శాట్ చైర్మెన్ కే. శివసేనా రెడ్డి అన్నారు. క్రీడా పాలసీ, క్రీడా రంగం అభివృద్ధిపై బుధవారం గచ్చిబౌలిలోని శాట్ చైర్మెన్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సహా శాట్ క్రీడల ప్రత్యేక ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్, శాట్ వీసీ ఎండీ సోనిబాలా దేవి సహా ఉన్నతాధికారులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. గత పదేండ్లుగా కుంటుపడిన క్రీడా రంగాన్ని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, సీఎం కప్ నిర్వహణ, క్రీడా పాలసీలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్పోర్ట్స్ యూనివర్శిటీలో ఏయే కోర్సులు ఉండాలనే అంశంపై సమావేశంలో అభిప్రాయాలను తీసుకున్నారు. రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు హైదరాబాద్‌ను వేదికగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని ఈ సందర్భంగా సమావేశంలో శివసేనా రెడ్డి గుర్తు చేశారు.

తెలుగు టైటాన్స్ హ్యాట్రిక్

- తమిళ్ తలైవాస్‌పై సూపర్ విక్టరీ
- ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11



నవతెలంగాణ-హైదరాబాద్ : తెలుగు టైటాన్స్ తీన్‌మార్ మోగించింది. ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్లో వరుసగా మూడో విజయం సాధించిన తెలుగు టైటాన్స్ పాయింట్ల పట్టికలో నాల్గో స్థానానికి ఎగబాకింది. ఆఖరు కూత వరకు ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో 35-34తో తమిళ్ తలైవాస్‌పై తెలుగు టైటాన్స్ ఒక్క పాయింట్ తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. బుధవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య తెలుగు టైటాన్స్ జోరు కొనసాగించింది. ఫామ్‌లో ఉన్న తమిళ్ తలైవాస్‌ను బోల్తా కొట్టించింది. కెప్టెన్ పవన్ సెహ్రావత్ (12 పాయింట్లు) సూపర్ టెన్ షోతో అదరగొట్టగా.. మరో రెయిడర్ ఆశీష్ నర్వాల్ (9 పాయింట్లు)తో హైఫైతో చెలరేగాడు. తమిళ్ తలైవాస్ తరఫున రెయిడర్ సచిన్ తల్వార్ (17 పాయింట్లు) మెరిసినా ఆ జట్టుకు పరాజయం తప్పలేదు. సీజన్లో ఆడిన ఏడు మ్యాచుల్లో తెలుగు టైటాన్స్‌కు ఇది నాల్గో విజయం కాగా.. ఆరు మ్యాచుల్లో తమిళ్ తలైవాస్‌కు ఇది మూడో పరాజయం. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్‌పై 42-20తో యు ముంబా మెరుపు విజయం సాధించింది.

టాప్-10లో జైస్వాల్, పంత్‌కు చోటు

ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో రాణించిన జైస్వాల్, పంత్ తమ తమ ర్యాంకింగ్స్‌ను మెరుగుపరుచుకోగా.. నిరాశపరిచిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ర్యాంకింగ్స్‌లో వెనుకబడ్డారు. అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) బుధవారం ప్రకటించిన పురుషుల టెస్టు బ్యాటర్స్ ర్యాంకింగ్స్‌లో విరాట్ ఏకంగా 8 స్థానాలు కోల్పోయాడు. ఒకప్పుడు నంబర్ వన్ ర్యాంక్‌లో ఉన్న రన్ మెషీన్ ఇప్పుడు ఏకంగా 22వ ర్యాంకుకు పడిపోయాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 26వ స్థానంలో నిలిచాడు. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో రాణించిన టీమిండియా బ్యాటర్లు యశస్వి జైస్వాల్, వికెట్ కీపర్ రిషభ్ పంత్ తమ తమ ర్యాంక్‌లను మెరుగుపరుచుకున్నారు. యశస్వి 804 రేటింగ్ పాయింట్లతో 4వ ర్యాంక్‌లో నిలువగా.. పంత్ 750 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. టెస్ట్ బ్యాటర్ల జాబితాలో టీమిండియా నుంచి యశస్వి, పంత్ ఇద్దరే టాప్-10లో చోటు దక్కించుకున్నారు. తాజా ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ మాజీ సారథి జో రూట్ 903 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. కేన్ విలియమ్సన్ 804 పాయింట్లతో రెండో స్థానంలో నిలవగా.. పాకిస్థాన్‌పై ట్రిపుల్ సెంచరీతో మెరిసిన హ్యారీ బ్రూక్ 3వ ర్యాంక్‌కు ఎగబాకాడు. భారత పర్యటనలో రాణించిన న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్ 7స్థానంలో నిలువగా.. పాకిస్థాన్ స్టార్ సౌద్ షకీల్ 9వ ర్యాంక్, ఆస్ట్రేలియా ఆటగాళ్లలో ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా 8 వ ర్యాంక్, మార్నస్ లబూషేన్ 10వ ర్యాంక్ సొంతం చేసుకున్నారు.

ముగిసిన టీటీ టోర్నమెంట్



హైదరాబాద్ : నాలుగు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. హైదర్‌గూడలోని సెయింట్ పాల్ స్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో వైట్‌టైగర్ టేబుల్ టెన్నిస్ అకాడమీ ప్లేయర్ మైరా జైన్ అండర్-11 బాలికల విభాగంలో చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో అవియాపై 7-11, 11-9, 15-17, 11-7, 14-12తో మైరా జైన్ ఐదు సెట్ల మ్యాచ్‌లో విజయం సాధించింది. అండర్-15 గర్ల్స్‌లో అనిహ ఆనంద్, అండర్-15 బాయ్స్‌లో పి శ్రీ అనీశ్ విజేతలుగా నిలిచారు. తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు కృష్ణ కుమార్ మహేశ్వరి విజేతలకు బహుమతులు అందజేశారు.

19న నాదల్ వీడ్కోలు మ్యాచ్

తరలిరానున్న టెన్నిస్ దిగ్గజాలు



మాడ్రిడ్: టెన్నిస్ మాజీ వరల్డ్ నంబర్ వన్ ఆటగాడు, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ వీడ్కోలు మ్యాచ్‌కు తేదీ ఖరారైంది. ఈ ఏడాది జరిగే డేవిస్ కప్ ఫైనల్స్‌తో నాదల్ తన సుదీర్ఘ కెరీర్‌ను ముగించనున్నాడు. ఈ విషయాన్ని టోర్నమెంట్ డైరెక్టర్ ఫెలిసియానో లోపెజ్ బుధవారం వెల్లడించాడు. స్వదేశంలో జరుగబోయే డేవిస్ కప్ ఫైనల్స్ 8వ సీజన్ నాదల్‌కు ప్రొఫెషనల్ ప్లేయర్‌గా ఆఖరి మ్యాచ్. అక్కడి మలగాలో నవంబర్ 19న ఈ టోర్నీ మొదలు కానుంది. ఆరు రోజుల పాటు సాగే డేవిస్ కప్ ఫైనల్స్‌లో రఫా చివరిసారిగా దేశం తరఫున బరిలోకి దిగుతున్నాడు. దాంతో, అతడి విజయం సాధించాలని అభిమానులంతా కోరుకుంటున్నారు. టెన్నిస్ యోధుడైన నాదల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించి అతడికి ఘన వీడ్కోలు పలకాలని ఫెదరర్, జకోవిచ్, ముర్రేలతో పాటు పలువురు టెన్నిస్ స్టార్లు హాజరుకానున్నారని వెల్లడించాడు. నాదల్ అక్టోబర్‌లోనే టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పాడు. చివరి టోర్నీగా డేవిస్ కప్ ఫైనల్స్ ఆడుతానని అప్పుడే తెలిపాడు. కెరీర్‌లో 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించాడు.

ఆధిక్యత దిశలో ఉత్తరాఖండ్ జట్టు

వికెట్ నష్టానికి 232 పరుగులు



విజయనగరం : విజయనగరం జిల్లాలోని స్థానిక చింతలవలస క్రికెట్ అకాడమీలో బుధవారం ప్రారంభమైన రంజీ మ్యాచ్ లో ఉత్తరాఖండ్ ఆధిక్యంలో దూసుకెళుతోంది. తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు ఒక వికెట్ కోల్పోయి 232 పరుగులు చేసింది. తొలిరోజు 87 ఓవర్లు ఆడిన ఉత్తరాఖండ్ జట్టు 232 పరుగులు చేసింది. ఈ జట్టు లో ఓపెనర్ అవినాష్ సుధ 86 పరుగులు చేసి ఔట్ కాగా మరో ఓపెనర్ పిఎస్ కందురి 107 పరుగులతో నాటౌట్ గా క్రీజ్ లో ఉన్నాడు. సమరాత్ 30 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. ఆరుగురు బౌలర్లను ఉపయోగించిన ఆంధ్ర జట్టు వికెట్ తీయడంలో విఫలమయ్యారు. ఆంధ్ర జట్టు లో లలిత్ మోహన్ 26 ఓవర్లు వేసి వికెట్ తీసి 83 పరుగులిచ్చాడు.

ఐపీఎల్ వేలం బరిలో 1,574 మంది ఆటగాళ్లు

తొలిసారి సౌదీ అరేబియాలో నిర్వహణకు ఏర్పాట్లు



ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) మెగా వేలానికి రంగం సిద్ధమైంది. ఈసారి మొత్తం 1574మంది ఆటగాళ్లు వేలం బరిలో నిలిచారు. తొలిసారి మెగా వేలాన్ని సౌదీ అరేబియాలోని జెడ్డాలో నిర్వహించనున్నారు. సోమవారంతో ఆటగాళ్ల నమోదు అధికారికంగా ముగియగా.. మొత్తం 1574 మంది క్రికెటర్లు వేలం కోసం పేర్లు నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందులో 1,165 మంది భారతీయులు, 409 మంది విదేశీయులు ఉన్నారు. గత సీజన్ వరకు కెప్టెన్‌లుగా ఉన్న రిషభ్ పంత్(ఢిల్లీ), కేఎల్ రాహుల్ (లక్నో), శ్రేయస్ అయ్యర్ (కోల్‌కతా)లను ఫ్రాంఛైజీలు అట్టిపెట్టుకోలేదు. ఈ ముగ్గురు స్టార్ ఆటగాళ్లు తమ కనీస ధర రూ.2 కోట్లుగా నిర్ణయించుకున్నారు. రవిచంద్రన్ అశ్విన్, యుజ్వేంద్ర చాహల్, మహ్మద్ షమి, ఇషాన్ కిషన్, దీపక్ చాహర్, వెంకటేశ్ అయ్యర్, అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్, భువనేశ్వర్ కుమార్, ప్రసిద్ధ్ కృష్ణ, నటరాజన్, పడిక్కల్, కృనాల్ పాండ్య, హర్షల్ పటేల్, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, ఖలీల్ అహ్మద్, ఉమేశ్ యాదవ్ కూడా రూ.2 కోట్ల కనీస ధరతో వేలంలో పేరు నమోదు చేసుకున్నారు. యువ క్రికెటర్లు సర్ఫరాజ్ ఖాన్, పృథ్వీ షా బేస్ ధర రూ.75 లక్షలుగా నిర్ణయించుకున్నారు. గత సీజన్‌లో రూ.24.50 కోట్ల ధర పలికిన మిచెల్ స్టార్క్ రూ.2 కోట్ల బేస్ ధరతో వేలంలో ఉన్నాడు.

తొలిసారి వేలం బరిలో ఆండర్సన్...

ఇంగ్లాండ్ మాజీ పేసర్ జేమ్స్ అండర్సన్ తొలిసారి ఐపీఎల్‌లో తన పేరును నమోదు చేసుకున్నాడు. అతడు రూ.1.25 కోట్ల కనీస ధరతో వేలంలో బరిలో నిలిచాడు. టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు (704) పడగొట్టిన అండర్సన్... ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. జిమ్మీ తన చివరి టి20 మ్యాచ్ 2014లో ఆడటం విశేషం. 2004లో టి20ల్లోకి అరంగేట్రం చేసిన అండర్సన్.. కెరీర్ మొత్తంలో 44 టి20లే ఆడి 41 వికెట్లు పడగొట్టాడు.

సాకర్ మైదానంలో ఆటగాడిపై పిడుగు

ఒకరి మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు



లిమా(పెరూ): పెరూలో విషాదం చోటుచేసుకుంది. ఫుట్‌బాల్ స్టేడియంలో పిడుగు పడడంతో ఒక ఆటగాడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఆటగాడిపై పిడుగు నేరుగా పడడాన్ని ప్రత్యక్షంగా చూసిన అభిమానులు ఒక్కసారి తీవ్ర షాక్‌కు గురయ్యారు. పెరూలోని హువాస్ కాయో ప్రాంతంలో సాకర్ మ్యాచ్ నిర్వహించారు. అయితే, మ్యాచ్ మధ్యలో వర్షం పడడంతో రిఫరీ మ్యాచ్‌ను నిలిపివేశాడు. ఆటగాళ్లు తమ డగౌట్‌కు వెళుతుండగా, పెద్ద శబ్దంతో పిడుగుపడింది. దాంతో ఓ ఆటగాడు, రిఫరీ కుప్పకూలిపోయారు. రిఫరీకి తీవ్రగాయాలు కాగా, ఆటగాడుపై నేరుగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మరణించాడు. మరో నలుగురికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ(ఏపీఎస్డీఎంఏ) తన సోషల్ ద్వారా షేర్ చేసింది.

నవచిత్రం

వాస్తవ ఘటనలతో 'జాతర'



దీయా రాజ్, శివ బాలాజీ

సతీష్ బాబు రాటకొండ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన సినిమా 'జాతర'. దీయా రాజ్ హీరోయిన్. గల్లా మంజునాథ్ సమర్పణలో మూవీటెక్ ఎల్ఎల్‌సితో కలిసి రాధాకృష్ణ ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 8న థియేటర్స్‌లోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

హీరో, దర్శకుడు సతీష్ బాబు మాట్లాడుతూ, 'వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ కథ రాశాను. ఊరి కట్టుబాట్లు, ఆ తంతులు, అందులో జరిగే ఘటనల గురించి చూపించాం. ఈ చిత్రానికి నిర్మాతలు బ్యాక్ బోన్‌లా నిలబడ్డారు. నటుడిగా, దర్శకుడిగా ఇది నాకు మొదటి సినిమా. మా చిత్రాన్ని అందరూ చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు.

'సతీష్ చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. సినిమా కూడా బాగా తీశారు. సినిమా మీ అందరికీ నచ్చుతుంది' అని నిర్మాత శివ శంకర్ రెడ్డి చెప్పారు. నాయిక దీయా రాజ్ మాట్లాడుతూ, 'నాకు ఇందులో మంచి పాత్ర ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్' అని తెలిపారు. ఈ వేడుకలో పాల్గొన్న దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, శివబాలాజీ, ధృవవాయు, విశ్వకార్తికేయ చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

'లగ్గం టైమ్' ఎప్పుడంటే?




రాజేష్ మేరు, నవ్య చిత్యాల

సరికొత్త కథలతో సినిమాలను నిర్మించాలనే లక్ష్యంతో 20th సెంచరీ ఎంటర్‌టైన్‌మెంట్స్ అనే నూతన నిర్మాణ సంస్థ టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది.

ఈ బ్యానర్‌లో తెరకెక్కుతున్న తొలి చిత్రానికి 'లగ్గం టైమ్' అని టైటిల్ పెట్టినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను 'భీమ్లా నాయక్' దర్శకుడు సాగర్ కె చంద్ర ఆవిష్కరించారు. సినిమాపై ఫస్ట్‌లుక్ చాలా క్యూరియాసిటీని రైజ్ చేస్తోందని, ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలని ఆయన అభిలషించారు.

రాజేష్ మేరు, నవ్య చిత్యాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో నెల్లూరు సుదర్శన్, ప్రీతి సుందర్, ప్రణీత్ రెడ్డి తదితరులు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రజోత్ కె వెన్నం కథ అందించడమే కాకుండా డైరెక్ట్ చేస్తున్నారు. ఈ చిత్ర మ్యూజిక్ రైట్స్‌ను ఆదిత్య మీడియా కొనుగోలు చేసింది. పెళ్ళి నేపథ్యంలో సాగే ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను హత్తుకునే ఓ మంచి కథతో రానుందని, ఫ్యామిలీ మెంబర్స్‌తో ఎంజాయ్ చేసేలా సినిమా తీస్తున్నామని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కథా రచయిత, దర్శకుడు: ప్రజోత్ కె వెన్నం, నిర్మాత: కె. హిమ బిందు, సంగీతం- సినిమాటోగ్రఫీ : పవన్ గుంటుకు.

పవర్‌ఫుల్ కథతో 'హతవిధి'



లల్లీ మధుమిత

ఇషా క్రియేషన్స్ పతాకంపై లల్లీ మధుమిత నటించి, నిర్మించిన చిత్రం 'హతవిధి'. 'అఫెండర్' అనేది ట్యాగ్ లైన్.

రాహుల్ జి గౌలికర్ దర్శకత్వంలో విభిన్న కథ-కథనాలతో తెరకెక్కిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది.

లల్లీ మధుమిత - హరినాథ్ హీరో, హీరోయిన్లుగా, సుమన్, భానుచందర్, ఆమని, సమీర్, దేవీప్రసాద్ ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్ర ఫస్ట్ లుక్ రిలీజ్ వేడుకను మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

నిర్మాతలు సాయి వెంకట్, టి. రామసత్యనారాయణ, తెలంగాణ బి.సి. కమీషన్ మాజీ చైర్మన్ వి.కృష్ణమోహన్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొని, ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా లల్లీ మధుమిత మాట్లాడుతూ,'ఎన్నో భారీ వ్యయంతో రూపొందించిన ఈ చిత్రం మా ఫస్ట్‌లుక్ మాదిరిగానే అద్భుతంగా వచ్చింది. త్వరలోనే రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తాం' అని తెలిపారు. 'నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ ప్రాణం పెట్టి పనిచేయడం వల్లే సినిమా చాలా బాగా వచ్చింది' అని దర్శకుడు రాహుల్ జి గౌలికర్ అన్నారు.

పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటించిన సినిమా 'ధూం ధాం'. ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మించిన ఈచిత్రానికి సాయి కిషోర్ మచ్చా దర్శకుడు.

ఈ నెల 8న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో హీరో చేతన్ కృష్ణ మీడియాతో మాట్లాడుతూ, "ఫస్ట్ ర్యాంక్ రాజు, బీచ్ రోడ్ చేతన్, రోజులు మారాయి, గల్ఫ్' సినిమాల తర్వాత సకుటుంబంగా ఎంజాయ్ చేసేలా ఓ సినిమా చేయాలని అనుకున్నాను. నేను కోరుకున్న కథని గోపీమోహన్ అందించారు. తండ్రి కోసం కొడుకు, కొడుకు కోసం తండ్రి ఎక్కడి దాకా అయినా వెళ్తారు అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను రూపొందించాం. సెకండాఫ్ మొత్తం పెళ్లి ఇంట సందడితో సాగుతుంది. ఇదే మా సినిమాకు ఆకర్షణగా నిలుస్తుంది. అంతేకాదు థియేటర్లు అన్నీ నవ్వులతో నిండిపోతాయి. గోపీ సుందర్ ఛాట్ బస్టర్ సాంగ్స్ చేశారు. దర్శకుడు సాయికిషోర్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. నేను హీరోగా మంచి పొజిషన్‌లో ఉండాలని నాన్న కోరుకుంటారు. అందుకే ఈ సినిమాను గ్రాండ్‌గా తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ వాళ్లు మా సినిమాని రిలీజ్ చేయడం హ్యాపీ' అని అన్నారు.

దొరకునా ఇటువంటి ప్రేమ..

వర్ధన్ గుర్రాల, హమరేశ్, శాంతి తివారి, నిత్యశ్రీ ముఖ్య పాత్రల్లో హరీశ్ నాగరాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ట్రెండింగ్ లవ్'. దొరకునా ఇటువంటి ప్రేమ అనేది ట్యాగ్‌లైన్. తన్వీ ప్రొడక్షన్స్, ఆర్‌డిజి ప్రొడక్షన్స్ పతాకాలపై సంయుక్తంగా నిర్మాణం జరుపుకుంటున్న ఈ చిత్రానికి సోనుగుప్తా, రూపేశ్ డి గోయల్ నిర్మాతలు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను నటి, నిర్మాత కొణిదెల నిహారిక రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,'సమాజంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులను ఎలివేట్ చేసేలా ఈ సినిమా టైటిల్ ఉంది. సినిమాలోని కొన్ని కట్స్ చూశాను. చాలా బావున్నాయి. ఈ టీమ్‌కి చక్కని విజయం దక్కాలి' అని అన్నారు. 'టాలెంట్ ఉన్న ఎంతో మందికి కేరాఫ్ అడ్రస్‌గా పింక్ ఎలిఫెంట్ సంస్థ మారింది. అందుకే నిహారికను నేను టాలీవుడ్ బంగారం అంటుంటాను.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు

శివకార్తికేయన్, సాయి పల్లవి జంటగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించిన చిత్రం 'అమరన్'. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి కమల్ హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మించారు. సుధాకర్ రెడ్డి, నిఖిత రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ బ్యానర్ ద్వారా విడుదల చేశారు. దీపావళి కానుకగా విడుదలైన ఈ చిత్రం ఘన విజయాన్ని సాధించించి. ఇప్పటికీ సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతున్న సందర్భంగా 'అమరన్' బ్రేవ్ హార్ట్ బ్లాక్‌బస్టర్ పేరుతో మేకర్స్ సక్సెస్‌మీట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హీరో నితిన్ మాట్లాడుతూ, 'దీపావళికి వచ్చిన మూడు సినిమాలను పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. 'విక్రమ్, అమరన్' సినిమాల్లో మమ్మల్ని పార్ట్ చేసిన కమల్ హాసన్‌కి, మహేంద్రన్‌కి థ్యాంక్స్. ఒక దేశభక్తి సినిమాలో లవ్, ఫ్యామిలీ ఎలిమెంట్స్‌ని బ్లెండ్ చేయడం అంత ఈజీ కాదు. డైరెక్టర్ రాజ్ కుమార్ చాలా అద్భుతంగా ఈ సినిమాని తీర్చిదిద్దారు. క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషనల్ సీన్స్ రియల్లీ హార్ట్ టచింగ్' అని అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886